RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి


www.janamsakshi.org

సోమవారం 23.11.2026 | సంపుటి:13 సంచిక:123 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV



ప్రజాస్వామ్యంపై బీజేపీ దాడి.. ఎన్నికల సంఘం మౌనం!

ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో హక్కుల హరణం..

- ఓటు హక్కులను ప్రమాదంలోకి నెట్టే కుట్రలు
- ఎన్నికల కమిషనర్ల నియామకంలో కేంద్రం ఆధిపత్యం
- బెదిరింపులకు లొంగే వారికే కీలక పదవులా?
- న్యాయవ్యవస్థలో నియామకాల విషయంలోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది
- జ్ఞానేశ్ కుమార్ తీరుపై ప్రశాంత్ భూషణ్ తీవ్ర విమర్శలు

హైదరాబాద్(జనంసాక్షి):ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించినంత మాత్రాన పౌరసత్వం రద్దు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసినప్పటికీ, ఎస్ఐఆర్ ప్రక్రియను కొన్ని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పౌరసత్వానికి సంబంధించిన అంశంగా పరిగణిస్తున్నారంటూ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విమర్శించారు. హైదరాబాద్‌లో ఆదివారం ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్‌లో ఎస్ఐఆర్, ప్రజాస్వామ్యానికి ఎదురవు తున్న సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు ఓటు హక్కు కోల్పోయిన ప్రజలు రేషన్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర పౌర హక్కులకు కూడా దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 'సర్'పేరుతో ప్రజలపై పత్రాల భారం మోపడం, మిగతా 2లో..





దేశంలో ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచి, రాజ్యాంగ సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునే ప్రయత్నాలు జరుగుతున్నా యని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తీవ్రంగా విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో సామాన్య పౌరుల ఓటు హక్కును హరించే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నా యని, ఎన్నికల సంఘం స్వతంత్రత, విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గే వ్యక్తులకే కీలక రాజ్యాంగ పదవులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు

'సర్'ను అడ్డుకుంటే దేశద్రోహులేనట!

- సీఎం రేవంత్‌కు మోడీ అంటే భయం
- కరీంనగర్ మహాపాదయాత్ర చరిత్ర సృష్టించబోతోంది: బండి సంజయ్

కరీంనగర్(జనంసాక్షి):



ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్'ను అడ్డుకునే వాళ్లంతా దేశ ద్రోహులేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కరీంనగ ర్‌లోని గురుద్వారా వద్ద ఆదివారం సోలార్ ప్యానెల్‌ను ఆయన ప్రారంభించారు. మిగతా 2లో..

హైదరాబాద్‌లో బాంబులు పెట్టాం

పోలీసులకు బెదిరింపు మెయిల్

అప్రమత్తమై పలు ప్రాంతాల్లో తనిఖీలు

హైదరాబాద్(జనంసాక్షి):



నగరంలో పలు చోట్ల బాంబులు పేలుతాయంటూ పోలీసులకు బెదిరింపు మెయిల్ రావడం కలకలం రేపింది. 26/11 ఉగ్రదాడి తరహాలో దాడి జరుగుతుందని మెయిల్‌లో పేర్కొన్నారు. కాచిగూడ రైల్వేస్టేషన్ లక్ష్యంగా దాడులు చేస్తామని.. హోటల్ టూరిస్ట్ ప్లాజా వద్ద బాంబు పేలుస్తామంటూ హెచ్చరించారు. జమ్మూకశ్మీర్‌లో లష్కరే తయిబా టాప్ కమాండర్, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది లతీఫ్ భట్ హత్యకు ప్రతీకారంగా దాడులు చేస్తామని బెదిరించారు. దీంతో హైదరాబాద్ నగర పోలీసులను స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అప్రమత్తం చేశారు. లష్కరే మిగతా 2లో..

కోటి ఓట్లు సాధిస్తాం.. 90 సీట్లు గెలుచుకుంటాం

సంక్రాంతి తరువాత ప్రజాబలం కార్యక్రమం: సీఎం రేవంత్

- పార్టీ కోసం పనిచేసిన వారికి అవకాశమిచ్చాం.. ఇస్తూనే ఉంటాం
- పార్టీ లైన్‌లో ఉంటే పదవి దానంతట అదే వస్తుంది
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏపీలో ఒక్కప్రాజెక్టు కూడా చేపట్టలేదు
- కేసీఆర్, జగన్ హయాంలోనే పల్నాడు వాటర్ గ్రిడ్ మొదలైంది: రేవంత్‌రెడ్డి
- రాహుల్‌ను ప్రధాని చేసేందుకు మరింత శ్రమించాలి
- తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి సంబీప్ కుమార్



గాంధీభవన్‌లోని టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో నూతనంగా ఎంపికైన ఏఐసీసీ ఇన్‌ఛార్జి బీఎం సంబీప్ కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. చిత్రంలో మంత్రులు, కాంగ్రెస్ నాయకులు

హైదరాబాద్(జనంసాక్షి):కాంగ్రెస్‌పార్టీలో పైరవీలతో పదవులు ఎవ్వరికీ రావని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గాంధీభవన్‌లోని టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీలో నిజాయతీగా కష్టపడ్డ వారిని వెతుక్కుంటూ పదవులు ఇంటికే వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అంతేకాని దిల్లీలో అగ్రనేతలు, గాంధీభవన్ చుట్టూ చక్కర్లు కొడితే ఏ ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోటి మంది ఓట్లతో కాంగ్రెస్ 90 సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లోని టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో పైరవీలతో పదవులు ఎవ్వరికీ రావన్నారు. నాయకులు దిల్లీలో కాకుండా గ్రామాలు, గూడేలు, తండాల్లో తిరిగి ప్రజల్లో ఉండాలని సూచించారు. అలా తిరిగిన వారు ప్రస్తుతం ఉన్నత పదవుల్లో ఉన్నారని ఉదాహరణగా పలువురు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల పేర్లను ప్రస్తావించారు. పీసీసీ అధ్యక్షుడిగా తాను బాధ్యతలు స్వీకరించినప్పుడు కాంగ్రెస్ మిగతా 2లో..

"తెలంగాణలో కాంగ్రెస్ లేదు, మళ్లీ పెరగనివ్వకుండా అడ్డుకుంటానని కేసీఆర్ విర్రవీగారు. నేను పీసీసీ అధ్యక్షుడిగా డిజిటల్ మెంబర్‌షిప్ చేపట్టి దేశంలోనే అత్యధికంగా.. 90 రోజుల్లో 48 లక్షల సభ్యత్వాలు నమోదు చేయించా. ఆత్మవిశ్వాసాన్ని కేసీఆర్ దెబ్బతీసినప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలు విజయమో, వీర మరణమో అన్నట్లుగా సభ్యత్వాలు చేయించారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో 92,35,833 ఓట్లు తెచ్చుకుని 64 సీట్లు గెలుచుకుంది, ఒక సీటు సీపీఐ గెలిచింది. 90 లక్షల ఓట్లు రావడం వెనుక కార్యకర్తల కృషి ఎంతో ఉంది. పార్టీ కోసం పనిచేసిన అనేక మందికి టికెట్లు ఇచ్చి గెలిపించుకున్నాం.వచ్చే ఎన్నికల్లో కోటి ఓట్లతో 90 సీట్లు గెలుస్తాం..- సీఎం రేవంత్‌రెడ్డి

"కేంద్రం రాష్ట్రానికి తగినంత సహకారం అందించడం లేదు. కేంద్రం సహాయం లేకపోయినా కరవులో ప్రజల అవసరాలు తీరుస్తున్నాం. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పనితీరు దేశానికి స్ఫూర్తిదాయకంగా ఉంది. కాంగ్రెస్ పార్టీని దేశంలో అధికారంలోకి వచ్చే విధంగా కృషిచేసి రాహుల్‌ను ప్రధాని చేసేందుకు మరింత శ్రమించాలి" - తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి సంబీప్ కుమార్

మహిళల్ని లక్షాధికారులను చేయండి

రాజకీయాల నుంచి తప్పుకుంటాం

రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారుకు కౌంట్‌డౌన్ మొదలైంది

మళ్లీ అధికారంలోకి వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా

హన్మకొండ ప్రతినిధి(జనంసాక్షి):సీఎం రేవంత్‌రెడ్డి మహిళలను కోటీశ్వరులను చేస్తామని హామీ ఇచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు. కనీసం లక్షా ధికారులను చేయండని, కాంగ్రెస్ హామీలు అమలు చేస్తే రాజకీయం వదిలేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు.అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల మైదానంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో జన చైతన్య సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్ సహా ఆ జిల్లా ముఖ్యనేతలు హాజరయ్యారు.ఈ సందర్భంగా కేటీఆం మాట్లాడుతూ సీఎం రేవం త్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజమెత్తారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని హామీ ఇచ్చారని, కనీసం లక్షాధికారులను చేయాలని సూచించారు. కాంగ్రెస్ హామీలు అమలు చేస్తే రాజకీయం వదిలేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు. వరంగల్‌లో కనీసం వెయ్యి ఉద్యోగాలైనా కల్పించాలనే ఉద్దేశంతో 4 ఐటీ కంపెనీలను తెచ్చామని పేర్కొన్నారు.

సంక్షేమం సున్నా.. అభివృద్ధి గుండుసున్నా

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారుకు కౌంట్‌డౌన్ మొదలైందని, మళ్లీ అధికారంలోకి వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో సంక్షేమం సున్నా అభివృద్ధి గుండుసున్నా అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సర్కారులో అవినీతి, కమీషన్ల దందాను సొంత పార్టీ ఎమ్మెల్యేలు, నేతలే బట్టబయలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన కాకుండా పర్సంటేజీల పాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ముఖ్యమంత్రి వ్యక్తిగత

మిగతా 2లో..



భారతీయ సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు ఏమాత్రం అవగాహన లేదు

నిజమైన హిందువుగా వారిని ఆ వలయం నుంచి బయటకు తీసుకురావడం నా బాధ్యత ప్రధాని వ్యాఖ్యలు తన సొంత ప్రభుత్వ వైఫల్యాలను అంగీకరించుకోవడమే:రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారతీయ ఆధ్యాత్మిక, మత సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు ఏమాత్రం అవగాహన లేదంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఎలిఫెంటా గుహల్లో శివుడి ఒడిలో పార్వతీ దేవి కూర్చున్న 12వ శతాబ్దపు శిల్పం ఫొటోను ఆదివారం తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. నిజమైన హిందువుగా వారిని ఆ వలయం నుంచి బయటకు తీసుకు రావడం తన బాధ్యత అంటూ 'సత్యం శివం సుందరం' అని రాహుల్ పేర్కొన్నారు. భారతీయ ఆధ్యాత్మిక, మత సంప్రదాయాలను లోతుగా అర్థం చేసుకునేకొద్దీ ఒక విషయం స్పష్టమవుతోందని, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు సంస్కారం లేని, కులతత్వం, పురుషాధిక్య



భావజాలం కలిగి ఉన్నాయని రాహుల్ ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల హృదయాల్లో భయం, కోపం, ద్వేషం గూడుకట్టుకున్నాయని, అందుకే వారు మిగతా 2లో..

మంచుకురిసే వేళలో..

తెలంగాణను కప్పేసిన పొగమంచు




రాష్ట్రాల్లోని పలు జిల్లాలను మంచు దుప్పటి కప్పేసింది. తెలంగాణలో కరీంనగర్, ఆదిలాబాద్, ఏపీలోని బాపట్ల, అల్లూరి జిల్లాలతో పాటు ఒడిశాలోని పలు ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా అలుముకుంది. ఉదయం 8 దాటినా భానుడి జాడ కనిపించలేదు. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ భీకర దాడి

- పశ్చిమాసియాలో కొనసాగుతున్న అమెరికా బిగ్బంధనాన్ని ఎత్తివేయాలి
- ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి డిమాండ్
- హర్మూజ్‌లో రెండు ట్యాంకర్లపై దాడి

టెహ్రాన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తత నెలకొంది. బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలైన అల్-రిఫా, అవాలిలను లక్ష్యంగా చేసుకుని.. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసినట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది. అమెరికా దురాక్రమణ, తమ గగనతలాన్ని పదేపదే ఉల్లంఘిస్తున్నందుకు ప్రతీకారంగా ఈ దాడులు చేపట్టినట్లు ఇరాన్ తెలిపింది. ఈ దాడి కారణంగా ఒక పౌర పారిశ్రామిక కేంద్రం దెబ్బతిన్నట్లు బహ్రెయిన్ వెల్లడిం చింది. పలు డ్రోన్లను గగనతల మిగతా 2లో..



అగ్నివీరులు పెళ్లిచేసుకోవచ్చు

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



న్యూఢిల్లీ(జనంసాక్షి):రెండేళ్ల సర్వీసు పొడిగింపును ఎంచుకునే అగ్నివీరులు వివాహం చేసుకోవటానికి అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అగ్నిపథ్ కింద దేశసేవలో నిమగ్నమైన అగ్నివీరులకు మిగతా 2లో..

మృత్యు దారులు

- దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మృతి
- వికారాబాద్ జిల్లాలో ఆటో-లారీ ఢీ.. నలుగురి దుర్మరణం
- రాజస్థాన్ రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది భక్తుల మృతి
- దైవదర్శనం చేసుకుని తిరిగివెళ్తుండగా ఘటన
- గుజరాత్‌లోని కచ్ జిల్లాలో ట్రక్కు, కారు ఢీ.. ఏడుగురు మృతి

2

ఒడిశా టూ హైదరాబాద్

గంజాయి రవాణా.. ముగ్గురి అరెస్ట్

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23.11.2026

బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడి

రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని తెలిపింది. పెద్ద ఎత్తున ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. దౌత్య చర్చలను ముమ్మరం చేయాలి..

యుద్ధాన్ని ముగించడానికి కొనసాగుతున్న దౌత్య ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పేర్కొన్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న అమెరికా దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు హర్మూజ్‌ను తెరవబోమని స్పష్టం చేశారు. మరోవైపు శాంతి చర్చల్లో మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్ ప్రతినిధుల బృందం శనివారం టెహ్రాన్‌ను సందర్శించి, చర్చలు జరిపింది.

హర్మూజ్‌లో రెండు ట్యాంకర్లపై దాడి..

శనివారం హర్మూజ్ జలసంధిలోని రెండు ట్యాంకర్లపై దాడి జరిగినట్లు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (జఐటీఓ) ఏజెన్సీ వెల్లడించింది. అనధికార మార్గంలో ప్రయాణించిన మరో నౌక సీమైన్‌ను ఢీకొనడంతో మంటలు చెలరేగినట్లు తెలిపింది.

‘సర్’ను అడ్డుకుంటే దేశద్రోహులేనట!

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. “భాజపా అంటే సీఎం రేవంత్‌రెడ్డికి భయం. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటై భాజపాను అడ్డుకోవాలని చూస్తున్నాయి. మా పార్టీని తట్టుకునే దమ్ము కాంగ్రెస్‌కు లేదు. ఈసారి తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కారు తథ్యం. ‘సర్’పై వాస్తవాలు తెలియజెప్పేందుకే నవంబర్ 23న మహా పాదయాత్ర చేపడుతున్నాం. కరీంనగర్‌లో జరిగే మహా పాదయాత్ర చరిత్ర సృష్టించబోతోంది. ఈ ర్యాలీలో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి, జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, రాజ్యసభ సభ్యురాలు రేఖాశర్మ, తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు పాల్గొంటారు” అని బండి సంజయ్ అన్నారు.

ఒడిశా నుంచి హైదరాబాద్

గంజాయి రవాణా.. ముగ్గురి అరెస్ట్

హైదరాబాద్(జనంసాక్షి): ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టును మల్కాజిగిరి పోలీసులు రట్టు చేశారు. ఎస్‌వోటీ ఉప్పల్ జోన్, నాచారం పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి 60.380 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ దాదాపు రూ.30 లక్షల వరకు ఉంటుందని అంచనా. గంజాయి రవాణాకు ఉపయోగించిన కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.నాచారం– చిలుకానగర్ రోడ్డులో పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. కారులోని డిక్కీలో నాలుగు గోనె సంచుల్లో 60 గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. ఒడిశాలో కిలో రూ.2 వేల చొప్పున గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్, ముంబయిలో అధిక ధరకు విక్రయించేందుకు నిందితులు సిద్ధమయ్యారు. ఒక్కో ట్రిప్‌కు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు ఇస్తామని ప్రధాన నిందితుడు రాహుల్.. ఈ ముగ్గురు నిందితులకు ఆశ చూపినట్టు పోలీసులు తెలిపారు. రాహుల్ కోసం గాలింపు చేపట్టిన పోలీసులు.. గంజాయి మూలాలు, ఆర్థిక లావాదేవీలు, డెలివరీ నెట్‌వర్క్‌పై దర్యాప్తు చేస్తున్నారు.

అబ్బురపరిచిన ‘ఎయిర్ ఫెస్ట్’

ఆకట్టుకున్న వైమానిక విన్యాసాలు

మహారాష్ట్ర(జనంసాక్షి): భారత వాయుసేన నాగ్‌పుర్‌లోని వాయుసేన నగర్‌లో ‘ఎయిర్ ఫెస్ట్ 2026’ నిర్వహిస్తోంది. రెండ్రోజుల వేడుకలో భాగంగా నిర్వహించిన సూర్యకిరణ్ ఏరోబాటిక్, సారంగ్ హెలికాప్టర్ బృందాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సుఖోయ్ 30–ఎంకేఐ, ఆకాశ్ గంగా స్కై డైవింగ్ సాహసోపేత ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హాజరై ప్రదర్శనను తిలకించారు.



ప్రజాస్వామ్యంపై బీజేపీ దాడి.. ఎన్నికల సంఘం మౌనం!

చిన్నచిన్న వివరాల లోపాలకే ఓటు హక్కు కోల్పోయే పరిస్థితులు కల్పించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. పేదలు, వలస కార్మికులు, వృద్ధులు, నిరక్షరాస్యులు, నిరాశ్రయులు ఈ ప్రక్రియలో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన పెరగడం, దేశవ్యాప్తంగా హక్కుల పరిరక్షణకు ఉద్యమం రూపుదిద్దుకోవడం ఆశాజనక పరిణామమని అన్నారు.

ఎన్నికల కమిషనర్ల నియామకంలో కేంద్రం ఆధిపత్యం

ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులు ఎన్నికల సంఘం స్వతంత్రతను దెబ్బతీసేలా ఉన్నాయని ప్రశాంత్ భూషణ్ విమర్శించారు. గతంలో ఎన్నికల కమిషనర్ల నియామకంలో కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష అధికారాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నిస్తూ, ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ద్వారా నియామకాలు చేపట్టాలని సూచించిందని గుర్తుచేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చి, ఈ కమిటీలో సీజేఐ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చడం ద్వారా నియామకాలపై తన ఆధిపత్యాన్ని కొనసాగించేలా వ్యవస్థను మార్చిందని ఆరోపించారు. ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన కీలక పదవుల్లో ప్రభుత్వ ప్రభావం పెరిగితే ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు.ఈ నియామక చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయమూర్తుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయని భూషణ్ పేర్కొన్నారు. జస్టిస్ దీపాంకర్ దత్తా చట్టం రాజ్యాంగ విరుద్ధమనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిపారు. మరో న్యాయమూర్తి జస్టిస్ సతీష్ చంద్ర శర్మకు సంబంధించిన ప్రయోజనాల సంఘర్షణ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆయన కుమారుడిని ఎన్నికల సంఘం సీనియర్ న్యాయవాదిగా నియమించిన విషయాన్ని వెల్లడించకుండా విచారణ జరిపారని ఆరోపించారు. ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలని పట్టుబట్టడం వల్ల విచారణ సుదీర్ఘకాలం వాయిదా పడే అవకాశం ఏర్పడిందని, ఆలోగా ప్రభుత్వం తనకు అనుకూలమైన నియామకాలు చేసుకునే పరిస్థితి కల్పించబడిందని విమర్శించారు.

బెదిరింపులకు లొంగే వారికే కీలక పదవులా?

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నిజాయితీ, స్వతంత్ర ఆలోచన కలిగిన వారికంటే ఒత్తిళ్లకు, బెదిరింపులకు లొంగే వ్యక్తులకు కీలక పదవులు కట్టబెడుతోందని ప్రశాంత్ భూషణ్ ఆరోపించారు. అవినీతి ఆరోపణలు లేదా దర్యాప్తు సంస్థల కేసులను ఆసరాగా చేసుకొని అధికార వ్యవస్థలోని వ్యక్తులను ప్రభావితం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్‌పై కేరళలో రూ.20 కోట్ల లంచం డిమాండ్‌కు సంబంధించి ఆరోపణలు, విచారణ జరుగుతున్నాయని ప్రస్తావిస్తూ, ఈ వ్యవహారంలో ఒక విదేశీ ఇంజనీర్ ఆత్మహత్యకు ముందు రాసిన లేఖ అంశాన్ని కూడా ప్రస్తావించారు. ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను ఈడీ, సీబీఐ కేసుల ద్వారా ఒత్తిడికి గురిచేసి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించేలా చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.

న్యాయవ్యవస్థలో నియామకాల విషయంలోనూ ఇదే ధోరణి కనిపిస్తోందని విమర్శించారు. గతంలో న్యాయమూర్తుల నియామకాలు, వారి ఆస్తుల కొనుగోళ్లు, ఆరోపణలకు సంబంధించిన అంశాల్లో నిష్పక్షపాత ప్రమాణాలు పాటించాల్సిన అవసరాన్ని పలువురు న్యాయవాదులు లేవనెత్తారని గుర్తుచేశారు. రాజ్యాంగ సంస్థల్లో నియామకాలు వ్యక్తిగత విధేయతలకు, రాజకీయ అనుబంధాలకు అతీతంగా జరగాలని, లేకుంటే ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార సమతుల్యత దెబ్బతింటుందని హెచ్చరించారు.ఎన్నికల సంఘం ప్రజల ఓటు హక్కుకు రక్షణగా నిలవాల్సిన సంస్థ అని, కానీ ఓటర్ల తొలగింపులు, ఎస్ఐఆర్ విధానాలు, ఎన్నికల నిర్వహణలో పారదర్శకతపై తలెత్తుతున్న అనుమానాలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత దానిపై ఉందన్నారు. ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, అభ్యంతరాల పరిష్కారం, ఈవీఎంలు, వీవీప్యాట్ లెక్కింపుపై పూర్తి వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం, ప్రజల తీర్పును గౌరవించడం ప్రజాస్వామ్యానికి ప్రాథమికమని, ఓటు హక్కును బలహీనపరిచే చర్యలు రాజ్యాంగ పునాదులకే ప్రమాదమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్ట్, రచయిత డాక్టర్ కె. రామచంద్ర మూర్తి అధ్యక్షత వహించారు. జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త మల్లేపల్లి లక్ష్మయ్య, స్త్రీవాద రచయిత్రి, పరిశోధకురాలు డాక్టర్ ఎ. సునీత, ఇంజనీర్, నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ అండ్ డీ కోర్ మెంబర్ ఇర్ఫాన్ ఖాన్, న్యాయవాది, కార్యకర్త అఖిల్ సూర్య సంస్థ కోఆర్డినేటర్ దీప్తి బత్తిని తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో బాంబులు పెట్టాం

తయిబా పేరుతో మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హోటళ్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, రద్దీ ప్రాంతాల్లో భద్రత పెంచాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, వదిలి వెళ్లిన వస్తువులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఉన్నతాధికారులు సూచించారు. అన్ని భద్రతా విభాగాలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

జేడీయూ విలీనం కోసం భాజపా ‘ఏజెంట్లు’ పనిచేస్తున్నారు

పాట్నా(జనంసాక్షి):

బిహార్‌లో అధికార కూటమి తీరుపై జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, బాంకీపుర్ ఎమ్మెల్యే ప్రశాంత్ కిశోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. జేడీయూను కాషాయ పార్టీలో విలీనం చేసేందుకు నీతీశ్ పార్టీలోనే ఉన్న కొందరు భాజపా ఏజెంట్లు మార్గం సుగమం చేస్తున్నారని ఆరోపించారు. తద్వారా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నీతీశ్ కుమార్‌ను ప్రజల్లో కనిపించకుండా చేస్తున్నారని అన్నారు. “పట్నా ఎయిర్‌పోర్టులో ప్రధాని మోదీకి ఆహ్వా నం పలికిన నీతీశ్ కుమార్.. ఆ తర్వాత నిర్వహించిన కార్యక్రమంలో ఎందుకు పాల్గొనలేదు. నగరంలోనే ఉన్నప్పటికీ ఇంత పెద్ద కార్యక్రమానికి మాజీ సీఎంను ఎందుకు ఆహ్వానించలేదో జేడీయూ నాయకులనే అడగండి. వాస్తవం ఏంటంటే.. జేడీయూలో ఉన్న కొందరు కాషాయ పార్టీ ఏజెంట్లు.. ఆ పార్టీని భాజపాలో విలీనం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే నీతీశ్‌ను ప్రజల ముందు ఎక్కువగా కనిపించకుండా జాగ్రత్త పడుతున్నారు” అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ప్రశాంత్ కిశోర్ సమాధానమిచ్చారు.తాజా ఆరోపణలను ఎన్డీయే వర్గాలు కొట్టిపారేశాయి. నీతీశ్ ప్రస్తుతం రాజ్యాంగబద్ధ పదవిలో లేరని, అందుకే అధికారిక కార్యక్రమానికి ఆహ్వానించలేదని చెప్పే ప్రయత్నం చేశాయి. ప్రస్తుతం మంత్రిగా ఉన్న నీతీశ్ కుమారుడు నిషాంత్, డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ చౌధరీ, తదితర జేడీయూ నేతలు పాల్గొన్నారని పేర్కొన్నాయి. అయితే, అధికార పార్టీ వాదనను ఆర్జేడీ తోసిపుచ్చింది.

భారతీయ సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు ఏమాత్రం అవగాహన లేదు

ప్రేమను వ్యక్తపరచలేకపోతున్నారని చురకలు అంటించారు.

రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ విమర్శలు

గత సోమవారం తన తల్లి సోనియాగాంధీ ఆత్మకథ పుస్తకావిష్కరణలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ విమర్శలు చేయటంతో ఈ వివాదం మొదలైంది. భోజనం చేసేటప్పుడు తన తండ్రి రాజీవ్‌గాంధీ ఒడిలో తల్లి సోనియా కూర్చునేవారని రాహుల్ గుర్తుచేసుకున్నారు. తన స్నేహితుల ఇళ్లకు వెళ్లినప్పుడు వారి తల్లిదండ్రులు అలా కూర్చోకపోవడం చూసి ఆశ్చర్యపోయేవాడినని చెప్పారు. ‘అర్ధనారీశ్వర’ శిల్పం ఫొటోను షేర్ చేసి అసోం సీఎం హిమంత బిశ్వశర్మ సహా పలువురు బీజేపీ నేతలు చేసిన విమర్శలు రాహుల్ కౌంటర్ ఇచ్చారు.ఇదిలా ఉండగా, వేతనాల పెంపు, ఉద్యోగ కల్పనపై కార్పొరేట్ నాయకులను ప్రశ్నిస్తూ శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. ప్రధానమంత్రి చేసిన వ్యాఖ్యలు తన సొంత ప్రభుత్వ ఆర్థిక విధాన వైఫల్యాలను అంగీకరించుకోవడమేనని ఆయన అభివర్ణించారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ శతాబ్ది సదస్సులో ప్రధాని మోదీ చేసిన ప్రసంగంపై స్పందిస్తూ, ప్రభుత్వ విధానాలు గుత్తాధిపత్యాలను ప్రోత్సహించాయని, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వంటి ఉద్యోగ రంగాలను బలహీనపరిచాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. మోదీ, ఆయన స్నేహితులు కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని ఆయన విధానాలపై ఏ వర్గంలోనూ సంతృప్తి లేదన్నారు.“ మోదీ.. ఫిక్కీలో మీరు మాట్లాడుతూ, పన్ను రాయితీ లను పరిశ్రమలకు ఇస్తున్నా ఉద్యోగుల వేతనాలను పారిశ్రామికవేత్తలు పెంచడం లేదని, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని చెప్పారు. ఇది ఎవరి ఆకలో యావద్దేశానికి తెలుసు. విమానాశ్రయాలు, ఓడరేవులు, గనులు, అడవులు, విద్యుత్తు, రహదారులు అన్నింటినీ గుప్పిటపట్టినవారు ఎన్ని ఉద్యోగాలు సృష్టించారు?’ అయితే, ఇవన్నీ మీరు వారిపై చేసిన ఆరోపణలు కావు. ఇవి మీ వైఫల్యాను స్వయంగా మీరే ఒప్పుకోవడం” అని గాంధీ ఒక ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

మహిళల్ని లక్షధికారులను చేయండి

దూషణలకు దిగుతున్నారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి అమలు చేయలేదు. దేశంలోనే అతిపెద్ద ఆస్పత్రిని వరంగల్‌లో కేసీఆర్ నిర్మించారు. ఇప్పటి వరకూ రేవంత్‌రెడ్డి వరంగల్‌లో ఆస్పత్రిని ప్రారంభించలేదు. కొండా సురేఖ బిడ్డ, సురేఖ కూడా ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేశారు. రేవంత్‌రెడ్డి, పొంగులేటి బిడ్డల కోసం ఇంటర్ కాలేజీలను తీసేస్తున్నారు. రేవంత్ రెడ్డి అభివృద్ధి చేస్తానంటే నా గడ్డం అడ్డమొచ్చిందా?. వరంగల్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమి లేదు. ఫ్యూచర్ సిటీలో ఫ్యూచర్ లేదు. వరంగల్లే ఫ్యూచర్ సిటీ. 500 రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది. 2028లో కేసీఆర్ ముఖ్యమంత్రి కాబోతున్నారు. పాలిచ్చే బర్రెను వదిలిపెట్టి ఈచ్ తన్నే దున్నపోతును తెచ్చుకున్నామంటున్నారు ప్రజలు. అమిత్‌షాకు, రాహుల్ గాంధీకి గులాం గిరి చేస్తున్నారు” అని అన్నారు.

మృత్యు దారులు

అహ్మదాబాద్/కోటా(జనంసాక్షి):

రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న ట్రక్కును టెంపో వాహనం ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది భక్తులు చనిపోయారు. కోటా–ఉదయ్ జాతీయ హైవేపై శనివారం అర్ధ రాత్రి దాటాక ఈ ప్రమాదం చోటుచేసు కుంది. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన 16 మంది భక్తులు రాజస్థాన్‌లోని ఖాటూశ్యామ్ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం తమ స్వస్థలానికి బయలుదేరారు. ఈ క్రమంలో రోడ్డుపై పార్క్ చేసి ఉన్న ట్రక్కును వీరు ప్రయాణిస్తున్న వాహనం బలంగా ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.

ఆర్మీ కుటుంబాలకు చెందిన ఏడుగురి మృతి..

మరో ఘటనలో గుజరాత్‌లోని కచ్ జిల్లాలో ట్రక్కు, కారు ఢీకొన్న ఘటనలో ఆర్మీ కుటుంబాలకు చెందిన ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో మూడునెలల పసిపాప సహా ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మృతులను ఉత్తరాఖండ్‌లోని గర్వాల్ ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. శనివారం అర్ధరాత్రి దాటాక ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద వార్త తెలియగానే ఆర్మీ అధికారులు భుజ్ ఆసుపత్రికి వెళ్లి వివరాలు సేకరించారు.



కోటి ఓట్లు సాధిస్తాం.. 90 సీట్లు గెలుచుకుంటాం

ఎమ్మెల్యేలకు, నాయకులకు బలవంతంగా, కేసీఆర్ బీఆర్ఎస్ కండువాలు కప్పారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ లేదు, మళ్లీ పెరగనివ్వకుండా అడ్డుకుంటానని ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ చెప్పినట్లు గుర్తుచేశారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా డిజిటల్ మెంబర్‌షిప్ చేపట్టి 90 రోజుల్లో దేశంలోనే అత్యధికంగా కాంగ్రెస్?కు 48 లక్షల మంది సభ్యులుగా చేర్పించినట్లు చెప్పారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి అవకాశమిచ్చాం

కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో 92,35,833 ఓట్లు తెచ్చుకొని 64 సీట్లు గెలుచుకుందని, మిత్రపక్షం సీపీఐ ఒక చోట గెలిచిందని సీఎం గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు 90 లక్షల ఓట్లు రావడం వెనుక కార్యకర్తల కృషి ఎంతో ఉందన్న ఆయన, పార్టీ కోసం పనిచేసిన అనేక మంది నాయకులకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చామన్నారు. అద్దూరి లక్ష్మణ్, ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వాకిటి శ్రీహరి, మక్కాన్ సింగ్, రాజ్ ఠాకూర్ లాంటి వారు కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ జెండా మోశారన్నారు. అందుకే వారికి పార్టీ టికెట్లు ఇచ్చి మంత్రులు, ఎమ్మెల్యేలను చేశామన్నారు.నాడు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఎమ్మెల్యేగా పోటీచేయమని చెబితే, తాను గాంధీభవన్‌లో సమన్వయ బాధ్యతలు చూసుకుంటానని చెప్పినట్లు రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. తర్వాత ఎమ్మెల్సీ, పీసీసీ చీఫ్ అయ్యారని ముఖ్యమంత్రి తెలిపారు. పోటీ చేయకున్నా నిజాయతీగా పనిచేస్తే అదృష్టం వరిస్తుందన్నారు.

పార్టీ లైన్‌లో ఉంటే పదవి దానంతట అదే వస్తుంది

కాంగ్రెస్ నాయకుల ప్రతి ఒక్కరి ప్రవర్తన, మాట తీరును నిశితంగా గమనిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఏ నాయకుడు ముందు ఏం మాట్లాడుతున్నారో వెనుక ఏం మాట్లాడుతున్నారో సంపూర్ణంగా పార్టీ దగ్గర నివేదికలు ఉన్నాయని స్పష్టం చేశారు. రాజకీయాల్లో బ్యాలెన్స్ షీట్ ఐదేళ్లకు ఒకసారి వస్తుందన్న ఆయన, ఎవరి శ్రమ ఎంత ఉందో ఎన్నికల సమయంలో కొలుస్తామన్నారు. కష్టపడిన వాళ్లను గుర్తిస్తామని, కష్టపడి చెడగొట్టే వాళ్లనూ కూడా పార్టీ గుర్తుపెట్టుకుందని హెచ్చరించారు. కచ్చితంగా గుర్తుపెట్టుకుంటామని నొక్కి చెప్పారు. పార్టీ లైన్‌లో ఉంటే పదవి ఇంటికి దానంతట అదే వస్తుందని భరోసానిచ్చారు.

నిరాశలో ఉన్న నేతలకు తప్పకుండా గుర్తింపు

ఎన్టీఆర్ తరం, వైఎస్సార్ హయాం, కేసీఆర్ తరం నాలుగు దశాబ్దాల్లో అమలు చేసిన అన్ని పథకాలను కొనసాగిస్తూనే మరికొన్నింటినీ వాటికి జత చేసి ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్న సీఎం, పథకాలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. మంచిని మైక్‌లో చెప్పాలని, చెడును చెవిలో చెప్పాలని పునరుద్ఘాటించారు. పార్టీ కోసం శ్రమించిన వాళ్లకు అడగకుండానే ఎమ్మెల్సీ సీట్లు ఇచ్చామన్న ఆయన, నిరాశలో ఉన్న నేతలకు భవిష్యత్తులో తప్పకుండా గుర్తింపు లభిస్తుందని చెప్పారు.ఎమ్మెల్యే టికెట్ రాని అనేక మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీపై విశ్వాసంతో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రస్తుతం రెవెన్యూ, గృహ నిర్మాణం, ప్రజా సంబంధాల శాఖ మంత్రిగా ఉన్నట్లు తెలిపారు. అలాగే నారాయణఖేడ్ టికెట్‌ను కేటాయించి బీ ఫారం ఇచ్చిన తర్వాత సురేష్ షెట్కార్ సంజీవరెడ్డి కోసం దానిని వదులుకున్నారన్నారు. అనంతరం సురేష్ షెట్కార్‌ను పార్లమెంట్ సభ్యుడిని చేశామన్నారు.

కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకే

తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి పదవి చాలా గౌరవమైందన్న సీఎం, అనేక మంది హేమాహేమీలు ఈ బాధ్యతలు చేపట్టారని గుర్తుచేశారు. తెలంగాణలో రెండోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అందుకోసం క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని సూచించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు కావాల్సిన వ్యూహం తాము రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారాన్నే నమ్ముకొని, అధికారంలోకి వస్తామని అనుకుంటోందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. నిత్యం కృష్ణా, గోదావరి నీళ్లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న ఆయన సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌కు వస్తా అని చెప్పానని నెత్తి మీద కాలు పెట్టి తొక్కుతానని స్పష్టం చేశారు. అసెంబ్లీ పెడితే నగ్నంగా నిలబెడతా మన్న హరీశ్‌మాటలు చూసి నవ్వొచ్చిందన్నారు. గత సమావేశాల్లో వాళ్లంతట వాళ్లే బట్టలు విప్పి అసెంబ్లీ ముందు నిలబడ్డారని అన్నారని గుర్తుచేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏపీలో ఒక్క ప్రాజెక్టు కూడా చేపట్టలేదు

బీఆర్ఎస్ హయాంలోనే ఏపీలో ప్రాజెక్టులు చేపట్టారని, 299 టీఎంసీల నీటి వినియోగానికి కేసీఆర్ సంతకం చేయడం ఆధారంగానే ఏపీలో ప్రాజెక్టులు చేపట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క ప్రాజెక్టు కూడా చేపట్టలేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే ఏపీలో ప్రాజెక్టులు చేపట్టారని, 299 టీఎంసీల నీటి వినియోగానికి కేసీఆర్ సంతకం ఆధారంగానే ఏపీలో ప్రాజెక్టులు చేపట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో అనేక ప్రాజెక్టుల భూసేకరణకు కూడా కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు.

చెడు విషయాలను చెవిలో చెప్పాలి

కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలను వంద శాతం పాటిస్తామని, మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యకర్తల కోసమే తిరిగి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

చైనా బార్డర్‌లో వలసలు ఆగిపోయాయ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సరిహద్దు రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌కు తగినన్ని నిధులు కేటాయించలేదని కేంద్ర మంత్రి అమిత్ షా ఆరోపించారు.అరుణాచల్ ప్రదేశ్‌లోని చైనా సరిహద్దులో ఉన్న 40 గ్రామాల్లో జనాభా పెరిగిందని, వలసలు ఆగిపోయాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అక్కడ ఉపాధి, ఆరోగ్య సౌకర్యాలు కల్పించిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో అరుణాచల్ ప్రదేశ్‌లో అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. ఆ రాష్ట్రానికి తగినన్ని నిధులు కేటాయించలేదని విమర్శించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ ఈశాన్య రాష్ట్ర పురోగతి కోసం గణనీయంగా నిధులను పెంచిందని పేర్కొన్నారు. అరుణాచల్‌ప్రదేశ్ పర్యటనలో ఉన్న అమిత్ షా ఇటానగర్‌లో జరిగిన సహకార సదస్సులో ఈ మేరకు మాట్లాడారు.



'అభివృద్ధి సరిహద్దుల నుంచే ప్రారంభం కావాలి'

”2004–2014 వరకు యూపీఏ ప్రభుత్వం అరుణాచల్ ప్రదేశ్‌కు రూ. 33,530 కోట్లు మాత్రమే ఇచ్చింది. అదే సమయంలో 2014–2024 వరకు ఎన్‌డీఏ సర్కార్ ఈ ఈశాన్య రాష్ట్రానికి చేసిన ఆర్థిక సహాయం రూ. 1,64,664 కోట్లకు పెరిగింది. రాష్ట్రానికి అందే పన్ను వాటా నాలుగు రెట్లు, గ్రాంట్లు 18 రెట్లు పెర

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY



కరువు సాయం, పంట నష్టపరిహారం ప్రకటించాలి

- కరవు నిధులు తెచ్చేందుకు ఢిల్లీ కి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 22(జనం సాక్షి) : రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండి, ఇప్పటికే 360కి పైగా మండలాల్లో కరువు పరిస్థితులు కొనసాగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా అంచనా వేసి ప్రకటించినప్పటికీ, కరువు వల్ల నష్టపోయిన రైతులను, ప్రజలను ఆదుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మండిపడ్డారు. ఆదివారం ఖమ్మం లోని సిపిఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో అయన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుల తో పాటు ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పలు జిల్లాల కార్యదర్శులతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలో దాదాపు 24 లక్షల ఎకరాలకు పైగా పంటలు నష్టపోయాయని చెబుతున్నా, వాస్తవంగా మరో ఐదారు లక్షల ఎకరాలు అదనంగా నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఒక ఎకరంలో వాణిజ్య పంటలు వేస్తే రైతుకు రూ. 50 వేల వరకు, వరి లాంటి పంటలు వేస్తే రూ. 30 వేలకు తక్కువ కాకుండా ఖర్చవుతుండగా, ఇంత పెద్ద ఎత్తున పంట నష్టం జరిగినా రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. పక్కనున్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు రైతులకు నష్టపరిహారం అందిస్తుంటే, మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఎలాంటి సాయం ప్రకటించలేదని ఆయన దుయ్యబట్టారు. ఈ కరువు కారణంగా బోర్లన్నీ ఎండిపోయి తాగునీటి, సాగునీటి సమస్యలతో పాటు ఉపాధి సమస్య కూడా తీవ్రమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సమీక్షలు, సమావేశాలు జరపడం తప్ప రైతులను ఆదుకునే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గానీ, మంత్రివర్గం గానీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదని జాన్ వెస్లీ విమర్శించారు. తక్షణమే వరి పంటకు ఎకరాకు రూ. 30 వేలు, ఇతర వాణిజ్య పంటలకు రూ. 50 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలని సీపీఐ(ఎం) పక్షాన డిమాండ్ చేస్తున్నామని చెప్పారు.

లారీ ఆటో ఢీ.. నలుగురు మృతి

మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారుగా గుర్తింపు

- పెండ్లి మడుగు నుంచి కేరెల్లి వెళ్తుండగా ప్రమాదం
- బుగ్గ రామలింగేశ్వర ఆలయం సమీప మలుపు వద్ద దుర్ఘటన
- దుర్ఘటనపై సమగ్ర విచారణ జరపాలని వికారాబాద్ ఎస్పీ ఆదేశం
- ఒక్కొక్కరికి 30 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ డిమాండ్













వికారాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 22 (జనంసాక్షి): వైద్య రంగంలో దేశం ప్రపంచ దేశాలతో పోటీపడుతున్న ప్రస్తుత తరుణంలో నాటు వైద్యాన్ని నమ్ముకొని చికిత్స కోసం వెళుతూ జరిగిన దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లాలో జరిగింది. వికారాబాద్ మండలం పెండ్లిమడుగు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆటోలో దారురు మండలం కేరెల్లి గ్రామానికి వెళుతుండగా వికారాబాద్ పట్టణం బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ సమీప మలుపు దగ్గర జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. కేరెల్లి వైపు నుంచి వికారాబాద్ వైపు వస్తున్న ఒక లారీ ఆటోను ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ దుర్ఘటనలో పెండ్లిమడుగు గ్రామానికి చెందిన చంద్రమ్మ సరిత పార్వతమ్మ ఆటో డ్రైవర్ నాగేష్ ఈ దుర్ఘటనలో అక్కడికక్కడే మృతి చెందారు. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్న ఈ రోజుల్లో మృత్యుల్లోని ఒక మహిళకు విషపురుగు కుట్టిందని నాటు వైద్యం కోసం కేరెల్లి గ్రామానికి వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురి అయ్యారు. దీంతో పెండ్లి మడుగు గ్రామంలో విషాద ఛాయలు అమలుకున్నా యి. ఈ విషయం తెలియగానే వికారాబాద్ ఎస్పీ స్నేహమే హ్రా సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ దుర్ఘటనపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాలను వికారాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘాట్ రోడ్డులో వేగాన్ని నియంత్రించాలి : జిల్లా ఎస్పీ స్నేహమే హ్రా

బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో రోడ్డు ప్రమాదం ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పరిశీలించారు. వికారాబాద్ జిల్లాలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలోని ఘాట్ రోడ్డుపై లారీ, ఆటో ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు.సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య మరియి టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్ తో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించడం జరిగింది. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఘాట్ రోడ్డపై ప్రయాణించే వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని, పొగ మంచు పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తం గా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు.

ఒక్కొక్కరికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పేదలకు ఒక్కొక్కరికి రాష్ట్ర ప్రభుత్వం 10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రాతనిద్యం వహిస్తున్న వికారాబాద్ నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి మూడు వేల కోట్లు మంజూరు జరిగిందని అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పుకుంటున్న రోడ్లు అద్వాన స్థితిలో ఉన్న కారణంగా తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. నియోజవర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు జరగవలసినదని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రోడ్లను అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి ప్రాణం పోకుండా పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. ఈ దుర్ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంతేకాకుండా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి అంత్యక్రియల కోసం తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రాజశేఖరరెడ్డి ద్వారా 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రభుత్వపరంగా అన్ని మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.


కింది కులాలనుంచి వచ్చిన సాహిత్యంతో

తెలుగు సాహిత్యం పరిపుష్టం

తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్



హైదరాబాద్ (జనంసాక్షి) : కిందికులాల నుంచి వస్తున్న సాహిత్యంతో తెలుగు సాహిత్యం పరిపూర్ణమయిందని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. పైవర్గాలకు చెందిన కవులు, రచయితలు తమ కోసం తాము రాసుకున్నారని, వెనుకబడిన కులాలకు చెందిన కవులు, రచయితలు మాత్రం సకల జనం కోసం సాహిత్య సృష్టి చేశారని పేర్కొన్నారు. వెనుకబడ్డ కులాలు, జాతులు అన్ని రంగాల్లో అణిచి వేయబడుతున్నట్లుగానే సాహిత్య సాంస్కృతిక రంగాలలో కూడా విస్మరణకు గురవుతూ వస్తున్నారని విశ్లేషించారు. ప్రముఖ కవి ,గాయకుడు, తాత్వికుడు అంబటి వెంకన్న 30ఏళ్ల సాహిత్య ప్రయాణం పై ఆదివారం రవీంద్రభారతిలో రోజంతా సాహిత్య సమాలోచన సదస్సు జరిగింది. ప్రారంభ సదస్సును ప్రముఖ దర్శకుడు ,నిర్మాత డాక్టర్ బి. నర్సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా "అంబటి ఎట్ ద రేట్ ఆఫ్ 30"అంబటి వెంకన్న సాహితీయానం పుస్తకాన్ని బి నర్సింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు గౌరీ శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణలో సాహిత్య సాంస్కృతిక రంగాలు అత్యంత గొప్ప పాత్రను పోషించాయని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 500 మంది కళాకారులకు ఉద్యోగ భృతిని కల్పిస్తూ సాంస్కృతిక సారథిని ఏర్పాటు చేశారని తెలిపారు. బీసీ రిజర్వేషన్లు, అన్ని రంగాలలో బీసీహక్కుల కోసం రగులుతున్న ఉద్యమా లకు మద్దతుగా అంబటి సాహిత్య సృష్టి చేశారని జూలూరుపేర్కొన్నారు. ప్రఖ్యాత దర్శకుడు బి నర్సింగరావు మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం ఆర్ట్స్ లవర్స్ ఏర్పాటుతో గద్దర్ లాంటి మహా కవులుకళాకారుల ప్రవేశంతో పాట ఎంతో పరిణితి చెందిందో వివరించారు. తెలంగాణలో ఎగుస్తున్న అన్ని ఉద్యమాల్లో అంబటి వెంకన్న పాట మాట ఆట ఉందన్నారు. సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ సంపాదకులు డాక్టర్ కే. శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలో ఎగిసిన అన్ని ప్రజాస్వామ్య ఉద్యమాలకు అంబటి వెంకన్న తన గొంతు నిచ్చారని చెప్పారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో వెంకన్న పాత్ర కీలకమైంది అన్నారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు సంగీశెట్టిశ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ సాహిత్య ఉద్యమంలో అంబటి వెంకన్న మైలురాయిగా నిలుస్తారన్నారు. వెనుకబడ్డ కులాల గొంతుకలే నేడు తెలుగు సాహిత్యంలో సమర శంఖం పూరిస్తున్నాయని విశ్లేషించారు. ప్రారంభ సభకు ప్రముఖ కథా రచయిత శీలం భద్రయ్య అధ్యక్షత వహించగా విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు పి. కరెంట్ రావ్, రాష్ట్ర ఎన్జీఓస్మెంట్ విభాగంలో మాజీ అధికారి మునాసు వెంకటేశం, చెన్నైకి చెందిన సామాజిక కార్యకర్త ఆర్కే. వెంకట్ నల్లగొండ కవి బండారు శంకర్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా అంబటి వెంకన్న మాతృమూర్తిని అతిథులు ఘనంగా సత్కరించారు. అంబటి వెంకన్న సాహిత్యం పై నాలుగు సెషన్లు జరిగాయి. ఇందులో ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం , ప్రముఖ రచయిత్రి దాసోజు లలిత, ప్రఖ్యాత కవయిత్రి జి. విజయలక్ష్మి, జానపద గాయని స్వప్న, మన ఆలోచన సాధన సమితి అధ్యక్షులు కటకం నర్సింగరావు పలు రంగాలకు చెందిన కవులు రచయితలు కళాకారులు ప్రసంగించారు.



15 మంది మైనింగ్ అక్రమార్కులపై కేసు

- 9 మంది అరెస్ట్, 2 కోత యంత్రాలు స్వాధీనం

న్యాల్ కల్, నవంబర్ 22 (జనంసాక్షి) : నిమ్జ్, రెవెన్యూ, పోలీస్ అధికారుల బృందం తరచుగా.. దాడులు చేపట్టి.. పలు కోత పరికరాలు, వాహనాలను స్వాధీనం చేసుకొని జరిమానా విధిస్తున్న.. కొందరు అక్రమార్కులు అక్రమంగా మైనింగ్ (ఎర్రరాయి తవ్వకాలు) కొనసాగించడంతో.. ఆదివారం స్థానిక పోలీసులు పలువురుపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి, కోత యంత్రాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. నిమ్జ్ ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు.. జహీరాబాద్ డిఎస్పి సైదా నాయక్, జహీరాబాద్ రూరల్ సీఐ నర్సింలు, స్థానిక ఎస్సై సుజిత్, పోలీస్ బృందంతో కలిసి ఈ నెల 21, శనివారం తెల్లవారు జామున మండలంలోని గణేష్ పూర్ గ్రామ శివారులో కొనసాగుతున్న అక్రమ మైనింగ్ పై ఆకస్మిక దాడులు చేశారు. పోలీసుల బృందం దాదాపు రెండు గంటలకు పైగా మైనింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు. పలుమార్లు హెచ్చరికలు జారీ చేసిన ఎలాంటి మార్పు రాకపోవడంతో.. 15 గురు అక్రమ మైనింగ్ వ్యాపారులపై కేసు నమోదు చేసి, 9 గురిని అరెస్టు చేసి, 2 కోత యంత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై తెలిపారు. నిమ్జ్ ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుజిత్ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

తెలంగాణ విద్యార్థుల స్థానికత హక్కులను కాలరాయొద్దు

ఇంటర్మీడియేట్ రద్దు నిర్ణయాన్ని నిలిపివేయాలి

- సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్ కుమార్ బహిరంగ లేఖ

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ విద్యార్థుల స్థానికత హక్కులను కాలరాయొద్దని, స్వార్థపూరిత ఇంటర్మీడియట్ రద్దు నిర్ణయాన్ని నిలిపివేయాలని కోరుతూ ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఇంటర్మీడియట్‌ను రద్దు చేసి 9 నుండి 12వ తరగతి వరకు ఒకే బడిగా మారిస్తే తెలంగాణ విద్యార్థుల స్థానికతపై రేవంత్ ప్రభుత్వం దాడి చేసినట్లేనని ఆయన లేఖలో పేర్కొన్నారు. నాలుగేళ్ల కార్పొరేట్ హాస్టల్ ప్యాకేజీ కొంటే ఇతర రాష్ట్రాల విద్యార్థులు సైతం చట్టబద్ధంగా 'తెలంగాణ లోకల్' అయిపోయి, మన బిడ్డల మెడికల్, ఇంజనీరింగ్ సీట్లు తన్నుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. లోకల్ హోదా పుట్టుకతో కాకుండా ప్రవేశ పరీక్షకు ముందు వరుసగా 4 ఏళ్లు ఎక్కడ చదివారనే దానిపైనే ఆధారపడి ఉంటుందని లేఖలో దాసోజ్ శ్రవణ్ కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును శాశ్వతంగా దెబ్బతీసే ఈ చట్టపరమైన ఇంటర్మీడియట్ రద్దు ప్రమాదాన్ని నివారించాలని లేఖలో కోరారు. ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులతో కనీస చర్చ లేకుండా తీసుకున్న ఇంటర్మీడియట్ రద్దు నిర్ణయం వెనుక కార్పొరేట్ కాలేజీల ప్రయోజనాలున్నాయని ఆరోపించారు. నవంబర్ 13న రాసిన తాను బహిరంగ లేఖపై వారం గడిచినా ప్రభుత్వం నుండి ఒక్క సమాధానం కూడా రాలేదని, కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చే ఇంటర్మీడియట్ రద్దు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై దాసోజు శ్రవణ్ కుమార్ సుదీర్ఘ అంశాలను సీఎం రేవంత్ రెడ్డికి లేఖలో ప్రస్తావించారు.

విదేశీ ఉపాధి అవకాశాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం కీలకం

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



హైదరాబాద్ (జనంసాక్షి) : కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, యువతకు దేశీయ, అంతర్జాతీయ ఉపాధి అవకాశాల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం కీలకమని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో నిర్వహించిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కార్మిక శాఖ మంత్రుల రెండు రోజుల 'చింతన్ శిబిర్'లో ఆయన పాల్గొన్నారు. విదేశీ ఉద్యోగాల కల్పనలో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలు, మహిళలకు పెద్దఎత్తున అవకాశాలు కల్పించడం, నియామకాల్లో పారదర్శకతను కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ప్రత్యేకంగా అభినందించారు. టామ్‌కామ్ సేవలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ 2015లో ఏర్పాటైన టామ్‌కామ్ ద్వారా 16 దేశాల్లో 14,850 మందికి ఉద్యోగాలు కల్పించగా, గల్ఫ్ దేశాలతో పాటు యూకే, జర్మనీ, జపాన్, ఇజ్రాయెల్, కెనడాలో ఉద్యోగాలు పొందిన వారిలో 90 శాతం మంది మహిళలే ఉన్నారని తెలిపారు. 'ముఖ్యమంత్రి ఓవర్సీస్ ఎంప్లాయ్‌మెంట్ స్కీమ్' కింద రూ.50 కోట్లు కేటాయించి, ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థుల వీసా, ప్రయాణ ఖర్చుల్లో 50 శాతం సాయం అందిస్తున్నామన్నారు. జర్మన్, జపనీస్, ఇంగ్లిష్ భాషల్లో ఉచిత శిక్షణ కోసం రూ. 20 కోట్లు కేటాయించామని, ఆరు క్లస్టర్లలో జర్మన్ శిక్షణతో పాటు హైదరాబాద్‌లో దేశంలోనే తొలి ప్రభుత్వ జర్మన్ భాషా పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జర్మనీ ఫెడరల్ ఎంప్లాయ్‌మెంట్ ఏజెన్సీతో 'ట్రిపుల్ విన్' ఒప్పందం ద్వారా వైద్య నిపుణులకు, ఇజ్రాయెల్‌లోని పీఐబీఏ, ఎన్ఎన్‌డీసీ ద్వారా నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నట్లు వివరించారు. విదేశీ ఉద్యోగాల పేరిట మోసాలను అరికట్టేందుకు శంషాబాద్ విమానాశ్రయంలో 24 గంటల వలస కార్మికుల సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న కెరీర్ లాంజ్‌లను టామ్‌కామ్ వంటి రాష్ట్ర సంస్థలతో అనుసంధానించాలని కోరారు. కాగా, సదస్సు రెండో రోజు కేంద్ర మంత్రి మాండవీయ 'నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) వన్' పోర్టల్, ఐదు సామాజిక భద్రతా అంశాలను అనుసంధానించే ఈ-శ్రమ్ లైవ్లీహుడ్ ప్రొఫైల్ మాడ్యూల్‌ను ప్రారంభించారు. ఉద్యోగావకాశాల మెరుగుదలకు హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా 8 నగరాల్లో ఏర్పాటు చేసిన కెరీర్ లాంజ్‌లను కేంద్ర మంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంపై ప్రచారం



కొత్తపల్లి (జనంసాక్షి) : కరీంనగర్ నగర పరిధిలోని రేకుర్తి 20 వ డివిజన్ లో సుడా మాజీ చైర్మన్ కేఎన్ఆర్ మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. సుడా చైర్మన్ గా గతంలో మంజూరు చేసిన ప్రధానమైన సమ్మక్క సారలమ్మ రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. అంతర్గత రోడ్లు, పలు సమస్యలు పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరారు. స్థానిక కార్పొరేటర్ పర్వతం మల్లేశం ఆధ్వర్యంలో జరిగిన మార్నింగ్ వాక్ లో పలు కాలనీల ముఖ్యులు స్థానికులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23 నవంబర్ 2026

ఓట్లు రాలేదని వెలుగు ఆర్పేస్తారా?

సంపాదకీయం

రాజస్థాన్‌లోని టోంక్ జిల్లాలో జరిగిన ఈ ఘటన ప్రజాస్వామ్యానికే మచ్చ. పంచాయతీ సమితి ఎన్నికల్లో భాజపా తరపున నాలుగో వార్డు నుంచి పోటీ చేసిన ప్రియాంక శర్మ ఓడిపోయారు. అంతే, ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే రామ్‌సహాయ్ వర్మ సహాయకుడు అలోక్ శర్మ ఏర్పాటు చేయించిన సుమారు యాభై ఎల్‌ఈడీ వీధి దీపాల్లో పది వీధుల్లోని వాటిని ఆయన మనుషులు తొలగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓటేయని వారికి వెలుగు కూడా హక్కు కాదన్నట్టు సాగిన ఈ వ్యవహారం సిగ్గుచేటు.

వీధి దీపం ఎవరి జేబులోంచో తీసి ఇచ్చిన దానం కాదు. అది ప్రజల పన్నుల డబ్బుతో, ప్రజల అవసరం కోసం ఏర్పాటయ్యే సౌకర్యం. ఎన్నికల ముందు దానిని ఎరగా వేసి, ఫలితం అనుకూలంగా రాకపోగానే లాగేసుకోవడం అంటే ప్రజల ఓటును కొనాలనుకున్న వ్యాపారి, బేరం కుదరకపోవడంతో సరుకు వెనక్కి తీసుకున్నట్టే. ఇది ప్రజాప్రతినిధుల పని కాదు, అహంకారంతో కూడిన ప్రతీకారం.


ఎమ్మెల్యే రామ్‌సహాయ్ వర్మ ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. దీపావళికి ముందు అభ్యర్థులే ఈ లైట్లు పెట్టించారని, విద్యుత్ బిల్లుల సంగతి తెలిశాక వాటిని తొలగించారని చెబుతున్నారు. నిజమేమిటో విచారణలో తేలాలి. కానీ ఎన్నికల ఫలితాల తర్వాతే ఈ దీపాలు ఆరిపోవడం యాదృచ్ఛికమా అన్న ప్రశ్నకు ప్రజలకు సంతృప్తికరమైన సమాధానం కావాలి. అభ్యర్థులు పెట్టించారన్న వాదనే నిజమైతే, అభ్యర్థి ఓడగానే వాటిని ఎందుకు పీకేశారో కూడా చెప్పాలి.

అసలు పాఠం మరొకటి ఉంది. ప్రజలు ఎందుకు తిరస్కరించారో ఆత్మపరిశీలన చేసుకోవాల్సింది పోయి, వారిని చీకట్లో ఉంచి శిక్షించడం ఏ రాజకీయ పరిపక్వత? ఓటర్లు ఇష్టపడలేదంటే కారణాలుంటాయి. పని తీరు నచ్చకపోవచ్చు, వైఖరి నచ్చకపోవచ్చు, ఇచ్చిన హామీలు నెరవేరకపోవచ్చు. వాటిని వెతికి సరిదిద్దుకోవాలి. అంతేగానీ ఓడిన కోపాన్ని వీధి చివర స్తంభం మీద చూపిస్తే ఓటర్ల మనసులో స్థానం పెరగదు, ఉన్న కొద్దిపాటి గౌరవమూ ఆరిపోతుంది.

ప్రజల గుండెల్లో చోటు సంపాదించాలంటే సేవతో సంపాదించాలి, పనితో నిరూపించుకోవాలి. తాయిలాలతో ఓట్లు కొనలేం, లైట్లు తీసేసి భయపెట్టలేం. ఈ రోజు ఓడిన పార్టీ రేపు గెలవచ్చు, ఈ రోజు గెలిచినవారు రేపు ఓడవచ్చు. కానీ చీకటిలో మిగిలిన వీధులు ఎవరు అధికారంలో ఉన్నా, ఎవరు చేసిన అవమానమో గుర్తుంచుకుంటాయి. దీపాలు ఆర్పడం సులభం. ప్రజల నమ్మకాన్ని వెలిగించడమే కష్టం, అదే నిజమైన నాయకత్వం.

రామోజీరావు జయంతికి రాష్ట్ర పండుగ హోదా..

ప్రజాగౌరవమా? రాజకీయ ఆరాధనా?



ప్రజాస్వామ్యంలో ఒక వ్యక్తి సాధించిన విజయాలను గుర్తించడం, ఆయనను యావత్ సమాజానికి ఆదర్శంగా ప్రకటించడం రెండూ వేర్వేరు అంశాలు. ఒక వ్యక్తి వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించవచ్చు. వేలమందికి ఉపాధి కల్పించవచ్చు. తన రంగంలో అసాధారణ విజయాలు సాధించవచ్చు. అలాంటి విజయాలను గుర్తించి గౌరవించడంలో ఎవరికీ అభ్యంతరం ఉండనక్కర్లేదు. కానీ ఆ వ్యక్తి వ్యక్తిగత విజయాలను ప్రజాసేవగా చిత్రీకరించి, ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం మాత్రం ప్రజాస్వామిక చర్చకు తావిస్తోంది. ముఖ్యంగా మీడియా సంస్థల అధిపతులు, రాజకీయ నాయకుల మధ్య సన్నిహిత సంబంధాలు, పరస్పర ప్రయోజనాల ఆరోపణలు ఉన్నప్పుడు ఇలాంటి నిర్ణయాలను మరింత లోతుగా పరిశీలించాలి.

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆయన జీవిత ప్రస్థానం అందరికీ ఆదర్శమని, తెలుగు ప్రజలకు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అయితే రామోజీరావు వ్యాపార విజయాలను గౌరవించడం ఒకటైతే, ఆయనను నిష్పక్షపాత పాత్రికేయానికి ప్రతీకగా, యావత్ తెలుగు సమాజానికి ఆదర్శంగా ప్రకటించడం మరొకటి. ఈ రెండింటి మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. 1974లో ఈనాడు దినపత్రికను ప్రారంభించిన రామోజీరావు తెలుగు పత్రికా రంగంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. జిల్లా వార్తలకు ప్రాధాన్యం కల్పించడం, వార్తా సేకరణ, ముద్రణ, పంపిణీ వ్యవస్థలను విస్తరించడం, ఈటీవీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం ఆయన సాధించిన విజయాలు. ఉషాకిరణ్ మూవీస్, రామోజీ ఫిలిం సిటీ వంటి సంస్థల ద్వారా సినిమా, వినోద రంగాల్లోనూ తనదైన ముద్ర వేశారు. వేలమందికి ఉపాధి కల్పించి, మీడియా రంగంలో భారీ వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించారు. పద్మవిభూషణ్ పురస్కారం కూడా అందుకున్నారు. ఇవన్నీ ఆయన వ్యాపార దక్షతకు నిదర్శనాలు. అయితే వ్యాపార విజయం, పాత్రికేయ నైతికత, ప్రజాస్వామిక నిబద్ధత ఒకటే కావు. ఒక రంగంలో సాధించిన విజయాలు మరో రంగంలోని విమర్శలకు సమాధానాలు కాలేవు. రామోజీరావు ప్రస్థానంలో అత్యంత చర్చనీయాంశమైనది ఆయన రాజకీయ ప్రభావం. ఒక పత్రిక ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయగలదు. ప్రభుత్వాలను ప్రశ్నించగలదు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురాగలదు. అయితే ఆ శక్తిని ఒక రాజకీయ పక్షానికి అనుకూలంగా ఉపయోగిస్తే జర్నలిజం నిష్పక్షపాత ధర్మం ప్రశ్నార్థకమవుతుంది. ఈనాడు, తెలుగుదేశం పార్టీ మధ్య ఉన్న రాజకీయ సంబంధాలపై అనేక సంవత్సరాలుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్టీ రామారావు రాజకీయ ఎదుగుదలలో ఈనాడు ప్రచారం కీలక పాత్ర పోషించిందన్నది విస్తృతంగా చర్చించబడిన అంశం. 1983లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి పత్రిక అందించిన మద్దతు ఒక ముఖ్యమైన పరిణామం.

అయితే 1995లో తెలుగుదేశం పార్టీలో జరిగిన సంక్షోభం, ఎన్టీఆర్ పదవీచ్యుతి సమయంలో రామోజీరావు, ఈనాడు పాత్రపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. తనకు అనుకూలంగా ఉన్నంతకాలం ఎన్టీఆర్‌కు మద్దతు ఇచ్చి, ఆ తరువాత విభేదాలు ఏర్పడినప్పుడు ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేశారన్న విమర్శలు ఇప్పటికీ వినిపిస్తాయి. చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడానికి మీడియా ప్రచారం సహకరించిందన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. అయితే ఎన్టీఆర్ పతనానికి ఒక వ్యక్తి లేదా పత్రికే కారణమని చెప్పడం చారిత్రక వాస్తవాలను సరళీకరించడమే అవుతుంది. పార్టీ అంతర్గత విభేదాలు, కుటుంబ రాజకీయాలు, ఎమ్మెల్యేల వైఖరి వంటి అనేక అంశాలు ఆ పరిణామానికి కారణమయ్యాయి. అయినప్పటికీ ఆ సంక్షోభంలో మీడియా పోషించిన పాత్రపై నిష్పక్షపాత సమీక్ష అవసరం.

మరోవైపు రామోజీరావు పాత్రను పూర్తిగా ప్రజావ్యతిరేకంగా చిత్రించడం కూడా సమంజసం కాదు. 1990వ దశకంలో నెల్లూరు జిల్లా దూబగుంటలో మహిళలు ప్రారంభించిన సారా వ్యతిరేక ఉద్యమానికి ఈనాడు విస్తృత ప్రచారం కల్పించింది. గ్రామీణ మహిళల సమస్యను రాష్ట్రవ్యాప్త చర్చగా మార్చడంలో ఆ పత్రిక పాత్ర ఉంది. అయితే ఆ ఉద్యమంలోని మద్యపాన వ్యతిరేకతతో పాటు మహిళలు లేవనెత్తిన మంచినీరు, ఆరోగ్యం, విద్య, కుటుంబ సంక్షేమం వంటి విస్తృత సమస్యలకు తగిన ప్రాధాన్యం లభించలేదన్న విమర్శలూ ఉన్నాయి. ప్రజా ఉద్యమాలకు మద్దతు ఇవ్వడం అభినందనీయమే. కానీ ఆ మద్దతు నిరంతరంగా, రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా కొనసాగినప్పుడే దానికి నిజమైన ప్రజాస్వామిక విలువ ఉంటుంది. రామోజీ ఫిలిం సిటీ నిర్మాణానికి సంబంధించిన భూముల వ్యవహారం కూడా గతంలో వివాదాలకు దారితీసింది. ప్రభుత్వ, అసైన్డ్ భూముల వినియోగంపై ఆరోపణలు రావడం, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టడం, న్యాయపోరాటాలు జరగడం తెలిసిందే. కొన్ని భూములకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను న్యాయస్థానాలు రద్దు చేసిన సందర్భాలూ ఉన్నాయి. మార్గదర్శి చిట్‌ఫండ్స్ వ్యవహారం కూడా వివిధ సందర్భాల్లో న్యాయ, రాజకీయ చర్చలకు కారణమైంది. అయితే ఆరోపణలను నిరూపితమైన నేరాలుగా పరిగణించకూడదు. అదే సమయంలో న్యాయపరమైన వివాదాలు ఉన్నాయన్న కారణంతో వాటిపై ప్రశ్నలు అడగకూడదనడం కూడా ప్రజాస్వామ్యానికి విరుద్ధం. వాస్తవాలు, ఆరోపణలు, న్యాయస్థానాల తీర్పులను విడివిడిగా పరిశీలించాలి.

ఇంకో ముఖ్యమైన విషయం మీడియా సంస్థలలో పనిచేసే ఉద్యోగుల శ్రమకు సంబంధించినది. ఒక సంస్థ అధిపతి విజయాలను మాత్రమే కీర్తిస్తూ, ఆ సంస్థ అభివృద్ధికి కృషి చేసిన విలేకరులు, సంపాదకులు, ముద్రణా సిబ్బంది, పంపిణీదారులు, సాంకేతిక నిపుణుల పాత్రను విస్మరించకూడదు. కార్మికుల హక్కుల గురించి రాసే మీడియా సంస్థలు తమ ఉద్యోగుల వేతనాలు, పని పరిస్థితులు, శ్రమకు తగిన ప్రతిఫలం వంటి విషయాల్లోనూ ఆదర్శంగా ఉండాలి. ప్రజా సమస్యలను ప్రశ్నించే సంస్థలు తమ అంతర్గత వ్యవహారాల్లోనూ జవాబుదారీతనాన్ని పాటించాలి.

ఇక్కడ చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలోని ప్రధాన అభ్యంతరం ఏమిటంటే, ఒక వ్యక్తి పట్ల ముఖ్యమంత్రికి ఉన్న వ్యక్తిగత అభిమానం ప్రభుత్వ అధికారిక గౌరవంగా మారడం. రామోజీరావు జయంతిని ఆయన కుటుంబం, సంస్థలు, అభిమానులు ఘనంగా నిర్వహించుకోవచ్చు. ఆయన పేరుతో అవార్డులు ఇవ్వవచ్చు. మీడియా, సినిమా, వ్యాపార రంగాల్లో ఆయన సాధించిన విజయాలపై అధ్యయనాలు నిర్వహించవచ్చు. కానీ రాష్ట్ర పండుగ హోదా కల్పించడానికి వ్యక్తిగత అనుబంధం కాకుండా విస్తృతమైన ప్రజా సమ్మతి, చారిత్రక ప్రాధాన్యం, సామాజిక అంగీకారం ప్రాతిపదిక కావాలి.

మిగితా తరువాయి సంచికలో..

డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.



నిన్నటి సంచిక తరువాయి

ప్రతీకారాన్ని కాదు.. క్షమాగుణాన్ని ఎంచుకున్న మండేలా!

ఆయన తన శత్రువులపై విజయం సాధించడమే లక్ష్యంగా పెట్టుకోలేదు; శత్రుత్వం అనే భావనను దేశ భవిష్యత్తు నుంచి తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ దృక్పథమే ఆయనను సాధారణ రాజకీయ నాయకుడి స్థాయి నుంచి ప్రపంచ నైతిక నాయకుడి స్థాయికి తీసుకెళ్లింది. ఆయన క్షమాగుణం వ్యక్తిగత సద్గుణం మాత్రమే కాదు; దేశ నిర్మాణానికి ఉపయోగపడిన రాజకీయ వ్యూహం, సామాజిక తత్వం, మానవతా విలువ.

ఇప్పటి సమాజానికి మండేలా సందేశం అత్యంత అవసరం. రాజకీయ విభేదాలు శత్రుత్వాలుగా మారకూడదు. జాతి, మతం, ప్రాంతం, భాష ఆధారంగా మనుషుల మధ్య ద్వేషాన్ని పెంచకూడదు. గతంలోని గాయాలను గుర్తుచేసుకోవడం చరిత్ర పాఠం కోసం అవసరం; వాటిని ప్రతీకారానికి కారణాలుగా ఉపయోగించడం మాత్రం సమాజానికి ప్రమాదకరం. నాయకులు తమ వ్యక్తిగత కోపం కంటే ప్రజల భవిష్యత్తుకు ప్రాధాన్యత ఇవ్వాలి. అధికారంలో ఉన్నవారు తమను విమర్శించిన వారిని అణచివేయకుండా, విమర్శలను ప్రజాస్వామ్య భాగంగా స్వీకరించాలి. ఒక సమాజం తన విభేదాలను శాంతియుతంగా పరిష్కరించగలిగినప్పుడే నిజమైన అభివృద్ధిని సాధిస్తుంది.

నెల్సన్ మండేలా జీవితం మనకు నేర్పే అత్యంత గొప్ప పాఠం ఏమిటంటే, మనకు ప్రతీకారం తీర్చుకునే శక్తి ఉన్నప్పుడు క్షమించగలగడం, మనకు అధికారం ఉన్నప్పుడు వినయంగా ఉండగలగడం, మనకు విజయం లభించినప్పుడు ఓడిపోయిన వారిని అవమానించకుండా ఉండగలగడం, మనకు జరిగిన అన్యాయాన్ని మరొకరికి చేయకుండా ఉండగలగడం. ఒక వ్యక్తి తన జీవితంలో ఈ విలువలను పాటిస్తే అతను గొప్ప మనిషి అవుతాడు. ఒక నాయకుడు వాటిని పాటిస్తే అతను గొప్ప నాయకుడు అవుతాడు. ఒక దేశం వాటిని తన విధానాల్లో ఆచరిస్తే అది గొప్ప నాగరికతగా ఎదుగుతుంది.

ప్రతీకారం తీర్చుకోవడం ద్వారా మనం ప్రత్యర్థిని ఓడించవచ్చు; కానీ క్షమించడం ద్వారా మనం ద్వేషాన్ని ఓడించవచ్చు. ప్రతీకారం గతాన్ని తిరిగి తిరిగి జీవింపజేస్తుంది; క్షమాపణ భవిష్యత్తుకు కొత్త అవకాశాలను తెరుస్తుంది. మండేలా తన 27 సంవత్సరాల జైలు జీవితాన్ని మరచిపోలేదు; కానీ ఆ బాధను దక్షిణాఫ్రికా మరోసారి హింసలో మునిగిపోవడానికి కారణంగా మార్చలేదు. ఆయన గతాన్ని గుర్తుచుకుని, భవిష్యత్తును కాపాడే నాయకత్వాన్ని ఎంచుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతీకారం తీర్చుకోవడం సులభం; కానీ అదే సమయంలో క్షమించి, న్యాయం మరియు శాంతి మార్గాన్ని ఎంచుకోవడం అత్యంత గొప్పది. నెల్సన్ మండేలా గొప్పతనం తనను అవమానించినవారిని ఓడించడంలో కాదు-వారిపై ప్రతీకారం తీర్చుకోగల అధికారాన్ని కలిగి ఉన్నప్పటికీ, ఒక దేశాన్ని ద్వేషం నుంచి బయటకు తీసుకువచ్చే ప్రయత్నం చేయడ ంలో ఉంది. ఒక జాతి నిజమైన ఔన్నత్యం తన శత్రువులపై సాధించిన విజయాల్లో మాత్రమే కాదు; తన మానవత్వాన్ని, నైతికతను, క్షమాగుణాన్ని ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లోనూ నిలబెట్టుకోవడంలో ఉంటుంది. ప్రతీకారం చరిత్రలో మరో గాయాన్ని సృష్టిస్తుంది; క్షమాపణ చరిత్రకు శాంతి దిశను చూపిస్తుంది. ఇదే నెల్సన్ మండేలా ప్రపంచానికి అందించిన శాశ్వత సందేశం.

డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయ.

వేలాది ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న ఓ శాంతి కపోతమా..!

అలెగ్జాండర్‌ను నిలువరించిన పురుషోత్తముడిగా కాదు గానీ, రాజ్యంపై నీ ధిక్కార స్వరాన్ని వినిపించిన ప్రజాస్వామ్యవాదిగా నిన్ను గుర్తు చేసుకుంటున్నాం. నీ ధిక్కార స్వరం మా చెవుల్లో ఇంకా మారుమోగుతూనే ఉంది. మా మదిలో నీ జ్ఞాపకాల తడి ఇంకా ఆరలేదు.



పురుషోత్తం కుటుంబ నేపథ్యాన్ని గమనిస్తే, ఫ్యూడల్ సంస్కృతి బలంగా ఉన్న ప్రాంతంలోని సామాజిక హోదా కలిగిన మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబం ఆయనది. వృత్తిరీత్యా న్యాయవాది. కోరుకుంటే ఆర్థిక ఒడిదుడుకులు లేని భద్రతగల జీవితాన్ని గడిపే అవకాశం ఆయనకు ఉంది. కానీ ఆయన ఆ జీవితాన్ని ఎంచుకోలేదు. తన సామాజిక మూలాలకు భిన్నంగా నిలబడి, సమాజం కల్పించిన ప్రత్యేక హక్కులను వదులుకొని, ఆధిపత్య వ్యవస్థపై రాజీలేని పోరాటం చేసి ప్రాణాలు ఒడ్డిన ప్రజాస్వామ్యవాదిగాఎదిగాడు పురుషోత్తం.

ఈ జీవితాన్ని ఎంచుకోవడానికి ప్రేరణ ఏమిటన్న ప్రశ్నకు ఆయన జీవించి ఉన్నప్పుడు చెప్పిన మాటల్లోనే సమాధానం ఉంది. అణిచివేతకు, అమానవీయ పరిస్థితులకు వ్యతిరేకంగా ప్రజలు ప్రాణాలొడ్డి చేస్తున్న పోరాటాలే ఆయనకు ప్రేరణ. ప్రజా పోరాటాలు తమకు గొంతుకనిచ్చే మేధావులను సృష్టించుకుంటాయన్నది పురుషోత్తం విషయంలో అక్షర సత్యం. ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం ఆవిర్భావానికి కూడా మానవీయ సమాజం కోసం పోరాడుతున్న ప్రజలే ప్రేరణగా నిలిచారు.

పౌర హక్కుల సంఘం రాజ్య నిర్బంధానికి, రాజ్యహింసకు వ్యతిరేకంగా ఏర్పడింది. దాదాపు ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో గొంతులేని ప్రజల గొంతుకగా మారింది. ఎవరి కోసం రాజ్య యంత్రాంగం కదలదో, ఎవరి హక్కుల గురించి మరెవరూ మాట్లాడరో, వారి తరఫున మాట్లాడడం ప్రారంభించింది. ప్రశ్నించడాన్ని రాజ్యం సహించలేక పోయింది. ఫలితంగా పౌర హక్కుల ఉద్యమంలో చాలామంది ప్రాణాలు కోల్పోయారు. అందులో పురుషోత్తం మొదటివాడు కాదు, చివరివాడు కాదు.

పౌర హక్కుల ఉద్యమంలో ఎదుగుతూ, దాని నిర్మాణం, విస్తరణ కోసం విరామం ఎరుగకుండా శ్రమించిన వ్యక్తి పురుషోత్తం. స్పష్టమైన రాజకీయ, తాత్విక చింతనతో ఉద్యమంలో పూర్తిస్థాయిలో పనిచేశారు. విద్యార్థి దశ నుంచే సమాజాన్ని నిశితంగా పరిశీలిస్తూ, అసమానతలకు మూలాలను అర్థం చేసుకుంటూ, పరిష్కార మార్గాలను విశ్లేషిస్తూ కార్యాచరణలో ముందుకు సాగారు.

పౌర హక్కుల సంఘంలో రెండు భిన్నమైన వాదనలు తీవ్రరూపం దాల్చిన కీలక సమయంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల కార్యకర్తలతో విస్తృతంగా చర్చించడంలో పురుషోత్తం ముఖ్యమైన పాత్ర పోషించారు. అప్పటికే నాయకత్వ స్థానాల్లో ఉన్న కొందరి వాదనలు మైనారిటీలో ఉండగా, వారు న్యాయస్థానాల్లో ఉండలేమని అన్న సందర్భంలో సంఘాన్ని క్షేత్రస్థాయి నుంచి నిర్మిస్తూ కొత్త నాయకత్వాన్ని ముందుకు తీసుకొచ్చారు. మెజారిటీ అభిప్రాయాలను గౌరవిస్తూ రాజ్యహింసకు వ్యతిరేకంగా రాజీలేని హక్కుల పోరాటాన్ని కొనసాగించడంలో కీలక బాధ్యత నిర్వహించారు. తన పేరు వినగానే హక్కుల పోరాటం గుర్తుకొచ్చేలా పనిచేశారు. నిజంగానే ఆయన ఒక హక్కుల ఉద్యమ ప్రవాహంగా పయనించారు. కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, వారిని కార్యాచరణలో నిమగ్నం చేయడంలో ఎల్లప్పుడూ ముందుండేవారు. వ్యవస్థాగత అసమానతల కారణంగా హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నప్పుడు, రాజ్యం ఆధిపత్య శక్తులకు కొమ్ముకాస్తూ ప్రశ్నించే ప్రజలపై నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రాజ్యహింసను బహిర్గతం చేస్తూ దానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు.

హక్కుల ఉద్యమ సహచరుల ఇళ్లకు వెళ్లినప్పుడు కూడా ఆయన ప్రవర్తన ఇతరులకు ఆదర్శంగా ఉండేది. తాను తిన్న పళ్లెం తానే కడిగి పెట్టేవారు. ప్రాణాలను లెక్కచేయకుండా స్థిర సంకల్పంతో ఉద్యమంలో పనిచేసిన సాహసి ఆయన. సహచరుల పట్ల నిరాడంబరంగా, అందరితో కలిసిపోయే వ్యక్తిగా ఉండేవారు. తన కూతురికి పౌర హక్కుల సంఘం పత్రిక పేరైన 'స్వేచ్ఛ'ను పెట్టడం సంఘం పట్ల ఆయనకున్న గాఢమైన అనుబంధానికి నిదర్శనం.



తాను నమ్మిన విశ్వాసాలను ఆచరించడంలో మొక్కవోని దీక్షతో పనిచేసేవారు. భౌతిక దాడులు జరిగినప్పటికీ చలించ కుండా జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. హక్కుల ఉద్యమ విస్తరణలో భాగంగా మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు మారారు. రాజ్యం నుంచి ప్రాణహాని ఉందని తెలిసినా తన ఉద్యమ కార్యాచ రణను ఆపలేదు. 2000 సంవత్సరం నవంబర్ 23వ తేదీ సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో నయీం ముఠా ఆయనను వెంటాడి వేటకొడవళ్లతో అత్యంత కిరాతకంగా నరికి చంపింది. అనంతరం ఆయనను హుటాహుటిన ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడికి పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకున్నారు. మెడపై తీవ్రంగా నరికిన గాయాన్ని చూసి ప్రజలు తల్లడిల్లిపోయారు. రోదనలు మిన్నంటాయి. పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ దారుణం ఎలా జరిగింది? ఎవరు చేశారు? అనే ప్రశ్నలతో అందరూ సందిగ్ధంలో మునిగిపోయారు.



ఉస్మానియా ఆసుపత్రి నుంచి దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆయన ఇంటి వరకు నినాదాలతో ర్యాలీగా తీసుకెళ్లేసరికి రాత్రయింది. మరుసటి రోజు తెల్లవారుజాము నుంచే మహబూబ్‌నగర్ మీదుగా గద్వాలకు, అక్కడి నుంచి నినాదాలు చేస్తూ ఆయన స్వగ్రామమైన చిన్న తాండ్రపాడుకు తీసుకువచ్చారు. గద్వాల పరిసర గ్రామాల ప్రజలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, ఉద్యమకారులు, అంబేద్కర్‌వాదులు, దళిత, మహిళా సంఘాల నాయకులు, కుల నిర్మూలన పోరాట సమితి సభ్యులు, ప్రజాస్వామికవాదులు, ప్రొఫెసర్లు, యువకులు వేలాదిగా తరలివచ్చారు.

పురుషోత్తం గారి అంతిమయాత్రలో ఆయన ఏడేళ్ల కుమార్తె స్వేచ్ఛ ఇచ్చిన నినాదాలు అందరినీ కంటతడి పెట్టించాయి. హత్యలు, దాడులతో హక్కుల ఉద్యమాన్ని అణచలేరని ఆ అంతిమయాత్ర నిరూపించింది. ఉవ్వెత్తున నినాదాలు లేచాయి. పౌర హక్కుల సంఘం ఆవిర్భావం నుంచి హత్యకు గురైన వారిలో గోపి రాజన్న, జాప లక్ష్మారెడ్డి, డాక్టర్ రామనాథం, నర ప్రభాకర్ రెడ్డి ఉన్నారు. ఆ తర్వాత ఐదో వ్యక్తి పురుషోత్తం. ఈ హత్యలు అక్కడితో ఆగలేదు. మరో మూడు నెలల్లో నల్లగొండలో హోంజం అలీ హత్య జరిగింది. రాజ్యం ప్రత్యక్షంగా కాకుండా హంతక ముఠాలను ఉపయోగించి ప్రశ్నించే ఉద్యమకారులను అంతం చేసే వ్యూహాన్ని అమలు చేసిందనే విమర్శలు వచ్చాయి.

పురుషోత్తంను చంపిన నయీంను అదే రాజ్యం ఎన్‌కౌంటర్ పేరుతో అంతం చేసింది. రాజ్యం తన అవసరాల కోసం ముఠాలను, రౌడీలను, హంతకులను తయారుచేస్తుందని, చివరకు వారి అవసరం తీరినప్పుడు వారినే అంతం చేస్తుంద నడానికి నయీం మరణం ఉదాహరణగా నిలుస్తుందని పౌర హక్కుల సంఘం అభిప్రాయపడింది. నయీంను ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయడాన్ని సంఘం ఖండించింది. ఆ నిరసనలో నయీం చేతిలో ప్రత్యక్ష బాధితుడైన ప్రొఫెసర్ లక్ష్మణ్ కూడా పాల్గొన్నారు. చట్టబద్ధంగా విచారించి న్యాయస్థానాల ద్వారా శిక్షించాలి తప్ప, ఎన్‌కౌంటర్ పేరుతో చట్టవ్యతిరేక హత్యలు చేయడం సరైంది కాదని స్పష్టం చేశారు. ఈ వైఖరిలోనే పురుషోత్తం అందించిన హక్కుల ఉద్యమ స్ఫూర్తి ప్రతిబింబిస్తుంది.

పురుషోత్తం న్యాయవాద వృత్తి చేపట్టినప్పటి నుంచి గొంతు నులిమి చంపబడుతున్న పేదలకు, పీడితులకు, నిరాదరణకు గురైన వారికి న్యాయం అందించాలని అనుక్షణం తపించారు. కొందరు న్యాయవాదులు డబ్బు కోసం న్యాయాన్ని, ధర్మాన్ని వక్రీకరిస్తున్న పరిస్థితుల్లో ఆయన మాత్రం పేద ప్రజల జీవితాల్లో మార్పు కోసం పోరాడుతున్న వారి కేసులనే ఎక్కువగా వాదించేవారు. బూటకపు ఎన్‌కౌంటర్లలో చనిపోయిన జనార్దన్ తదితరుల భౌతికకాయాలను వారి తల్లిదండ్రులకు అప్పగించే వరకు నిలబడి పోరాడారు.

పాలమూరు పల్లెల్లో దళితులు, ఆదివాసీలు, పేదల సమస్యల గురించి, వారు కోల్పోయిన హక్కుల గురించి నిరంతరం మాట్లాడేవారు. దాదాపు రెండు దశాబ్దాలపాటు ఉక్కు క్రమశిక్షణతో పనిచేశారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ఏ చిన్న సంఘటన జరిగినా 'నేనున్నాను' అంటూ అక్కడికి చేరుకునే వారు. అది బూటకపు ఎన్‌కౌంటర్ అయినా, దళితులపై దాడులైనా, మహిళలపై లైంగిక దాడులు, వేధింపులైనా, అమరుల భౌతికకాయాలను కుటుంబాలకు అప్పగించే విషయమైనా ఆయన పాత్ర కీలకంగా ఉండేది.

దళితుల అణిచివేతకు వ్యతిరేకంగా వారికి అండగా నిలిచేవారు. ప్రభుత్వం భూస్వాములకు అండగా ఉండడాన్ని ఎండగడుతూ, సమాజంలో కొనసాగుతున్న రెండు గ్లాసుల పద్ధతికి వ్యతిరేకంగా పోరాడారు. చిన్న తాండ్రపాడు గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని కొందరు అడ్డుకోవడంతో ఘర్షణ తలెత్తినప్పుడు, దాన్ని సామరస్యంగా పరిష్కరించి విగ్రహ ఏర్పాటుకు కృషి చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడడంతోపాటు వారి పిల్లలను పాఠశాలలు, హాస్టళ్లు, విశ్వవిద్యాలయాల్లో చేర్పించేందుకు సహాయ సహకారాలు అందించేవారు.

నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచులతో ఆయనకు దగ్గరి సంబంధాలు ఉండేవి. వారిపై పోలీసులు అరాచకాలకు పాల్పడినప్పుడు అండగా నిలిచి, సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారు. కార్యాలయాలకు, గ్రామాలకు పురుషోత్తం వచ్చారంటే అక్కడి అవినీతి అధికారులు బెంబేలెత్తిపోయేవారు. కరువు ప్రాంతాల్లో తినడానికి తిండి, చేయడానికి పని లేని ప్రజలకు అండగా ఉండేవారు. అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాల్సిన ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పరిష్కరించకపోగా లాఠీలు, తూటాలతో సమాధానం చెబుతున్నాయని విమర్శించేవారు.

ప్రపంచీకరణ, నూతన ఆర్థిక విధానాల కారణంగా కార్మికులు, నిరుద్యోగులు, చేనేత కార్మికులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడగా, అనేక రంగాల ప్రజలు వీధిన పడ్డారు. ఈ విధానాలను ప్రశ్నించిన కార్యకర్తలను, పౌర హక్కుల సంఘం నాయకులను, ప్రజా ఉద్యమకారులను ప్రభుత్వాలు పొట్టనపెట్టుకున్నాయని ఆయన భావజాలం స్పష్టం చేస్తుంది.

అంటరాని కులాలను ద్వేషిస్తూ, వారిని నీచంగా చూసే బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన పురుషోత్తం, తన సామాజిక నేపథ్యానికి భిన్నంగా దళితులు, ఆదివాసీలతో మమేకమై వారి కుటుంబాల్లో ఒకరిగా జీ




నిత్యం హైదరాబాద్ నుండి వందలాది చెత్త లారీల రాకపోకలు.. భరించలేని దుర్వాసన.. భూగర్భ జలాలు, పంట పొలాల కాలుష్యం.. ఇదీ యాచారం మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న 14 మెగావాట్ల వ్యర్థాల ఆధారిత విద్యుత్ ప్లాంట్ కారణంగా తమకు ఎదురుకాబోయే పెనుముప్పు అని యాచారం మండల ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. గ్రేటర్ నగర వ్యర్థాలను తరలించి పచ్చని తమ ప్రాంతాన్ని మరో జవహర్ నగర్‌లా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండటంతో స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా యాచారం గ్రామపంచాయతీ తీర్మానం చేయగా, బీఆర్ఎస్, సీపీఎం సహా విపక్షాలు, ప్రజా సంఘాలు ప్రత్యక్ష పోరాటానికి సమాయత్తమవుతుండటంతో నియోజకవర్గంలో రాజకీయ వేడి రాజుకుంది.

పచ్చని నేలపై 'చెత్త' కుంపటి

యాచారం 14 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్

- భగ్గుమంటున్న ప్రతిపక్షాలు
- భూ బదలాయింపు దాదాపు పూర్తి
- 25 ఎకరాల్లో ప్లాంట్ నిర్మాణానికి సన్నాహాలు
- యాచారం గ్రామపంచాయతీ వ్యతిరేక తీర్మానం
- ఎంపీడీవోకు తీర్మానాల అందజేత
- ఉద్యమ బాటలో బీఆర్ఎస్, సీపీఎం
- మరో జవహర్ నగర్ కానివ్వబోమని హెచ్చరిక





రంగారెడ్డి, నవంబర్ 20(జనం సాక్షి):

వేగంగా భూ బదలాయింపు ప్రక్రియ

శ్రీ వెంకటేశ్వర గ్రీన్ పవర్ ప్రాజెక్టు లిమిటెడ్ ఆధ్వర్యంలో మొత్తం 25ఎకరాల విస్తీర్ణంలో ఈ మెగా పవర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా యాచారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 124/1/2 లోని 1.18 ఎకరాల భూమిని ఇప్పటికే సదరు కంపెనీ పేరిట రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా, సర్వే నంబర్లు 122, 123, 125తో పాటు 105/7/1,2, 105/11/1, 105/8, 105/8/1, 105/10/1, 105/11/4, 105/ 10/4, 105/8/3లలోని ఈ ప్రాజెక్టు, చెత్త డంపింగ్ కోసం భూములను కేటాయించే దిశగా రెవెన్యూ యంత్రాంగం చకచకా పావులు కదుపుతోంది. అతి తక్కువ ధరకే విలువైన భూములను కట్టబెడుతున్నారని, దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులు సైతం కనీసం నోరు మెదపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గ్రామపంచాయతీ ఏకగ్రీవ తీర్మానం..

తమ ఊరి పొలిమేరల్లో చెత్త ఆధారిత విద్యుత్ ప్లాంట్ ఏర్పాటును యాచారం గ్రామ పంచాయతీ పాలకవర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెనుముప్పుగా మారే ఈ 14 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణాన్ని తక్షణమే విరమించుకోవాలని కోరుతూ గ్రామపంచాయతీ ప్రత్యేక తీర్మానం చేసింది. ఈ తీర్మాన ప్రతులను పాలకవర్గ సభ్యులు ఎంపీడీవోకు అందజేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. 2010లో నిలిచిపోయిన పాత ప్రతిపాదనకు మళ్లీ జీవం పోసి, డిసెంబర్‌లో శంకుస్థాపన చేసేందుకు సిద్ధమవడంపై ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి. ఇప్పటికే బండరావిరాలలో డంపింగ్ యార్డు, ఇప్పుడు యాచారంలో చెత్త పవర్ ప్లాంట్ పేరుతో నియోజకవర్గాన్ని కాలుష్య కాసారంగా మార్చే కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్, సీపీఎం నేతలు మండిపడుతున్నారు.



రైతుల పాట్ట కొట్టే కుట్ర

సత్తు వెంకటరమణారెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్

పచ్చని పంట పొలాలతో కళకళలాడే మా ప్రాంతంలో చెత్త ప్లాంట్ పెట్టి భూగర్భ జలాలను, గాలిని కలుషితం చేయాలని చూస్తున్నారు. ఇది ముమ్మాటికీ రైతుల పొట్ట కొట్టే చర్యే. ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తే రైతులు, ప్రజా సంఘాలతో కలిసి భారీ ఎత్తున ఆందోళనలు చేపడతాం.

ప్రజల ఆరోగ్యమే ముఖ్యం

అనిత, సర్పంచ్, యాచారం.



యాచారం ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా చెత్త విద్యుత్ ప్లాంట్ నిర్మించాలని చూడటం సరికాదు. పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలిగించే ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి ఎంపీడీవోకు అందజేశాం. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి.

రెవెన్యూ అధికారుల తీరు అనుమానాస్పదం

కర్నాటి రమేష్, బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీ



కోట్లాది రూపాయల విలువైన భూములను రూపాయి ఖరీదు లెక్కన ప్రైవేట్ సంస్థకు కట్టబెడుతూ భూ బదలాయింపు చేస్తుంటే రెవెన్యూ అధికారులు కనీసం నోరు మెదపడం లేదు. రోజుకు 700 టన్నుల చెత్త లారీలు వస్తే యాచారం, బండరావిరాల గ్రామాలు నాశనమవుతాయి. ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుని తీరుతాం.

యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు సదర్ ప్రతీక

■ తెలంగాణ వైభవాన్ని చాటే పండుగ.. ■ పశుసంపదను పూజించడం గొప్ప సంప్రదాయం ■ భావితరాలకు వారసత్వంగా అందించాలి : ఎమ్మెల్యే బుయ్యని



తాండూరు, నవంబర్ 22 (జనంసాక్షి): సదర్ ఉత్సవం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి ప్రతీక అని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి తాండూరు పట్టణంలో యాదవ సోదరులు ఘనంగా నిర్వహించిన సదర్ సమ్మేళనంలో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. యాదవుల ఆత్మగౌరవం, ఐక్యతకు సదర్ ఉత్సవం నిదర్శనమన్నారు. తిరుమలలో శ్రీవారి సుప్రభాత సేవకు ముందు గొల్లవారు (యాదవులు) స్వామివారిని దర్శించుకునే విశిష్ట సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతోందని గుర్తుచేశారు. దీపావళి సందర్భంగా పాడి సంపదకు ప్రతీకలైన దున్నపోతులను పూజించడం యాదవుల గొప్ప సంస్కృతికి నిదర్శనమన్నారు. బతుకమ్మలో పూలను, బోనాల్లో అమ్మవారిని పూజించినట్లే సదర్‌లో పశుసంపదను గౌరవించడం తెలంగాణ ప్రత్యేకత అని పేర్కొన్నారు. పూర్వీకులు ఆచరించిన ఈ సంప్రదాయాన్ని ప్రస్తుత తరం కొనసాగిస్తూ, భావితరాలకు వారసత్వంగా అందించాలని సూచించారు. సదర్ వేడుకలను అద్భుతంగా నిర్వహించిన యాదవ సోదరులను ఎమ్మెల్యే అభినందించారు.

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పోలియో వ్యాక్సినేషన్ కీలకం



మొయినాబాద్, నవంబర్ 22 (జనంసాక్షి): ఐదు సంవత్సరాలలోపు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పోలియో వ్యాక్సినేషన్ కీలక పాత్ర పోషిస్తుందని, రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ షాపురం రాజు (మాణిక్యం) అన్నారు. ఆదివారం మొయినాబాద్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షాపురం రాజు (మాణిక్యం) పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. గతంలో ప్రపంచ వ్యాప్తంగా పోలియో అంటే పెద్ద వ్యాధిగా భావించి ప్రజలందరూ భయపడేవారని తెలిపారు. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా పంపిణీ చేస్తున్న పల్స్ పోలియో వ్యాక్సిన్ ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పోలియో వ్యాక్సినేషన్ కీలక పాత్ర పోషిస్తుందని, దేశాన్ని పూర్తి స్థాయి పోలియో రహిత దేశంగా నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తులేకలాన్ గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం

400 మందికి ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ



ఇబ్రహీంపట్నం, నవంబర్ 22(జనం సాక్షి) : బి.ఆర్.ఆర్ ఫౌండేషన్ సహకారంతో, సాయి కీర్తన్ రెడ్డి లెగసి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని తులేకలాన్ గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ శిబిరానికి గ్రామ ప్రజల నుండి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.ఆర్.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామిరెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 400 మందికి పైగా ప్రజలు హాజరై నిపుణులైన వైద్యులచే ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం రోగులకు అవసరమైన మందులను నిర్వాహకులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తులేకలాన్ గ్రామ సర్పంచ్ సామ అశ్విని రవీందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిలర్ చిలుకల బుగ్గ రాములు, మాజీ సర్పంచులు చిలుకల యాదగిరి, బీరప్ప, బి.ఆర్.ఎస్ నాయకులు సామ జంగా రెడ్డి, యూత్ అధ్యక్షులు బాష, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లాలో 98 శాతం పల్స్ పోలియో పూర్తి

4,25,256 మంది చిన్నారులకు పోలియో చుక్కలు - మిగిలిన వారికి ఇంటింటికీ వెళ్లి టీకాలు

రంగారెడ్డి జిల్లా, నవంబర్ 22 (జనంసాక్షి): రంగారెడ్డి జిల్లాలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. జిల్లావ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో భాగంగా మొత్తం 4,25,256 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి వెల్లడించారు. ఇది జిల్లాలో నిర్దేశించిన మొత్తం లక్ష్యంలో 98 శాతమని తెలిపారు. రాజేంద్ర నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి హెచ్‌సి)లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇమ్యునైజేషన్ అధికారి షీబా హయాత్ తదితర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇంకా పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారుల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. మిగిలిన చిన్నారులకు సోమవారం, మంగళవారం ఫీల్డ్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని పేర్కొన్నారు.జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలున్న తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి విజ్ఞప్తి చేశారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రజలు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

తెలంగాణలో ఎస్‌బీఐ విస్తృత సామాజిక సేవా కార్యక్రమాలు





- జోగులాంబ ప్రాంతీయ కార్యాలయానికి చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి శంకుస్థాపన
- 60 అంగన్‌వాడీ కేంద్రాల ఉన్నతీకరణ.. విద్యాసంస్థలకు డిజిటల్ సదుపాయాలు

హైదరాబాద్, నవంబర్ 22 (జనంసాక్షి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో తెలంగాణవ్యాప్తంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టింది. ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ఆదివారం జోగులాంబ ప్రాంతీయ వ్యాపార కార్యాలయం (ఆర్‌బీఓ) నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు వివిధ సీఎస్ఆర్ కార్యక్రమాలను ప్రారంభించారు. జోగులాంబలో ఏర్పాటు చేయనున్న నూతన కార్యాలయం ద్వారా మూడు నుంచి నాలుగు జిల్లాల్లోని బ్యాంకు శాఖలకు మెరుగైన పరిపాలనా, వ్యాపార సేవలు అందనున్నాయి. ఈ ప్రాంగణంలో నమూనా బ్యాంకు శాఖ, వ్యవసాయ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రుణ కేంద్రం, గృహ రుణ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. 2028 నాటికి బ్యాంకుకు చెందిన సుమారు 110 పరిపాలనా కార్యాలయాలు సొంత భవనాల్లో పనిచేస్తాయని ఛైర్మన్ తెలిపారు. దేశవ్యాప్తంగా 23 వేల శాఖలు, 1.60 లక్షలకు పైగా సేవా కేంద్రాల ద్వారా 53 కోట్ల మంది వినియోగదారులకు ఎస్‌బీఐ సేవలందిస్తోందని పేర్కొన్నారు.

సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణలో 60 అంగన్‌వాడీ కేంద్రాలను ఉన్నతీకరించనున్నారు. వనపర్తి జిల్లాలోని పెబ్బేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు డెస్క్‌టాప్‌లు, భోజనశాల షెడ్డు, ఆర్వో నీటి శుద్ధి యంత్రాన్ని, వనపర్తిలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌కు ఐదు అంతర్జాల బోధనా తెరలు, ఆర్వో యంత్రాలు, సౌర విద్యుత్ వ్యవస్థను అందించారు.

నాగర్‌కర్నూలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 30 కంప్యూటర్లు, ఐదు మల్టీమీడియా ప్రొజెక్టర్లను అందజేశారు. 50 మంది బాలికా విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఆలంపూర్‌లోని శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానానికి డిజిటల్ కియోస్క్, ఇ-బగ్గీని విరాళంగా అందించారు. వీటి ద్వారా భక్తులకు డిజిటల్ సేవలు, వృద్ధులు, దివ్యాంగులకు రవాణా సౌకర్యం కల్పించనున్నారు. విద్య, మహిళా, శిశు సంక్షేమం, గ్రామీణ మౌలిక సదుపాయాలు, డిజిటల్ సేవల విస్తరణే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు ఎస్‌బీఐ తెలిపింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నీలేష్ ద్వివేది, జనరల్ మేనేజర్లు సతీష్ కుమార్, రణ్‌విజయ్ ప్రతాప్, డీజీఎం సూరజిత్ త్రిపాఠి, డీజీఎం ప్రియబ్రత మిశ్రా పాల్గొన్నారు.



పల్స్ పోలియోలో 94.70 శాతం లక్ష్య సాధన

- తొలిరోజే 5.11 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు
- డీఎంహెచ్ఓ డాక్టర్ ఆనంద్ కుమార్



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 22 (జనంసాక్షి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం తొలిరోజు విజయవంతమైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆనంద్ కుమార్ తెలిపారు. జిల్లాలో నిర్దేశించిన లక్ష్యంలో 94.70 శాతం సాధించినట్లు వెల్లడించారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు 5,40,818 మందిని లక్ష్యంగా నిర్దేశించగా.. మొదటి రోజే 5,11,986 మందికి చుక్కలు వేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. బూత్‌ల ద్వారా 4,99,923 మంది, ట్రాన్సిట్ పాయింట్ల పద్ద 7,096 మంది, మొబైల్ టీమ్‌ల ద్వారా 4,967 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వివరించారు. మొత్తంగా 94.70 శాతం లక్ష్యాన్ని తొలిరోజే సాధించామని తెలిపారు. వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారని అభినందించారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా పూర్తి చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎంహెచ్ఓ కోరారు.

తూప్రాన్‌లో 24న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

తూప్రాన్, నవంబర్ 22 (జనంసాక్షి): : తూప్రాన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఈ నెల 24న ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. హైకోర్టు న్యాయమూర్తి, మెదక్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సుద్దాల చలపతిరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి. విజయసేన్‌రెడ్డి, జస్టిస్ నర్సింగ్‌రావు నందికొండ, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి పాల్గొననున్నారు.

గన్నేరువరంలో దట్టంగా కమ్ముకున్న మంచు

వాహనదారులకు పోలీసుల హెచ్చరిక



గన్నేరువరం, నవంబర్ 22 (జనంసాక్షి): గన్నేరువరం మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున దట్టమైన మంచు కమ్ముకుంది. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు గ్రామమంతా మంచు తెరలో చిక్కుకుపోయింది. ఇళ్లు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, రోడ్లు ఏవీ స్పష్టంగా కనిపించలేదు. 10 అడుగుల దూరంలో ఉన్న మనుషులు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో ఉదయం పనులకు వెళ్లే కూలీలు, రైతులు, పాల వ్యాపారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చలి తీవ్రత ఒక్కసారిగా పెరగడంతో వృద్ధులు, చిన్న పిల్లలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. చాలా మంది చలిమంటలు వేసుకుని చలి కాచుకున్నారు. ప్రధాన రహదారిపై వెళ్లే వాహనదారులు హెడ్ లైట్లు వేసుకుని నెమ్మదిగా ప్రయాణించారు.ఈ సందర్భంగా గన్నేరువరం ఎస్సై నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... చలికాలంలో తెల్లవారుజామున దట్టమైన మంచు కురుస్తుందని, వాహనదారులు చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు."మంచు కారణంగా రోడ్డు సరిగా కనిపించదు. కాబట్టి వాహనదారులు వేగంగా వెళ్లవద్దు. హెడ్ లైట్లు వేసుకుని, హారన్ కొడుతూ నెమ్మదిగా వెళ్లాలి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు మరింత జాగ్రత్తగా ఉండాలి. చిన్న పిల్లలు, వృద్ధులు ఉదయం పూట చలిలో బయటకు రావద్దు. ఎవరికైనా ఇబ్బంది కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి" అని ఎస్సై జి. నరేందర్ రెడ్డి సూచించారు. ఉదయం 8.30 గంటల తర్వాత ఎండ రావడంతో మంచు క్రమంగా తొలగిపోయింది. రాబోయే రోజుల్లో మంచు మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అహంకారానికి కార్మికుల గట్టి దెబ్బ

- యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ భాస్కర్‌రెడ్డి
- ఈసీఐఎల్ యూనియన్ ఎన్నికల్లో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఘన విజయం



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 22 (జనంసాక్షి) : కార్మికుల ఐక్యత ముందు అహంకారం, రాజకీయ పలుకుబడి పనిచేయలేదని ఈసీఐఎల్ ట్రేడ్ యూనియన్ ఎన్నికల ఫలితాలు నిరూపించాయని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈసీఐఎల్ పరిశ్రమలో ట్రేడ్ యూనియన్ వెరిఫికేషన్ ఎన్నికల్లో భారతీయ మజ్దూర్ సంఘ్ (ఈసీఎంఎస్)పై స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ విజయం కార్మికుల ఐక్యతకు, తమ నాయకత్వంపై వారికున్న విశ్వాసానికి నిదర్శన మన్నారు. 2027 వేతన సవరణతో పాటు భవిష్యత్తు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కార్మికులు తమ యూనియన్‌కు అండగా నిలిచారని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఈసీఎంఎస్‌కు వీడియో సందేశం ద్వారా మద్దతు ప్రకటించినప్పటికీ కార్మికులు తమ యూనియన్‌కే పట్టం కట్టారని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉద్యోగుల సంక్షేమం, సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఎన్‌పీసీఐఎల్, రక్షణ రంగం నుంచి మరిన్ని ఆర్డర్లు సాధించేందుకు అవసరమైతే బండి సంజయ్ సహకారం కోరుతామన్నారు. 2027 వేతన సవరణ, పెండింగ్ సమస్యల పరిష్కారం, కార్మిక హక్కుల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

అంబేద్కర్‌కు నివాళులు..

విజయానంతరం యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.డేవిడ్‌రాజ్ ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్‌లోని అంబేద్కర్ విగ్రహానికి, ఈసీఐఎల్ పరిశ్రమ వ్యవస్థాపకులు డాక్టర్ ఏఎస్ రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్నికల్లో సహకరించిన కార్మికులు, అధికారులు, యాజమాన్యం, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, ఉద్యోగ సంఘాలు, కాంట్రాక్టు కార్మికులు, సామాజిక సంఘాలు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ప్రవీణ్, కె.శ్రీనివాస్, టి.పద్మారెడ్డి, పి.వెంకటేష్, విజయ, ఎ.వీరునాయక్, ఆర్.రమేష్, రాజశేఖర్, నరేందర్‌రెడ్డి, వెంకటేష్, శ్రీకాంత్, జి.మనోహర్, కోరుకొండ రాజు, ప్రశాంత్, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23 నవంబర్ 2026

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- మద్దిమడుగులో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాట్లకు శంకుస్థాపన
- మద్దిమడుగులో 5 వేల మంది గిరిజనులతో ప్రత్యేక సభ
- అచ్చంపేటలో లక్ష మందితో భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



అచ్చంపేట, నవంబర్ 22 (జనం సాక్షి) : నియోజకవర్గ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న మద్దిమడుగు గ్రామంలో ఈనెల 26వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదివారం అచ్చంపేట మద్దిమడుగు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మద్దిమడుగులో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాట్లకు శంకుస్థాపన చేయడంతో పాటు సుమారు 5 వేల మంది గిరిజనులతో బహిరంగ సభ నిర్వహించనున్నారు. అదేవిధంగా అచ్చంపేట పట్టణంలో సుమారు లక్ష మందితో మరో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు.

ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అచ్చంపేట నియోజకవర్గ పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మద్దిమడుగు గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాట్లకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన జరగనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారని తెలిపారు.

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి మద్దిమడుగు, అచ్చంపేట ప్రాంతాల్లో పర్యటించనున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అచ్చంపేట పట్టణంలో లక్ష మందితో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నందున సభా ప్రాంగణం చుట్టూ 1500 వాహనాలు నిలిపేలా ఐదు వేర్వేరు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సభకు వచ్చే ప్రజలు తమ వాహనాలను నిర్దిష్ట పార్కింగ్ ప్రాంతాల్లో నిలిపేలా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలు సభా ప్రాంగణానికి సులభంగా చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న మద్దిమడుగు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించి సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాట్లకు శంకుస్థాపన చేయనుండటం గిరిజన సమాజానికి ఎంతో ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని పేర్కొన్నారు.

మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఏర్పాట్ల పరిశీలన అనంతరం ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మద్దిమడుగు ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు ప్రత్యేక పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయ విశిష్టత, చారిత్రక ప్రాధాన్యత, ఆలయ సంప్రదాయాలను వారికి వివరించారు. ఈనెల 26వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దిమడుగు ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయం, అచ్చంపేట డీఎస్పీ పి. శ్రీనివాసులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడివడిగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు

- మంత్రి వాకిటి శ్రీహరి పర్యవేక్షణలో త్వరితగతిన పూర్తికి చర్యలు



మక్తల్, నవంబర్ 22 (జనంసాక్షి) : మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో రూ. 230 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి నిరంతర పర్యవేక్షణలో నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నాటికి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, తరగతులు ప్రారంభించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్యూరి రవికుమార్, సీనియర్ నాయకులు కల్లూరి గోవర్దన్ నిర్మాణ స్థలాన్ని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోనే అత్యంత వేగంగా ఈ ప్రాజెక్టుకు అనుమతులు సాధించారని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఒకే చోట నాణ్యమైన, అంతర్జాతీయ స్థాయి విద్యను అందించే లక్ష్యంతో పనులను సకాలంలో పూర్తి చేయిస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని విద్యా సంస్థలను తీసుకువచ్చి మక్తల్‌ను ఒక ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చేందుకు మంత్రి కృషి చేస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరికి ప్రజలందరూ అండగా నిలిచి సహకరించాలని వారు పిలుపునిచ్చారు.

ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 22 (జనం సాక్షి) : ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని,చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, పోలియో వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలియో శిబిరాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించడం ద్వారా వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు భరోసా కల్పించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ జై రామ్ నాయక్, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యం



పటాన్‌చెరు, నవంబర్ 22 (జనం సాక్షి) : చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ లో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు రెండు చుక్కల ఓరల్ పోలియో వ్యాక్సిన్ (బీఓపీవీ) అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యంగా చిన్నారులకు వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలంటే ప్రభుత్వ ప్రయత్నాలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం రాష్ట్రంలోని తల్లిదండ్రులు బాధ్యతగా భావించాలని కోరారు. పిల్లల ఆరోగ్యంపై పెట్టే శ్రద్ధే రేపటి సమాజానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకూడదని, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అర్హులైన పిల్లలకు వ్యాక్సిన్ అందించాలని సూచించారు. ప్రజాప్రభుత్వం చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని నీలం మధు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు గోపాల్, దస్తగిరి, నాయకులు అనిల్, శ్రీనివాస్, వైద్య సిబ్బంది, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు..

కోయిల్‌సాగర్ నీటిని తరలిస్తే ఉద్యమిస్తాం

- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అడ్డుకోవాలి
- నారాయణపేటపై సిఎం వివక్ష

నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జనం సాక్షి) : కొడంగల్ ఎత్తిపోతల పథకానికి కోయిల్ సాగర్ నీటిని తరలిస్తే బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు అని ఉద్యమిస్తామని నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.నారాయణపేట,దేవరకద్ర ప్రాంతాలకు తీరని నష్టమని నీటి తరలింపును కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.ఆదివారం ఆయన నారాయణపేట జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో విలేకరుల సమావే శంలోమాట్లాడుతూ కాంగ్రె స్ అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి ఎన్నికల్లో చెప్పింది ఒక్కటి చేసేది మరొకటిగా ఉందన్నారు. ఎన్నికలో రేవంత్ రెడ్డి కొడంగల్, నారాయణపేట రెండు కళ్ళ కంటివని అన్నారు.కానీ నేడు నారాయణ పేట నియోజకవర్గాన్ని పట్టించుకోవడంలేదన్నారు. ఉద్దేశపూర్వకంగా 1.32 లక్షల ఎకరాలకు నీరు అందించే పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రేవంత్ రెడ్డి పక్కన పెట్టారన్నారు. నారాయణపేట నియోజకవర్గ ప్రజలను మభ్యపెట్టి ఒకే ఒక్క ప్రణాళికతో కొడంగల్‌కు నీళ్లు తీసుకొని వెళ్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎమ్మేలలకు తెలియకుండా కోయిల్ సాగర్ నుంచి కొడంగల్ కు నీళ్లు తీసుకొని వచ్చేందుకు టెండర్ వేయడం జరిగింద ని అన్నారు. 2.1 టి ఎం కెపాసిటీ కల్గిన కోయిల్ సాగర్ ప్రాజెక్టుకు రెండు మోటార్లు ఆన్ చేసి 24 గంటల పాటు నడిపితే ప్రాజెక్ట్ నిండాదానికి దాదాపు రెండు నెలల పది రోజులు అవుతుందనీ అన్నారు. నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం నుంచి కొడంగల్ కు తాగునీటిని తీసుకల్లనారు. అంతే కాని కోయిల్ సాగర్ నుంచి తీసు కెళ్ళడానికి వీలు లేదనన్నా రు. కోయిల్ సాగర్ నుంచి నీటిని తీసుకెళ్లి రైతుల కడుపు కొట్టవద్దన్నారు. ఇప్పటికీ రెండు కళ్ళు అని చెప్పి నారాయణపేట నియోజకవర్గ రైతుల కంటికి సున్నం కొట్టడం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా నారాయణ పేట, దేవరకద్ర నియోజక వర్గ ఎమ్మెల్యేలు అడుకోవా లన్నారు. లేకపోతే ఆయా నియోజకవర్గ రైతుల తర పున తెలంగాణ ఉద్యమం లాగా మరో ఉద్యమం చేస్తా మన్నారు. అన్ని పార్టీలను కలుపుకొని పోయి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేస్తా మనీ హెచ్చరించారు. రైతుల శ్రేయస్సు



ముఖ్యమని అందుకోసం బిఆర్ఎస్ పార్టీ ఎంత వరకైనా వెళ్తామన్నారు. సీఎంను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒప్పిం చి కొయిలోసాగర్ నుంచి నీటిని తరలించే ప్రక్రియను అపాలన్నారు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆలా వెంకటేశ్వర్ రెడ్డి ముందే హెచ్చరించారని అన్నారు. మూడు రోజుల్లో ఆపుతు న్నట్లు ప్రకటన వెలువడ కపోతే తామే రైతుల తర పున ఆందోళన చేస్తామ న్నారు. కొడంగల్ కు నీళ్లు తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతోనే రెండవ పంట వేయరాదని కాంగ్రెస్ ప్రభుత్వం పన్నాగం పడుతున్నట్లు తెలుస్తుంద న్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణ చేయడమే వీహెచ్‌పీ లక్ష్యం



నారాయణపేట, నవంబర్ 22 (జనం సాక్షి) : ధర్మ పరిరక్షణ చేయడమే విశ్వహిందూ పరిషత్ లక్ష్యమని జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోనీ పళ్ళ హనుమాన్ మందిరం వద్ద ఆదివారం హిత చింతక్ అభియాన్ (విశ్వహిందూ పరిషత్ సభ్యత్వ నమోదు) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో పూజలను నిర్వహించి భజనలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి రోజు విశ్వహిందూ పరిషత్ ఆవిర్భవించిందన్నారు. హిందువులలో ఐక్యత, సంఘటన నిర్మాణమే లక్ష్యమన్నారు. బలవంతపు మతమార్పిడులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు ధర్మ పోరాటం చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ హిందూ సమాజంపై అవగాహన పెంపొందించుకున్నప్పుడే మన లక్ష్యం సాధించిన వారమవుతామన్నారు. లవ్ జిహాదీ పట్ల విశ్వహిందూ పరిషత్ కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు గోరక్షణ చేయాలన్నారు. హిందువుల ఐక్యతతోనే అయోధ్యలో రామ మందిర నిర్మాణం జరిగిందన్నారు. మూడేళ్లకోసారి విశ్వహిందూ పరిషత్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇందులో భాగంగా జిల్లాలోనీ ప్రతి గ్రామం నుంచి 10 మంది విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలతో సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో మ్యాదమ్ ప్రభాకర్, పట్టణ అధ్యక్షులు మురళి భట్టడ్, రామచంద్రయ్య, సందీప్ మిస్కిన్, కడుదాస్ ప్రవీణ్, రాజ్ శేఖర్, ఉశప్ప, అరవింద్, ఆకాష్, రాఘవ, ఉమాదేవి, స్వాతి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం దిశగా ప్రయాణించాలి



ఆందోల్, నవంబర్ 22 (జనం సాక్షి) : జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు రాజ్యాధికారం దిశగా ప్రయాణించాలని సంగారెడ్డి జిల్లా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య ఆకాంక్షించారు.అందోల్ నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన పుల్కల్ గ్రామానికి చెందిన లస్కరి ఆంజనేయులును ఆయన శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇమ్మయ్య మాట్లాడుతూ దేశంలో 52 శాతానికి పైగా జనాభా కలిగిన బీసీలు రాజకీయంగా మరింత చైతన్యవంతులై,తమ జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజ్యాధికారంలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు.తక్కువ జనాభా కలిగిన కొన్ని వర్గాలు రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకుంటూ పాలనలో కీలక పాత్ర పోషిస్తున్నప్పుడు, జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు కూడా సంఘటితమై రాజకీయ రంగంలో ముందుకు సాగాలని సూచించారు. బీసీలు తమ హక్కులు, ఆత్మగౌరవం,రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఐక్యంగా పోరాడాలని,సామాజిక న్యాయం సాధించేందుకు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.బీసీలు చేసే ఈ ప్రయత్నంలో ఎస్సీలుగా తాము కూడా అండగా నిలుస్తామని, బీసీల ఉద్యమంలో కలిసి నడుస్తూ అవసరమైన మద్దతు అందిస్తామని ఇమ్మయ్య స్పష్టం చేశారు.బీసీలు,ఎస్సీలు పరస్పర సహకారంతో ఐక్యంగా ముందుకు సాగితే సామాజిక, రాజకీయ రంగాల్లో మరింత బలాన్ని సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బోయిని శ్రీనివాస్,శివరత్నం, పోచయ్య,దిగంబర్,సగ్గల్ల శ్రీనివాస్,దప్పు మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయండి



ఆత్మకూర్, నవంబర్ 22 (జనం సాక్షి) : యువత సమస్యల పరిష్కారం, విద్యార్థుల భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం డిసెంబర్ 7న ఢిల్లీలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ పిలుపునిచ్చారు.ఆదివారం ఆత్మకూర్ బీసీ హాస్టల్‌లో చలో ఢిల్లీ కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజాస్వామ్యవాదులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. దేశంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, విద్యారంగంలోని సమస్యలు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలపై భారం పడుతున్న తరుణంలో దేశభక్తి ముసుగులో హింస, విద్వేష రాజకీయాలు చేయడం తగదన్నారు.డిసెంబర్ 7న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రణీత్, మనోజ్, శివ, అజిత్, అశోక్, బన్నీ, సిద్దు నాయక్, అఖిల్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీకగా వట్టెం దర్గా ఉర్సు ఉత్సవాలు

- ఈ నెల 29 నుంచి డిసెంబర్ 1 వరకు మూడు రోజులపాటు ఆధ్యాత్మిక సందడి
- ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న దర్గా
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి) : మతసామరస్యం, సోదరభావం, ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్న వట్టెం దర్గా ఉర్సు ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల పరిధిలోని వట్టెం గ్రామంలో కొలువుదీరిన హజరత్ ఖాజా మహమ్మద్ రుస్తుం అలీషా చిస్తీ మీర్జాయి ఖలందరి దర్గా వద్ద 8వ వార్షిక ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దర్గా నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 29వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు మూడు రోజులపాటు ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో కొనసాగనున్నాయి.శ్రీ సదరుల్ మషాయిక్ హజరత్ హఫీజ్ ఓ ఖారి ఖాజా సయ్యద్ షా షర్ఫోద్దిన్ చిస్తీ మీర్జాయి ఖలందరి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ఉర్సు ఉత్సవాల్లో వివిధ ఆధ్యాత్మిక, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని దర్గాను విద్యుత్ దీపాలతో



అలంకరించడంతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దర్గా పీఠాధిపతి హజరత్ మహమ్మద్ ఖాజా అమీర్ అలీ చిస్తీ మీర్జాయి ఖలందరి (ఖాజా బాబా) స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

వేలాదిగా తరలిరానున్న భక్తులు

ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా నిర్వహించే వట్టెం దర్గా ఉర్సు ఉత్సవాలకు ఈ ఏడాది కూడా వేలాదిమంది భక్తులు తరలిరానున్నారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్ కర్నూల్, ఆమనగల్, సంగారెడ్డి, వనపర్తి తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకోనున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలతో వట్టెం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొననుంది.కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొనే ఈ ఉర్సు ఉత్సవాలు మతసామరస్యానికి, మానవత్వానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. భిన్న మతాలకు చెందిన ప్రజలు ఒకే వేదికపై కలుసుకొని ఆధ్యాత్మిక భావాలను పంచుకోవడం ఈ ఉత్సవాల ప్రత్యేకతగా చెప్పవచ్చు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

భక్తులకు దర్గా నిర్వాహకుల ఆహ్వానం

ఉర్సు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించేందుకు భక్తులందరూ అధిక సంఖ్యలో హాజరై సహకరించాలని దర్గా నిర్వాహకులు కోరారు. మూడు రోజులపాటు జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.వట్టెం దర్గాకు చేరుకోవడానికి నాగర్ కర్నూల్, జడ్చర్ల పట్టణాల నుంచి బస్సు సౌకర్యం అందుబాటులో ఉందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు ఈ రవాణా సౌకర్యాన్ని వినియోగించుకొని ఉర్సు ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు.

నిర్లక్ష్యంగా రోడ్డు పక్కన నిలిపిన ట్రాక్టర్

- ట్రాక్టర్ ను ఢీకొని రైతు మృతి
- ట్రాక్టర్ యజమానితోపాటు డ్రైవర్ పై కేసు నమోదు



వెంకటాపూర్, నవంబర్ 22 (జనం సాక్షి) : భూపాలపల్లి జిల్లా గుర్రంపేట గ్రామానికి చెందిన మార్క సదయ్య రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాద ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. గుర్రంపేట నుంచి పెద్దాపూర్‌లో జరుగుతున్న కూరగాయల సంతకు కూరగాయలు తీసుకునేందుకు వెళ్తున్న క్రమంలో బావసింగ్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సబ్ స్టేషన్ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను మార్క సదయ్య ద్విచక్ర వాహనం వెనుక భాగంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదయ్యకు ఛాతి భాగంలో బలమైన గాయాలయ్యాయి. తీవ్ర గాయలైన సదయ్య అక్కడికక్కడే మరణిం చారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని వెంకటాపూర్ పోలీసులకు సమా చారం అందించారు. హుటాహుటిన సంఘట న స్థలము చేరుకున్న పోలీసులు రోడ్డు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించ డంతోపాటు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు మార్క వెంకటేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రోడ్డు పక్కన ఎటువంటి హెచ్చరిక సూచికలు లేకుండా నిర్లక్ష్యంగా వాహనాన్ని నిలిపి ఉంచిన ట్రాక్టర్ యజమాని తోపాటు డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ చల్ల రాజు తెలిపారు.మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ఆసిఫాబాద్ లో మెగా జాబ్ మేళా

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 22(జనంసాక్షి): ఆసిఫాబాద్ లోని మోడల్ స్కూల్, కొమరం భీమ్ చౌక్, కలెక్టర్ ఆఫీస్ రోడ్ లో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ మేళాలో 40 ప్రముఖ కంపెనీలు పాల్గొని 2000 ఉద్యోగాలను భర్తీ చేశాయి. యశోద ఫౌండేషన్, అపోలో హాస్పిటల్స్, మెడ్ ప్లస్, టాటా, మహీంద్రా, సాహితి సిస్టమ్స్ వంటి కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన వందలాది మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు. ఎంపికైన వారికి రూ.14,000 నుండి రూ.25,000 వరకు జీతం లభించనుంది.

ధాన్యం దళారుల పాలు.. రైతు కష్టాల పాలు

- కాట రాళ్లు లేకుండా బస్తాలతో తూకం
- ఇంకా తెరుచుకొని ఐకెపి కొనుగోలు కేంద్రాలు
- పట్టించుకోని ప్రభుత్వాలు, పౌర సరఫరా శాఖ అధికారులు
- దళారుల ధాన్యం దోపిడీని అరికట్టేవారు ఎవరు?
- క్వింటా వడ్లు రూ.1800 రూ.2400 కనీస మద్దతు ధర కంటే తక్కువ





నూగూర్ వెంకటాపురం నవంబర్ 22(జనం సాక్షి) : రైతు ఎండనక వాన అనక ఎక్కడొక్కాడ పెట్టుబడి తెచ్చి వ్యవసాయం చేస్తే ఒక పక్క ఎలినినో ప్రభావం, మరో పక్కన దళారుల దోపిడీ ఎక్కువవుతోంది, అష్ట కష్టాలు పడి పండించిన పంట ను దళారులు మోసం తో కొనుగోలు చేసి అందిన కాడికి దోచుకొని పోతున్నారు.ధాన్యం కొనుగోలులో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరుచుకోకపోవడంతో దళారులు రైతులను దోచు కుంటున్నారు. రైతు పండించిన ధాన్యం దళారుల పాలవుతుంటే, కష్టాలు మాత్రం రైతుల పాలవుతున్నాయి. ఇదేమిటని అడిగితే అంతే రోజుకో లాగా ధాన్యం రేటు తగ్గుతుందని దళారులు చెప్పడం జరుగుతుంది. ఎలినినో ప్రభావం వలన పంటలు సరిగా పండక పోవడం తో, మరో పక్కన కాట లో మోసం తో రైతులకు మిగిలేది కన్నీళ్లు తప్ప ఇంకా ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాటారాళ్లు లేకుండా బస్తాలతో తూకం

గ్రామాల్లో దళారులు కాటా రాళ్లు లేకుండా బస్తాల లెక్కన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఒక బస్తాకు 71 కిలోలు అని చెప్పి, 74-75 కిలోల ధాన్యాన్ని తీసుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తూకంలో మోసం చేస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారని వాపోయారు. క్వింటాకు రూ. 1800 - రూ. 2,400మాత్రమే ఇచ్చి, మద్దతు ధర కంటే చాలా తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. చేసేది లేక రైతులు అదే ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు మండి పడ్డారు.

ఇంకా తెరుచుకోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలు

ఖరీఫ్ సీజన్ ధాన్యం చేతికి వచ్చి వారం రోజులు దాటినా ఇప్పటివరకు మండలంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాలు పూర్తిగా తెరుచుకోలేదు. ఎక్కడో ఒకటి రెండు కేంద్రాలు తెరిచినా, తేమ పేరుతో కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు ధాన్యాన్ని ఇంట్లో పెట్టుకోలేక, కల్లాల్లోనే ఆరబెట్ట లేక అనేక రకాలుగా అవస్థలుపడుతున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం, పౌర సరఫరాల శాఖ అధికారులు

రైతుల కష్టాలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూకాల్లో మోసం చేస్తున్న దళారులపై తూనికలు కొలతల పై పౌర సరఫరా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలనిరైతులు డిమాండ్ చేస్తున్నారు. 'ప్రభుత్వం వెంటనే అన్ని గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలు తెరిచి, మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి. దళారుల దోపిడీని అరికట్టాలి. లేకపోతే రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తాం' అని రైతులు హెచ్చరించారు.

జీవిత బీమా కుటుంబానికి ఆర్థిక భద్రత నిస్తుంది

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



శాయంపేట, నవంబర్ 22 (జనం సాక్షి) : జీవిత బీమా కుటుంబానికి ఆర్థిక భద్రత నిస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. శాయంపేట మండలంలో తహరాపూర్, శాయంపేట, పత్తిపాక, పెద్దకోడపాక గ్రామాల్లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామాల ప్రజలు, రైతులు, అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ముఖ్య ఉద్దేశ్యం, ప్రయోజనాలు, అర్హతలు, దరఖాస్తుకు అవసరమైన పత్రాలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం, పథకానికి సంబంధించిన నియమ నిబంధనలను వివరించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను స్వయంగా పరిశీలిస్తూ, ప్రజలకు పథకంపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకానికి సంబంధించిన వివరాలను తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం, ఆర్థిక భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

శాయంపేట మండలం లోని తహరాపూర్, పెద్దకోడపాక గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖ అధికారులు, రైతులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలి

- ఆన్ లైన్ డాటా ఎంట్రీని వెంట వెంటనే చేపట్టాలి
- వరంగల్ రెవెన్యూ అదనపు జిల్లా కలెక్టర్ కిషోర్, జిల్లా పరిషత్ సీఈవో వసంత



చెన్నారావుపేట, నవంబర్ 22 (జనంసాక్షి) : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ రెవెన్యూ అదనపు జిల్లా కలెక్టర్ కిషోర్, జిల్లా పరిషత్ సీఈవో వసంతలు అన్నారు. ఆదివారం చెన్నారావుపేట, అక్కల్ చెడ, ఖాదర్ పేట గ్రామాలలో గ్రామపంచాయతీ కార్యాలయాల్లో జరుగుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ఆన్ లైన్ డాటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. గ్రామాలలో రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాను చేసుకోవాలని కోరారు. ఇందిరమ్మ జీవిత బీమా ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తుందని తెలిపారు. 18 నుండి 59 ఏళ్ల లోపు కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు, సాధారణ మరణం చెందిన ప్రభుత్వం రూ. 5 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ ను బాధిత కుటుంబానికి అందజేస్తుందన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను ఆన్ లైన్ లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు. ఆన్. లైన్ పోర్టల్ లో ఎలాంటి సమస్యలు తలెత్తిన అధికారుల దృష్టికి తీసుకురావాలని వెంటనే సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట మండల స్పెషల్ ఆఫీసర్ బాలాజీ, తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ, ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల పంచాయతీ అధికారి తండ జగదీష్, గిర్దావర్ మహమ్మద్ రషీద్, గ్రామ సర్పంచులు కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి, భూక్య బుజ్జి సురేష్, గూడ సంధ్య మహేందర్, పంచాయతీ కార్యదర్శులు సుప్రజ, వీరన్న, భరత్, జిపిఓలు విజయలక్ష్మి, నరసింహ స్వామి, రాజేందర్, ఉప సర్పంచులు దొంతి శ్రీనివాస్, కక్కర్ల రజిత శ్రీను, చాపల మధుకర్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు పులిశేరు రాజేందర్, మహమ్మద్ ఖయాజ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బూడిద లారీ బీభత్సం..

- బైక్‌ను ఢీకొట్టి వేపచెట్టుకు ఢీ..
- మృత్యువు అంచుల నుంచి బయటపడిన బైకర్..
- క్యాబిన్‌లో ఇరుక్కుని డ్రైవర్ ఆర్తనాదాలు..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): భూపాలపల్లి మండలం మొరంచపల్లి గ్రామ శివారులోని 353 జాతీయ రహదారిపై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చెల్పూర్ వైపు నుంచి అతివేగంగా వస్తున్న బూడిద లారీ.. గాంధీనగర్ నుంచి చెల్పూర్ వైపు బైక్‌పై వెళ్తున్న దిలీప్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న దిలీప్ స్వల్ప గాయాలతో బయటపడగా, బైక్ పూర్తిగా ధ్వంసమైంది. బైక్‌ను ఢీకొన్న అనంతరం అదుపుతప్పిన లారీ రహదారి పక్కనే ఉన్న వేపచెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ క్యాబిన్ తీవ్రంగా దెబ్బతినడంతో డ్రైవర్ అందులోనే ఇరుక్కుపోయాడు. బయటకు రాలేక కాసేపు ఆర్తనాదాలు చేయడంతో స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా శ్రమించి డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి సురక్షితంగా బయటకు తీసి చికిత్స నిమిత్తం భూపాలపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అంతేకాకుండా గ్రామంలో విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం కలిగినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరానికి విశేష స్పందన



రామకృష్ణాపూర్, నవంబర్ 22 (జనంసాక్షి): సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 115 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకుని, నిపుణులైన వైద్యుల నుంచి సలహాలు, చికిత్స పొందారు. ఈ సందర్భంగా గుండె సంబంధిత వ్యాధులు, నరాల సంబంధిత సమస్యలు, జీర్ణకోశ వ్యాధులకు సంబంధించి ప్రత్యేక వైద్య సేవలు అందించారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, రోగులకు తగిన చికిత్సతో పాటు ఆరోగ్య సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (అడ్మిన్) ఎం. మధుకుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎం. మదర్ సాహెబ్, మాట్రన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొమరం భీమ్ విగ్రహం ఆవిష్కరణ



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 22(జనంసాక్షి) : వాంకిడి మండలంలోని పాత దుబ్బగూడ గ్రామంలో ఆదివాసీ పోరాట యోధుడు, జల్-జంగల్-జమీన్ కోసం పోరాడిన మహనీయుడు కొమరం భీమ్ విగ్రహాన్ని ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొమరం భీమ్ ఆదివాసీల హక్కుల కోసం, అటవీ సంపద పరిరక్షణ కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కొమరం భీమ్ చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి, గిరిజన సంక్షేమానికి కట్టుబడి దుబ్బగూడ గ్రామ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆగ్రిగోల్డ్ బాధితులు అవసరమైన పత్రాలతో హాజరు కావాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ



బెల్లంపల్లి, నవంబర్ 22, (జనంసాక్షి) : అగ్రి గోల్డ్ బాధితులు అవసరమైన పత్రాలతో హాజరు కావాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ కోరారు. ఈ నెల 25 నుంచి ఆగ్రిగోల్డ్ బాండ్ల ధృవీకరణ ప్రక్రియ ప్రారంభమ వుతుందని ఆయన వివరించారు. బాధితులు, డిపాజిటర్లు, నామినీలు, చట్టబద్ధ వారసులు, ఏజెంట్లు నిర్ణీత కేంద్రాల్లో అవసరమైన పత్రాలతో హాజరు కావాలన్నారు. ఆగ్రిగోల్డ్ సంస్థలో డిపాజిట్లు చేసి నష్టపోయిన బాధితులకు వెసులుబాటు కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సీఐడీ ఆధ్వర్యంలో కీలక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రిగోల్డ్ డిపాజిటర్లు, బాధితులు, ఏజెంట్ల వద్ద ఉన్న అసలు ఆగ్రిగోల్డ్ బాండ్లు, నగదు రసీదుల ధృవీకరణ, నమోదు ప్రక్రియ కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఈనెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రత్యేక కేంద్రాల్లో ఆగ్రిగోల్డ్ బాండ్ల ధృవీకరణ ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల ప్రాంత బాధితుల కోసం నస్పూర్ పోలీస్ స్టేషన్, మంచిర్యాల జిల్లాలో ధృవీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం పరిధిలో మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన బాధితులు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు.

బాధితులు ధృవీకరణకు డిపాజిటర్ జీవించి ఉన్న సందర్భంలోని అసలు ఆగ్రిగోల్డ్ బాండ్ / నగదు రసీదు, బాండ్‌పై సంతకం చేసిన కలర్ జిరాక్స్ ప్రతిని, ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ ప్రతులు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ ప్రతి, తాజా పాస్‌పోర్ట్ సైజు ఫొటో, డిపాజిటర్ మొబైల్ నంబర్, బ్యాంకు ఖాతాకు లింక్ అయిన మొబైల్ నంబర్, ఏజెంట్ పేరు, మొబైల్ నంబర్ (తెలిస్తే) తీసుకురావాలని సూచించారు. నామినీ లేదా చట్టబద్ధ వారసులు మరణ ధృవీకరణ పత్రం, ఆధార్, పాన్, బ్యాంకు ఖాతా వివరాలు, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రాలతో పాటు అవసరమైన ఇతర పత్రాలను సమర్పించాలని, అసలు బాండ్‌ను కేవలం ధృవీకరణ కోసం మాత్రమే చూపించాలని, అసలు బాండ్‌ను అధికారులకు అప్పగించాల్సిన అవసరం లేదని, బాండ్‌కు సంబంధించిన కలర్ జిరాక్స్ ప్రతిపై సంబంధిత డిపాజిటర్ / నామినీ / చట్టబద్ధ వారసుడు సంతకం చేసి సమర్పించాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఖాతాదారుని పేరు, ఖాతా సంఖ్య, ఐఎఫ్ఎస్సి కోడ్ స్పష్టంగా కనిపించేలా చూడాలని, డిపాజిటర్ లేదా కుటుంబ సభ్యుల మొబైల్ నంబర్ తప్పనిసరిగా అందించాలని, సమర్పించిన పత్రాలకు రసీదు అందజేయబడుతుందని, బాండ్ల ధృవీకరణకు సంబంధించి మండలాల వారీగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మాత్రమే సంబంధిత కేంద్రాలకు హాజరుకావాలని సూచించారు. నిర్ణీత తేదీన, నిర్ణీత సంఖ్యకు అనుగుణంగా సంబంధిత మండలాల బాధితులు నస్పూర్ పోలీస్ స్టేషన్, మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధృవీకరణ కేంద్రానికి హాజరై తమ వివరాలను నమోదు చేసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ కోరారు.

ఘనంగా 7వ నేషనల్ లెవల్ కరాటే, కుంగ్ ఫూ ఛాంపియన్ షిప్

- పోటీలను ప్రారంభించిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 22(జనంసాక్షి): కుంగ్-ఫూ డూ అండ్ సన్నీ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ, ఆసిఫాబాద్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ లోని వాసవి ఫంక్షన్ హాల్, గుండి రోడ్ లో 7వ నేషనల్ లెవల్ ఓపెన్ టు ఆల్ స్టైల్ కరాటే - కుంగ్ ఫూ ఛాంపియన్ షిప్ - 2026 ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కరాటే, కుంగ్ ఫూ వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణ, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని అన్నారు. ఆడపిల్లలు తప్పనిసరిగా సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఇలాంటి జాతీయ స్థాయి పోటీలను ఆసిఫాబాద్ లో నిర్వహించడం గర్వకారణమని, నిర్వాహకులను అభినందించారు. ఈ ఛాంపియన్ షిప్ లో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన వందలాది మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్ , వైస్ చైర్మన్ అహమద్ , గ్రాండ్ మాస్టర్ ఫౌండర్ డి. కాంతేశ్వర్, ప్రెసిడెంట్ పి. మోహన్, జనరల్ సెక్రటరీ ఆర్. శ్రీనివాస్, చైర్మన్ బి. బూమయ్య, టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ ఒరగంటి శ్రవణ్, కుదుకుడే సంతోష్, ఎం. హరికృష్ణ వివిధ రాష్ట్రాల చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో వృద్ధురాలి మృతి



చెన్నారావుపేట, నవంబర్ 22 (జనం సాక్షి): విద్యుత్ షాక్ తో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని లింగగిరి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.... ఇదే గ్రామానికి చెందిన రాకం వజ్రమ్మ(70) ఆదివారం ఉదయం తన కుమారుడు కేశవులు దుస్తులను ఉతికి ఇంటి ఆవరణలో ఉన్న దండెం తీగ పై ఆరేస్తుండగా దండెం తీగకు ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రసారం కావడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. తన భార్య విద్యుత్ షాక్ కు గురవుతున్న విషయాన్ని గమనించి పక్కనే ఉన్న ఆయన ఆమెను కాపాడేందుకు భర్త నరసయ్య ఆమెను ముట్టుకోగా అతనికి కూడా విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే పక్కన ఉన్న మహిళ గమనించి దండెం తీగను కర్ర సహాయంతో కొట్టడంతో దండెం తీగ తెగిపోయింది. దీంతో తీగకు విద్యుత్ ప్రసారం నిలిచిపోవడంతో నరసయ్య ప్రాణాలతో బయటపడినట్లు తెలిపారు. మృతురాలికి భర్త నరసయ్య, కుమారుడు కేశవులు, కూతురు ఉన్నారు. వజ్రమ్మ మృతదేహం పై భర్త, కుమారుడు, కూతురు, రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావును కలిసిన జిల్లా కలెక్టర్



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 22 (జనం సాక్షి) :రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీజీవీన్పీడీసీఎల్ గెస్ట్ హౌజ్ వద్ద ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ను జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23 నవంబర్ 2026

అడవి రక్షణ కోసం ప్రాణాలర్పించిన శ్రీనివాసరావుకు నివాళి



చంద్రుగొండ, నవంబర్ 22 (జనంసాక్షి) : అడవుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అటవీ క్షేత్రాధికారి శ్రీ చి. శ్రీనివాసరావు త్యాగాన్ని స్మరించుకుంటూ చంద్రుగొండ అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. ఆయన నాలుగో వర్ధంతి సందర్భంగా చంద్రుగొండలోని స్మృతివనం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.నాలుగేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో అటవీ శాఖ నాటిన మొక్కలను రక్షించే క్రమంలో శ్రీనివాసరావుపై జరిగిన ప్రాణాంతక దాడిలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. అడవుల పరిరక్షణే లక్ష్యంగా విధి నిర్వహణలో చూపిన ధైర్యం, అంకితభావం నేటి అటవీ సిబ్బందికి స్ఫూర్తిగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా చంద్రుగొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కే. తేజస్వి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు కే. లక్ష్మీపతి, ఎస్.కే. నాసర్ బీ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె. శివకుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆర్.జి. నరసింహారావుతో పాటు అటవీ శాఖ సిబ్బంది పాల్గొని శ్రీనివాసరావుకు నివాళులర్పించారు.ఆయన త్యాగం వృథా కాకుండా అడవులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షిస్తూ, అటవీ సంపదకు ముప్పు ఏర్పడినప్పుడు అప్రమత్తంగా స్పందిస్తూ, అటవీ గ్రామాల ప్రజల సహకారంతో అడవులను భావితరాలకు అందించడమే శ్రీనివాసరావుకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.

సంక్షేమ పథకాల్లో రాజకీయ వివక్ష వీడాలి

- ఇందిరమ్మ కుటుంబ బీమాను అందరికీ వర్తింపజేయాలి
- వివక్ష వీడకపోతే మళ్ళీ ఉద్యమిస్తాం
- సిపిఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్

ఖమ్మం, నవంబర్ 22 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో రాజకీయ వివక్షను వీడి అర్హులైన అందరికీ పథకాలను అందించాలని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ఎంతో గొప్పగా ప్రారంభించారని, అయితే మొదట కుటుంబంలోని అందరికీ బీమా వర్తిస్తుందని చెప్పి, ఇప్పుడు కేవలం కుటుంబంలో సంపాదించే ఒక్కరికి మాత్రమే పరిమితం చేయడం,అది కూడా 59 ఏళ్ల వయసు లోపు వారికే పరిమితం చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి మొన్నటి ఆగస్టు వరకు సెంటు, గుంట భూమి ఉన్న ప్రతి రైతుకు రూ.5 లక్షల బీమా పరిహారం అందేదని, కుటుంబంలో ఎంతమందికి భూమి ఉంటే అంతమందికి వర్తించేదని గుర్తు చేశారు. అలాగే లేబర్ కార్డు ఉన్నవారికి రూ.2 లక్షలు, ఇతర పథకాల కింద రూ.10 లక్షల పరిహారం అందేదని, వాటన్నింటినీ



రద్దు చేసి ఇప్పుడు ఒకే పథకం పెట్టి ఒక్కరికే పరిమితం చేయడం అన్యాయమన్నారు. కుటుంబ బీమా అంటే కుటుంబంలోని ప్రతి వ్యక్తికీ వర్తించాలని, బీమా పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి

పంట నష్టపోయిన రైతుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, నిర్దిష్టంగా సర్వే చేసి నష్టపోయిన రైతులు ఎంతమంది అనే నివేదికను కూడా ఇప్పటివరకు తేల్చలేదని నున్నా మండిపడ్డారు. రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, పరిహారం గురించి అసలు మాట్లాడటం లేదని, తక్షణమే నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే సంక్షేమ పథకాలా..?

ఖమ్మం జిల్లాలో సంక్షేమ పథకాలన్నీ కేవలం కాంగ్రెస్ పార్టీలో ఉన్నవారికి, కాంగ్రెస్ కండువా కప్పుకున్న వారికే ఇస్తామనే విధంగా పూర్తి రాజకీయ వివక్షతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు సహా ఏ పథకమైనా ఇదే తీరు కొనసాగుతోందని, దీనిపై ఇప్పటికే సీపీఎం, వామపక్షాలు, బీఆర్ఎస్ తదితర పార్టీలన్నీ కలిసి కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశాయని తెలిపారు. అప్పుడు కలెక్టర్ హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ కుటుంబ బీమా దరఖాస్తు ఫారాలను కూడా అధికారులు కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే పట్టుకుని తిరుగుతున్నారని పేర్కొన్నారు .

మళ్ళీ ఆందోళన చేస్తాం

ఇందిరమ్మ కమిటీలకు సర్పంచ్ అధ్యక్షతన ఉంటుందని చెప్పినప్పటికీ, ప్రతిపక్షాలు గెలిచిన గ్రామాల్లో ఎన్నికైన సర్పంచ్‌లను ఏమాత్రం పట్టించుకోకుండా, వారి అధికారాలను గౌరవించకుండా కాంగ్రెస్ కార్యకర్తలే పెత్తనం చెలాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలోనూ ప్రభుత్వం ఇదే వైఖరిని కొనసాగిస్తే, సంక్షేమ పథకాల్లో రాజకీయ వివక్ష లేకుండా అర్హులందరికీ ఇవ్వాలనే డిమాండ్‌తో మళ్లీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు.

బీమా అమలు తేదీని ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుంది

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 22 (జనం సాక్షి) : అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రయోజనాలను అందించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం నమోదు ప్రక్రియ కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అర్హులైన వారి నుండి కేవలం దరఖాస్తుల, నమోదు ప్రక్రియ మాత్రమే జరుగుతోందని కలెక్టర్ అన్నారు. నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత, దరఖాస్తుదారులు సమర్పించిన వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారని, పరిశీలన అనంతరం అర్హత సాధించిన లబ్ధిదారులకు ఆ విషయాన్ని అధికారికంగా తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద బీమా కవరేజీ ఎప్పటి నుండి అమల్లోకి వస్తుంది, లబ్ధిదారులు ఎప్పటి నుండి క్లెయిమ్‌లు చేసుకోవచ్చు అనే తేదీలను రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తుందని, ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా, ప్రస్తుత నమోదు ప్రక్రియలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

పుట్టిన ఊరికి సేవ చేయడం పూర్వజన్మ సుకృతం

- దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు



చిలుకూరు, నవంబర్ 22 (జనంసాక్షి) : పుట్టిన ఊరికి సేవ చేయడం పూర్వజన్మ సుకృతమని, ఏ స్థాయిలో ఉన్నా కన్నవారిని, స్వగ్రామాన్ని మరచిపోకూడదని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ మంత్రిప్రగడ హనుమంతరావు అన్నారు. శనివారం చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తన కుటుంబ సభ్యుల సహకారంతో బాలికలకు రూ. లక్ష విలువైన సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. అంతకుముందు బేతవోలు గ్రామంలో కమిషనర్ మంత్రిప్రగడ హనుమంతరావు నూతన గృహంలో నిర్వహించిన అంబికా పంచాయతన పూర్వక శ్రీ విద్యా మహా యాగ మహోత్సవంలో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి పాల్గొన్నారు.

'వెన్నెల కుప్పలు' ఆవిష్కరణ

పాఠశాల వేదికపై కవి, రచయిత బెల్లంకొండ శ్రీరాములు రచించిన 25వ పుస్తకం 'వెన్నెల కుప్పలు' కవితా సంపుటిని కమిషనర్ హనుమంతరావు, సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఆవిష్కరించారు. రైతు కుటుంబంలో పుట్టి సాహిత్యంపై మక్కువతో 25 పుస్తకాలు రచించడం అభినందనీయమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వట్టికూటి నాగయ్య, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా గంట రేణుకకు ఘన సత్కారం

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 22 (జనం సాక్షి) : ప్రతిభకు పేదరికం, ప్రాంతం, వనరులు అడ్డుకావని నల్లగొండ జిల్లాకు చెందిన ప్రభుత్వ ఐటీఐ పూర్వ విద్యార్థిని గంట రేణుక నిరూపించింది. జాతీయ స్థాయి నైపుణ్య పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నేషనల్ టాపర్‌గా నిలిచిన ఆమెకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఘన సత్కారం లభించింది. ఈ అరుదైన గౌరవంతో నల్లగొండ జిల్లా కీర్తిని జాతీయ స్థాయికి తీసుకెళ్లింది.ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో శనివారం నిర్వహించిన 5వ కౌశల్ దీక్షాంత్ సమారోహ్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొని ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లాకు చెందిన గంట రేణుక ప్రధానమంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ (ణ+ు) నిర్వహించిన 2026 ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌లో రేణుక అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్ (ఇంజినీరింగ్ డిజైన్ టెక్నాలజీ) విభాగంలో దేశవ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలిచి నేషనల్ టాపర్‌గా గుర్తింపు పొందారు.ప్రభుత్వ ఐటీఐలో శిక్షణ పొందిన రేణుక జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటుకోవడం విశేషం. సాంకేతిక విద్యలో పట్టుదల,



కృషి, నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆమె విజయం చాటిచెబుతోంది. ముఖ్యంగా ప్రభుత్వ ఐటీఐలో చదువుకున్న విద్యార్థిని దేశవ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రధానమంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం జిల్లాలోని విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.నల్లగొండ జిల్లా నుంచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గంట రేణుక విజయంపై జిల్లావాసులు, విద్యావేత్తలు, ఐటీఐ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆమె సాధించిన ఈ ఘనత నల్లగొండ జిల్లాకే గర్వకారణంగా నిలిచింది. భవిష్యత్తులోనూ మరిన్ని ఉన్నత విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.జాతీయ వేదికపై నల్లగొండ ఆడబిడ్డకు దక్కిన ఈ గౌరవం.. జిల్లాలోని యువతకు నైపుణ్య విద్య పట్ల కొత్త స్ఫూర్తిని నింపుతోంది.

ప్రతి పోలీస్ స్టేషన్లో ర్యాంపు ఏర్పాటు చేయాలి

బంట్వారం నవంబర్ 22 (జనం సాక్షి) : బంట్వారం ఎస్ఐ పుండ్లిక్కు వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు సంఘం నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ స్టేషన్లో దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంపు ఏర్పాటు చేయాలని, 2016 దివ్యాంగుల హక్కుల చట్టంలోని సెక్షన్లు 92(ఏ), 92(బి) అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాచయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.



టోల్ ప్లాజా నిర్వాహకుల నిర్లక్ష్యంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

- అత్యవసర వాహనానికి ప్రత్యేక మార్గం లేక ప్రయాణికుల ఇబ్బందులు
- సైరన్ మోగిస్తున్నా లైన్ క్లియర్ చేయని సిబ్బంది తీరుపై సర్వత్రా ఆగ్రహం



మాడుగులపల్లి, నవంబర్ 22 (జనం సాక్షి) : నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలోని టోల్ ప్లాజా నిర్వాహకుల నిర్లక్ష్యం మరోసారి బట్టబయలైంది రోడ్డు వెడల్పు లేకపోవడం, అత్యవసర వాహనాలు వెళ్లేందుకు ప్రత్యేక మార్గం (సపరేట్ రూట్) ఏర్పాటు చేయకపోవడంతో ఆదివారం టోల్ గేట్ వద్ద భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది ఈ క్రమంలో ఒక అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుని ముందుకు కదలలేని దుస్థితి నెలకొంది ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగిని తరలిస్తున్న అంబులెన్స్, టోల్ ప్లాజా సమీపంలో వాహనాల రద్దీలో నిలిచిపోయింది చాలాసేపు అంబులెన్స్ సైరన్ మోగిస్తూనే ఉన్నా, టోల్ గేట్ నిర్వాహకులు, సిబ్బంది ఏమాత్రం స్పందించకుండా, లైన్ క్లియర్ చేయడానికి సహకరించకపోవడం అత్యంత దౌర్భాగ్యకరమైన పరిస్థితికి అద్దం పడుతోంది నిర్వాహకుల తీరుతో విసిగిపోయిన అంబులెన్స్ సిబ్బంది, నిస్సహాయ స్థితిలో సైరన్ వేసుకుంటూ చాలాసేపు టోల్ గేట్ వద్దే వేచి ఉండాల్సి వచ్చింది. సాధారణ రోజుల్లోనే కొద్దిపాటి వాహనాలు ఆగితే ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లడానికి నరకాయాతన పడాల్సి వస్తోందని వాహనదారులు ఇప్పటికే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పుడు ఏకంగా అత్యవసరమైన అంబులెన్స్‌కే దారి లేకుండా పోవడంపై స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి టోల్ ప్లాజా నిర్వహణపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు రోడ్డును వెడల్పు చేయడంతో పాటు, అంబులెన్స్‌లు అత్యవసర వాహనాలు ఆగకుండా వెళ్లేందుకు ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆడపిల్లలకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరం

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 22 (జనం సాక్షి) : ఖమ్మం షాదీఖానా నందు బీఆర్ఎస్ మాజీ జిల్లా మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ తాజుద్దీన్ బాబా మెమోరియల్ జ్ఞాపకార్థం మాజీ జిల్లా గ్రంధాలయం చైర్మన్ ఖమర్ అధ్యక్షతన నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్ ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి సమాజంలో ఎదుగుతున్న చిన్నారులకు, ముఖ్యంగా ఆడపిల్లలకు ఆత్మరక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) కోసం మార్షల్ ఆర్ట్స్, కరాటే వంటి క్రీడలు ఎంతో అవసరమని రాష్ట్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల పిల్లల్లో శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. ఏదైనా ఆపద ఎదురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవడానికి ఈ విద్య ఉపయోగపడుతుందని, దీనిని కేవలం ఇతరులపై దాడి చేయడానికి కాకుండా ఆత్మరక్షణ కోసం మాత్రమే వినియోగించాలని సూచించారు. నేటి ఆధునిక కాలంలో పిల్లలు టీవీలు, సెల్ ఫోన్లకు అతుక్కుపోయి శారీరక శ్రమకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చదువుతో పాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ వంటి వాటిపై ఆసక్తి పెంచుకోవడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా, చురుకుగా ఎదుగుతారని తెలిపారు. గత పదేళ్లుగా తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పటి నుండి ఈ క్రీడా కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం అందిస్తున్నానని గుర్తు చేసుకున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను, ప్రత్యేకించి ఆడపిల్లలను మార్షల్ ఆర్ట్స్ వైపు ప్రోత్సహించాలని కోరారు.ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులు గఫూర్,కరాటే మాస్టర్లకు మరియు పాల్గొన్న క్రీడాకారులందరికీ పువ్వాడ అజయ్ కుమార్ గారు ప్రత్యేక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.



కార్యక్రమంలో నాయకులు కూరాకుల నాగభూషణం, ఆర్జేసీ కృష్ణ,కర్నాటి కృష్ణ, పగడాల నాగరాజు, బచ్చు విజయ్ కుమార్, నాగండ్ల కోటేశ్వరరావు,బత్తుల మురళి,దేవభక్తిని కిషోర్, తౌసిఫ్,గాదె అనిల్, సురేష్, వీరేందర్,షకీనా,ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ బజార్‌లో పోలీసుల మెరుపు తనిఖీలు

- 128 ఇళ్లలో సోదాలు
- 61 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోల్లో సరైన పత్రాలు లేవు
- నంబర్ ప్లేట్లు లేని 15 వాహనాలు స్వాధీనం

భద్రాచలం, నవంబర్ 22 (జనంసాక్షి) : నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, ప్రజలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా భద్రాచలం పోలీసులు ముదిరాజ్ బజార్‌లో ఆదివారం తెల్లవారుజామున విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో 128 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన వాహన పత్రాలు లేని 61 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలను గుర్తించగా, నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 15 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, బీమా పత్రాలు కలిగి ఉండాలని, నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు.



మత్తు పదార్థాలపై ఉక్కుపాదం..

తనిఖీల అనంతరం ప్రజలకు అవగాహన కల్పించిన డీఎస్పీ అరుణ్ కుమార్ గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగం, విక్రయం, రవాణాకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నకిలీ ఫోన్ కాల్స్, మోసపూరిత లింకులు, పెట్టుబడుల పేరుతో జరిగే మోసాలు, ఆన్‌లైన్ ఉద్యోగాల ఎర వంటి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్‌లను ఎవరికీ వెల్లడించవద్దని, డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరించే మోసగాళ్లకు భయపడి డబ్బులు బదిలీ చేయవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

రహదారి ప్రమాదాల నివారణకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సీఐలు, ఎస్ఐలు, తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు, కేంద్ర రిజర్వు పోలీసు బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

సూర్యాపేట, నవంబర్ 22 (జనంసాక్షి) : ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని పాత వ్యవసాయ మార్కెట్ సమీపంలో గల సుప్రజ హాస్పిటల్ నూతన భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1971లో డాక్టర్ ఏపీ విఠల్ ప్రజా వైద్యశాలను ప్రారంభించి ఎంతో మందికి వైద్య సేవలు అందించారని గుర్తు చేశారు.నాటి నుండి అదే వైద్య సేవల వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆధునిక వైద్య సదుపాయాలతో నూతన భవనంలో సుప్రజ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ ఏ.రామయ్య, డాక్టర్ రమేష్ చంద్ర, డాక్టర్ సుప్రజ, పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23.11.2026



గోదావరి మహా హారతి కరపత్రాల ఆవిష్కరణ

మంథని, నవంబర్ 22 (జనంసాక్షి) :
ఈ నెల 27వ తేదీ శుక్రవారం గౌతమేశ్వర దేవాలయ గోదావరి తీరాన నిర్వహించే మహా హారతి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను లక్ష్మీనారాయణ స్వామివారి దేవాలయం చెంత ఆవిష్కరించారు.శుక్రవారం సాయంత్రం గోదావరి తీరంలో నిర్వహించే గోదావరి మహా హారతి కార్యక్రమ కరపత్రాన్ని గోదావరి హారతి ఉత్సవ సమితి సభ్యులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి క్యాతం వెంకటరమణ మాట్లాడుతూ.. సకల చరాచర జీవరాశికి జలమే జీవనాధారమని, పంచభూతములలో ప్రముఖమైనదని పేర్కొన్నారు. అపారమైన జల సంపదను మోసుకెళ్తున్న జీవనది అయిన గోదావరి నదీ మాతను పూజించడంతోపాటు రక్షించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని, నదీ తీరం కలుషితం కాకుండా కాపాడుకోవడానికి అందరం కంకణబద్ధులమై ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బోయిని నారాయణ, గర్రెపల్లి వెంకటేశ్వర్లు, కొత్త శ్రీనివాస్ గుప్తా, రావుల సతీష్, మేడగొని రాజమౌళి గౌడ్, కొమరవెల్లి హరీష్ గుప్తా, రేపాక శంకర్, నూక శ్రీనివాస్, నామిని నగేష్, గాజుల సురేష్, సుదర్శన్, జంగం రాజు, బండారి సునీత, మైథిలి, అనురాధ, రేపాల భాగ్యమ్మ, కొంజర్ల రాధా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు-కారు ఢీ..

పలువురికి గాయాలు...



సిరిసిల్ల టౌన్ నవంబర్ 22 (జనంసాక్షి):రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు చంద్రంపేట చౌరస్తా వద్ద ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కోనరావుపేట వెళ్లే రహదారిపై సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (టి.ఎస్ 02 జెడ్ 0202) కారు బలంగా ఢీకొన్నాయి. ఉదయం వేళ పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగ్గా కనిపించకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. కారు వేగంగా వచ్చి బలంగా ఢీకొనడంతో ఆర్టీసీ బస్సు ముందు టైరు పూర్తిగా ధ్వంసమైంది. కారు ముందు భాగం సైతం నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి తీవ్ర రక్తస్రావంతో కారులోంచి బయటకు పడి అపస్మారక స్థితికి చేరుకోగా, డ్రైవర్ సీట్లోనే ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న వెంటనే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నుజ్జునుజ్జయిన కారులో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను 108 సిబ్బంది స్థానికుల సాయంతో గడ్డపారతో కారు భాగాలను తొలగించి అతికష్టం మీద బయటకు తీశారు. తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా ఉన్న ఇద్దరు క్షతగాత్రులను తక్షణమే 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాటిపల్లి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు ఉండగా, అందరూ స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఒక్కసారిగా భారీ శబ్దంతో ప్రమాదం జరగడంతో బస్సులోని మహిళా ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు



సుల్తానాబాద్,నవంబర్ 22(జనంసాక్షి) :
అయ్యప్ప దయవల్ల పార్లమెంటు పరిధిలోని ప్రజలందరూ సుభిక్షంగా శిఖ సంతోషాలతో ఉండాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అయ్యప్పను కోరారు. ఆదివారం పట్టణంలోని నీరుకుల్ల రోడ్డులో గల ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణకు అయ్యప్ప స్వాములు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అయ్యప్ప స్వాములు ఎంపీ వంశీకృష్ణని శాలువాలతో ఘనంగా సత్కరించారు.స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని, స్వామివారి కృపాక టాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తొ ర్రికొండ ప్రభాకర్,కాంగ్రెస్ నేత,గరిగే శ్రీనివాస్,శ్యామ్,ఆరేపల్లి రాహుల్,ఆరేపల్లి రత్నంతోపాటు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ప్రభుత్వ విప్ విజయ రమణారావు



సుల్తానాబాద్,నవంబర్ 22(జనంసాక్షి) :
ఏ ప్రభుత్వం నెరవేర్చని పేదవాని సొంతింటి కల కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సాధ్యం అయ్యిందని ప్రభుత్వ విప్ విజయ రమణారావు అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో నూతనంగా నిర్మాణం చేసిన ఇందిరమ్మ ఇంటిని వార్డు కౌన్సిలర్ అమీర్ శెట్టి శ్రావణి రాకేష్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ పాలనలో పేదవానికి ఒక్క ఇంటిని కూడా ఇచ్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇస్తానని మోసం చేశారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇంటికి ఐదు లక్షల ఆర్థిక సహాయం చేస్తూ పేదవాని గుండెల్లో చోటు సంపాదించుకున్నారని తెలిపారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణం చేసుకున్న పేదలందరికీ ఐదు లక్షల ఆర్థిక సహాయం అందించామని,రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు అవుతుందని, ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నట్లు విజయరమణారావు స్పష్టం చేశారు.బిఆర్ఎస్ పార్టీ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాల దోచుకున్నాడని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం పేరుతో రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసి సొంత ఆస్తులను కూడగట్టుకున్నారని తెలిపారు.అంతేకాకుండా రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల ఊబిలో నెట్టారని తెలిపారు. పేదల పక్షాన నిలిచేది కేవలం ఒక్క కాంగ్రెస్ పార్టీ అని విజయ రమణారావు స్పష్టం చేశారు. రానున్న రెండు సంవత్సరాల కాలంలో పేద ప్రజలకు ఇంకా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తామని, మిగిలిన హామీలన్నీ నెరవేర్చుతామని తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ను పలువురు శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మాజీ మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బయ్య గౌడ్, 12వ వార్డు కౌన్సిలర్ అమీరిశెట్టి శ్రావణి రాకేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాజీ వార్డు సభ్యులు అమీర్ శెట్టి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

సహజ ప్రసవమే తల్లీబిడ్డకు ఆరోగ్యకరం

- సోమా ఆధ్వర్యంలో వాక్ ఫర్ నేచురల్ బర్తింగ్ అవగాహన ర్యాలీ
- జెండా ఊపి ప్రారంభించిన డిఎంహెచ్ఓ డా. రాజగోపాల్ రావు



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి) :
సహజ ప్రసవాలను ప్రోత్సహించడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని,వైద్యపరంగా అవసరం లేని సిజేరియన్ శస్త్రచికిత్సలను నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజగోపాల్ రావు అన్నా రు. సహజ ప్రసవాలపై గర్భిణులు, ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా మిడ్‌వైవ్స్ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని కోతిరాంపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో సొసైటీ ఆఫ్ మిడ్‌వైవ్స్ ఇండియా (సోమా) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన 'వాక్ ఫర్ నేచురల్ బర్తింగ్' సహజ ప్రసవ అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్ రాజగో పాల్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ... సహజ ప్రసవం ప్రకృతి సహజంగా ప్రసాదించిన శారీరక ప్రక్రియ అని, వైద్యప రంగా సురక్షితమైన సందర్భాల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడం వల్ల తల్లి త్వరగా కోలుకోవడంతో పాటు తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుందని తెలిపారు. తల్లిపాలను త్వరగా ప్రారంభించేందుకు సహజ ప్రసవం దోహదపడుతుందన్నారు. అయితే వైద్యపరంగా సిజేరియన్ అవసరమైన సందర్భాల్లో ఆ విధానాన్ని అనుసరించడం తప్పనిసరని, అవసరం లేనప్పుడు అనవసరమైన శస్త్రచికిత్సలను నివారించాలని సూచించారు. ప్రసవ సమయంలో తల్లులకు ధైర్యం, ఆత్మవిశ్వాసం కల్పిస్తూ నిరంతర సహకారం అందించడంలో మిడ్‌వైవ్స్ పాత్ర ఎంతో కీలకమని వివరించారు.ప్రభుత్వ నర్సింగ్ కళాశాల కోతిరాంపూర్ నుంచి ప్రారంభమైన సహజ ప్రసవ అవగాహన నడక కలెక్టరేట్ వరకు కొనసాగింది. అక్కడి నుంచి తిరిగి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు, వైద్య సిబ్బంది ప్రజలకు సహజ ప్రసవం ప్రాముఖ్యతను వివరిస్తూ అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. సహజ ప్రసవం వల్ల కలిగే ప్రయోజనాలు, అనవసరమైన వైద్య జోక్యాలను నివారించాల్సిన అవసరం, తల్లి, శిశు ఆరోగ్య సంరక్షణలో మిడ్‌వైవ్స్ సేవల ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, సోమా కోఆర్డినేటర్ లిల్లీ మేరీ మాట్లాడుతూ... గర్భిణులకు సహజ ప్రసవంపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని, నర్సింగ్ విద్యార్థినులు భవిష్యత్తులో వైద్య సేవల్లో భాగంగా తల్లులకు సరైన మార్గదర్శకత్వం, మానసిక ధైర్యం అందించాలని సూచించారు. మిడ్‌వైవ్స్ సేవలను మరింత బలోపేతం చేయడం ద్వారా మాతా శిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని, సహజ ప్రసవాల పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజగోపాల్ రావు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, సోమా కోఆర్డినేటర్ లిల్లీ మేరీ, వైస్ ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరి, సోమా టీమ్ సభ్యురాలు సుజాత, ఎన్ఎస్ఎస్ బృంద సభ్యులు, అధ్యాపక బృందం, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

మహాపాదయాత్రను విజయవంతం చేయండి

బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి) :
'సర్'పై ఇటలీ ప్రతినిధి జియాకోమో ఫిలిబెక్ చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీ దేశ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తుందని కాంగ్రెస్ వ్యవహార శైలి పూర్తిగా దేశానికి వ్యతిరేకంగా ఉందనిబిజెపి జిల్లా అధికార ప్రతి నిధి బొంతల కళ్యాణ్ చంద్ర ఘాటుగా విమర్శించారు. ఎస్ ఐ ఆర్ పై కాంగ్రెస్ ఇండి కూటమి చేస్తున్న అనవసర రాద్ధాంతం ను నిరసిస్తూ, కరీంనగర్ వేదికగాకేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో 'మహా పాదయాత్ర' జరుగు తుందని తెలిపారుబీజేపీ జాతీయ అధ్య క్షులు నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ, నిర్వ హిస్తున్న పాదయాత్రకు ప్రజలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని బొంతల కళ్యాణ్ చంద్ర పిలుపునిచ్చారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

లేకుంటే జిల్లా డీపీఓ కార్యాలయం ముట్టడిస్తాం : సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్



శంకరపట్నం జనంసాక్షి:గ్రామపంచాయతీ కార్మికులకు అక్టోబర్ నెల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం శంకరపట్నం మండల కేంద్రంలో రాచర్ల మల్లేశం అధ్యక్షతన నిర్వహించిన గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, ఆచరణలో రెండు, మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాని కార్మికులకు ఆరు నెలల నుంచి ఏడాది వరకు వేతనాలు అందడం లేదని తెలిపారు. నెలకు రూ.9,500 వేతనం కూడా సకాలంలో చెల్లించకపోతే కార్మికుల కుటుంబాల పోషణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వెంటనే అక్టోబర్ నెల వేతనాలు చెల్లించకుంటే జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే ఏడేళ్లుగా వేతనాలు పెంచకపోవడంతో పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా పంచాయతీ కార్మికులకు కనీస వేతనంగా రూ.30 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశలవారీ ఆందోళనలు చేపట్టి, అవసరమైతే నిరవధిక సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఇమ్మడి చక్రపాణి, యూనియన్ మండల అధ్యక్షుడు ఎలుకపల్లి సారయ్య, కార్యదర్శి కొయ్యడ సమ్మయ్య, జిల్లా కమిటీ సభ్యులు, పలువురు గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



క్రీడల్లో ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు

- సుల్తానాబాద్‌లో బదిరుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్
- ఆత్మవిశ్వాసంతో మైదానంలో సత్తా చాటిన క్రీడాకారులు

సుల్తానాబాద్ (జనంసాక్షి) :
సామాజిక సమానత్వం,స్నేహభావం, క్రీడాస్ఫూర్తిని చాటిచెప్పే లక్ష్యంతో సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో పెద్దపల్లి జిల్లా బదిరుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను ఘనంగా నిర్వహించారు.ఈ స్నేహపూర్వక క్రికెట్ పోటీల్లో పెద్దపల్లి, మంచిర్యాల, వరంగల్ జిల్లాలకు చెందిన బదిరూ ల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు. మూగ చెవిటి, వినికిడి లోపం ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో మైదానంలోకి దిగిన క్రీడాకారులు బ్యాటింగ్,బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి క్రీడాభిమానులను ఆకట్టుకున్నారు.సాధారణ క్రీడాకారులకు ఏమాత్రం తీసిపోని విధంగా బదిర క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.గెలుపోటములను పక్కనపెట్టి స్నేహపూర్వక వాతావరణంలో మ్యాచ్‌లు నిర్వహించడంతో మైదానంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. వైకల్యం ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసం, పట్టుదల, కృషి ఉంటే ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఈ క్రీడా పోటీలు చాటి చెప్పాయి.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బదిరుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం, ఐక్యతాభావం పెంపొందించేందుకు ఇలాంటి స్నేహపూర్వక క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. క్రీడల ద్వారా సామాజిక సమానత్వం,పరస్పర స్నేహభావం మరింత బలపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తూ బదిర క్రీడాకారులను ప్రోత్సహిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా బదిరుల అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.కిరణ్,ప్రధాన కార్యదర్శి ఏ.శ్రీనివాస్,మంచిర్యాల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జి.దేవయ్య,ప్రధాన కార్యదర్శి జె.అరుణ్ కుమార్, వరంగల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు యు.క్రాంతి,ప్రధాన కార్యదర్శి ఎం.భూపాల్ రెడ్డితో పాటు పలువురు క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు..

మండల స్థాయి పోటీలు విజయవంతం

జిల్లా స్థాయి పోటీలకు విజేతల ఎంపిక



సుల్తానాబాద్,నవంబర్ 22(జనంసాక్షి) :
2026,ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్, ఎల్టా పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా మండల స్థాయి ఆంగ్ల పోటీలు మండల విద్యాధికారి ఆరేపల్లిరాజయ్య ప్రారంబించారు.ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ఆంగ్లం నైపుణ్యాలు అభివృద్ధి కోసం "ఎల్టా "చేస్తున్న కృషిని అభినందించారు. సుల్తానాబాద్ మండల స్థాయి పోటీలు స్థానిక జడ్పీహెచ్ఎస్ (బాలికల) పాఠశాలలో 21.11.2026న ఘనంగా శనివారం జరిగాయి.ఈ పోటీలను ఇంగ్లీష్ ఒలింపియాడ్ రాత పరీక్ష,టెడ్ ఎడ్ స్టూడెంట్ టాక్ (ప్రసంగశై)పోటీల విభాగాల్లో నిర్వహించడం జరిగింది. మండలంలోని 8 పాఠశాలల నుండి విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒలింపియాడ్ మరియు టెడ్ ఎడ్ ఎడ్ స్టూడెంట్ టాక్ విభాగాలలో సీనియర్స్, జూనియర్స్ విభాగాల వారీగా విజేతల ఎంపిక జరిగింది.వీరు డిసెంబర్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.
మండల విద్యాధికారి ఎ. రాజయ్య ఆధ్వర్యంలో, ఎల్టా మండల కన్వీనర్ ఎం. విజయరావు మరియు మండల కో-కన్వీనర్ వి.అంజయ్య, కార్యక్రమాన్ని సంయుక్తంగా పర్యవేక్షించి విజేతలను ప్రకటించారు.జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విజేతల వివరాలు : సీనియర్స్ విభాగం :ఒలింపియాడ్: ఎన్. సుగంధ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గర్రెపల్లి ఎడ్ టాక్: ఎం. అక్షర, మోడల్ స్కూల్ గర్రెపల్లి.
జూనియర్స్ విభాగం : ఒలింపియాడ్ లో ఎ. కృత్విక జిల్లా పరిషత్ గర్ల్స్ సుల్తానాబాద్,టెడ్ ఎడ్ స్టూడెంట్ టాక్:బి.వర్షిణి,మోడల్ స్కూల్ గర్రెపల్లి.
గెలుపొందిన విజేతలకు పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దివాకర్ విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన సుల్తానాబాద్ మండల బాధ్యులను, జిల్లాకు ఎంపికైన విద్యార్థులను " ఎల్టా " జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం జగదీశ్వర్,డి.నాగరాజు ప్రత్యేకంగా అభినందించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం..



తంగళ్ళపల్లి జనంసాక్షి:తంగళ్ళపల్లి మండలం, నేరెళ్ల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సరయు హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని సర్పంచ్ పొన్నం లక్ష్మణ్ గౌడ్ ప్రారంభించారు. . డాక్టర్ తడక సాయికుమార్ ఎండి పీడియాట్రిక్స్,పిల్లల వైద్య నిపుణులు. డాక్టర్ తడుక రవళి ఎమ్మెస్ స్త్రీల వైద్య, సంతాన నిపుణులు ఈ వైద్య శిబిరంలో సుమారు 150 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వారు అందించిన మందులను తూచా తప్పకుండా వాడాలని సూచించారు. ఉచిత వైద్య సేవలు అందించిన తడక డాక్టర్ సాయికుమార్, డాక్టర్ తడుక రవళి ని గ్రామపంచాయతీ తరపున శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజమణి , వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించిన కౌన్సిలర్



సుల్తానాబాద్(జనంసాక్షి) : 3వ వార్డులో నూతనంగా నిర్మాణం చేసిన ఇందిరమ్మ ఇంటిని ఆదివారం మూడవ వార్డు కౌన్సిలర్ కందు నూరి సమతా కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారం భించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేసిన మడిశెట్టి కృష్ణకు శు భాకాంక్షలు తెలిపారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కథలాపూర్(జనంసాక్షి):కథలాపూర్ మండలంలోని తండ్రియాల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఫ్యాక్స్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం చైర్మన్ అల్లూరి దేవా రెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులు పండిం చిన పంటలను గలరుల వద్ద అమ్మ వద్దు అమ్మి నష్టపో వద్దని సూచించారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొను గోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సరైన ధర లభిస్తుందని తెలియజేశారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని కోరారు. గంభీర్ పూర్ ఫ్యాక్స్ చైర్మన్ అల్లూరి దేవ రెడ్డి మరియు తండ్రియాల గ్రామ సర్పంచ్ జంగ శివాని రంజిత్, ఉప సర్పంచ్, డైరెక్టర్లు,కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

సామాజిక సేవా కార్యక్రమాలు హర్షణీయం

సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్

శతజయంతి సందర్భంగా,100 మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ
సుల్తానాబాద్,నవంబర్ 22(జనంసాక్షి): : మడిశెట్టి మల్లేశం శత జయంతి సందర్భంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం గర్వించదగ్గ విషయమని గర్రెపల్లి సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్ అన్నారు. ఆదివారం,రోటరీ క్లబ్ ఆఫ్ సైనిక్‌పురి ఆధ్వర్యంలో గర్రెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100 మంది నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు, 6 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు.మల్లేశం కుమారుడు రోటేరియన్ ఎం. శ్రీహరి,కోడలు,క్లబ్ అధ్యక్షురాలు రోటేరియన్ విజయలక్ష్మి మడిశెట్టి దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామ



సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్ మాట్లాడుతూ, గర్రెపల్లిలో ఇలాంటి సేవా కార్యక్రమం జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. రోటరీ జిల్లా 3150 అసిస్టెంట్ గవర్నర్ రోటేరియన్ శారద ప్రక్కి, క్లబ్ కార్యదర్శి శ్రీకాంత్ చీపురుపల్లి, కోశాధికారి కల్నల్ పి.కామేష్,క్లబ్ సభ్యులందరూ,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత,ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ, బీసీల హక్కుల కోసం

పార్లమెంట్‌లో పోరాటం చేస్తా..

బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన 25 నుంచి 30 శాతం నిధులు కేటాయించాలి:పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ..

గోదావరిఖని, జనంసాక్షి :ఎస్సీ, ఎస్టీ వర్గాలు దేశ జనాభాలో దాదాపు 25 నుంచి 30 శాతం వరకు ఉన్నప్పటికీ, బడ్జెట్‌లో వారికి కేటాయిస్తున్న నిధులు కేవలం 2 శాతమేనని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీలకు 25 నుంచి 30 శాతం నిధులు కేటాయించాలని పార్లమెంట్‌లో గట్టిగా డిమాండ్ చేసినట్లు తెలిపారు.70 ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీ సమాజానికి జరిగిన అన్యాయాన్ని ఇకపై సహించేది లేదని, తమ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నిధుల కేటాయింపులో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించ కుండా మౌనంగా ఉండటం సాధ్యం కాదని పేర్కొన్నారు.రాజ్యాంగాన్ని తిరిగి



రాయాలనే కుట్రలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాకా వెంకటస్వామి ఆశయాలను గుర్తు చేసుకుంటూ, వివేక్ వెంకటస్వామి గారు సమాజ అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని కొనసాగిస్తానని తెలిపారు.ప్రజలు తనపై నమ్మకంతో ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎస్సీ, ఎస్టీ సమాజానికి సంబంధించిన ప్రతి సమస్యపై పార్లమెంట్‌లో గళమెత్తుతానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ హామీ ఇచ్చారు.

జనంసాక్షి www.janamsakshi.org
సోమవారం 23 నవంబర్ 2026

నేడు కరీంనగర్‌కు బీజేపీ చీఫ్ నితిన్ నబీన్ రాక

- మహా పాదయాత్రకు అంగరంగ వైభవంగా ఏర్పాట్లు పూర్తి
- నేడు మధ్యాహ్నం 12 గంటలకు కరీంనగర్ గాంధీ విగ్రహం నుండి 'పాదయాత్ర' షురూ..



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి) : భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ నేడు కరీంనగర్‌కు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లు పూర్తయ్యా యి. నేడు మధ్యాహ్నం 12.30 గంటలకు నితిన్ నబీన్ కరీంనగర్ విచ్చేస్తున్నారు. కరీంనగర్ కలెక్టరేట్ వద్ద హెలిప్యాడ్ దిగిన వెంటనే నేరుగా గాంధీ బొమ్మ వద్ద నుండి ప్రారంభమయ్యే మహా పాద యాత్రకు చేరుకోనున్నారు. వైశ్యా భవన్ వద్ద ప్రజా హారును ఉద్దేశించి నితిన్ నబీన్ ప్రసంగించనున్నారు. ప్రసంగం ముగిసిన వెంటనే వైశ్యాభవన్, రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, గడియారం సెంటర్, శాస్త్రి రోడ్, భారత్ టాకీస్ మీదుగా కమాన్ చౌరస్తా వరకు ప్రజలతో కలిసి నితిన్ నబీన్ మహా పాదయాత్ర చేస్తారు. సాయంత్రం 4.30 గంటలకు తిరిగి హెలిప్యాడ్ వద్దకు చేరుకుని హైదరాబాద్ చేరుకుని, అక్కడి నుండి విమానంలో ఢిల్లీకి చేరుకుంటారు. నితిన్ నబీన్ తొలిసారి కరీంనగర్ రానున్న నేపథ్యంలో దాదాపు లక్ష మందితో 'మహా పాదయాత్ర' నిర్వహించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్ని ఏర్పాట్లు చేశారు. గత రెండ్రోజుల నుండి పార్టీ నేతలతో వరుస మీటింగ్ లు పెడుతూ జన సమీకరణ, పాదయాత్ర ఏర్పాట్లు, నగర అలకరణ, ఫ్లెక్సీల ఏర్పాటు వంటి అంశాలపై దిశా నిర్దేశం చేశారు. పాదయాత్ర స్థలికి వెళ్లి ఏర్పాట్లను పర్యవేక్షించడంతో పాటు లక్షకు మించి జనం హాజరయ్యేలా బండి సంజయ్ కుమార్ కసరత్తు పూర్తి చేశారు. కరీంనగర్ ను తోరణాలు, జెండాలతో అందంగా అలంకరించారు. రోడ్డుకు ఇరువైపులా ఫ్లెక్సీలు, కటౌట్లు, హోర్డింగులతో నింపేశారు. మరోవైపు నితిన్ నబీన్ కు వినూత్న రీతిలో స్వాగతం పలికేందుకు బండి సంజయ్ కుమార్ ఏర్పాట్లు చేశారు. తెలంగాణ కళాకారుల ఆట పాటలు, డప్పు న్రుత్యాలతో నితిన్ నబీన్ కు ఘన స్వాగతం పలుకుతారు. మరోవైపు మహా పాదయాత్రలో ప్రముఖ రచయిత ఆకుల నాగేశ్వరరావు ఆధ్వర్యం లోని కళా బ్రుందం ప్రత్యేకంగా ఆట, పాటలతో అలరించేలా ఏర్పాట్లు చేశారు. మహా పాదయాత్రకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు యాత్ర పొడువునా రవాణా, మంచినీటి వసతి సౌకర్యాలను కల్పించారు. దాదాపు లక్షకు పైగా మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. వివిధ సామాజిక సంస్థ, సంఘాల ఆధ్వర్యంలోనూ పాదయాత్ర పొడవునా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పాదయాత్ర చేసే వారికి నీళ్లు, మజ్జిగ, ఇతర తినుబండారాలను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నేడు కరీంనగర్ లో జరగబోయే నితిన్ నబీన్ "మహా పాదయాత్ర" చరిత్ర స్రుష్టించడం ఖాయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియాకు వెల్లడించారు. "సర్" పేరుతో రాజ్యాంగ సంస్థలపై దాడులు చేస్తూ, దేశ ప్రతిష్టకు కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు భంగం కలిగిస్తున్న నేపథ్యంలో "ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం– అరాచకాన్ని అంతం చేద్దాం" పేరిట దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో బీజేపీ జాతీయ నాయకత్వం ఈ మహా పాదయాత్ర ర్యాలీలు నిర్వహిస్తోందన్నారు. వీటిలో కరీంనగర్ మహా పాదయాత్ర హైలైట్ గా నిలవనుందని, దేశవ్యాప్తంగా సంచలనం స్రుష్టించబోతుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల గుండెల్లో వణుకు పుట్టేలా మహా పాదయాత్రను విజయవంతం కాబోతుందని తెలిపారు.



ఖనిలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

వాహనదారుల పత్రాల క్షుణ్ణ పరిశీలన : ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి.రాజేశ్వరరావు

గోదావరిఖని, జనంసాక్షి: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని పట్టణంలో ట్రాఫిక్ నిబంధనల అమలుపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. రాజేశ్వరరావు నేతృత్వంలో ఆదివారం రాత్రి ప్రత్యేక తనిఖీలు (స్పెషల్ డ్రైవ్) నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రధాన రహదారులపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలను పోలీసులు ఆపి వాటికి సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ద్విచక్ర వాహనదారుల వద్ద రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ), డ్రైవింగ్ లైసెన్స్ ఉండటంతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించారా లేదా అనే విషయాలను తనిఖీ చేశారు. అదేవిధంగా నాలుగు చక్రాల వాహనాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలను పరిశీలించారు. వాహనదారులు తప్పనిసరిగా అన్ని ధ్రువీకరణ పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కూడా నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అలాంటి చర్యలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఇన్స్పెక్టర్ బి.రాజేశ్వరరావు సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వాహనదారులు క్రమశిక్షణతో ప్రయాణించేలా చూడటమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



చిన్న శంకరంపేట నవంబర్ 22 (జనం సాక్షి) : వేసిన పంట సరిగా పండగ అప్పుల బాధతో ఓ రైతు పాల్పడిన సంఘటన చిన్న శంకరం పేట మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది స్థానిక ఎస్సై శివానందం తెలిపిన వివరాల ప్రకారం... పట్టణ కేంద్రానికి చెందిన వడ్డే నారాయణ (35) పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. మరియు తనకు ఉన్న ఒక ఎకరా పొలంలో వ్యవసాయం పంట వేయగా , పంట సరిగా పండక చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై శనివారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య కు పాల్పడినాడని మృతుడి భార్య వడ్డే యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు కూతుర్లు రేణుక, గాయత్రి, లక్ష్మీ లు ఉన్నారు.

గోలివాడలో ఘనంగా గోదావరి హారతి

అంతర్గాం, జనంసాక్షి : అంతర్గాం మండలం గోలివాడలో ఆదివారం సాయంత్రం నుండి రాత్రి వరకు గోదావరి నదిలో మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి క్యాతం వెంకటరమణ నేతృత్వంలో ఈ మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ జీవ నదులను పుణ్య నదులుగా కీర్తిస్తూ నదీమ తల్లుల ప్రాశస్తాన్ని చాటి చెబుతూ, ఋషులు, మహర్షులు వేద కాలం నుండి ఈ చక్కటి సాంప్రదాయాన్ని నెలకొల్పారని పేర్కొన్నారు.నదులు లేనిదే మానవ మనుగడ సాధ్యం కాదని, ప్రతి శుభకార్యాలలో నదులను కీర్తించడం ఇప్పటికి కొనసాగుతూ వస్తుందన్నారు. ఈ పరంపరను బావి తరాలకు అందించే ఉద్దేశంతో తెలంగాణలో గోదావరి హారతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 2012 వ సంవత్సరం నుంచి గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. నిజామాబాద్ జిల్లా కందకుర్తి నుండి 85 స్థలాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో



ఖ్యాతం వెంకటరమణతో పాటు కంద లోకనాదం, మాడ ప్రభాకర్ రెడ్డి, తమ్మనవేని మల్లేష్ విమలాదేవి,రామాచారి,సత్తయ్య గౌడ్, బోడకుంట సుభాష్,జైపాల్, ఆకుల హరీష్, కడియాల సుబ్రహ్మణ్యం,పసులరాజశేఖర్, తమన వేణి శంకర్, తార వేణి ఉమావతి, కొత్త దిలీషా,మాడ అరుణ, మాడ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పుట్టినరోజున మొక్కలు నాటిన విద్యార్థిని

- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- కొబ్బరి మొక్కలతో పాఠశాలలో పచ్చదనం
- వైష్ణవి చొరవను అభినందించిన ఉపాధ్యాయులు
- కస్తూర్బా విద్యాలయంలో మొక్కలు నాటిన విద్యార్థిని

జగిత్యాల, నవంబర్ 22 (జనంసాక్షి): జన్మదిన వేడుకలను పర్యావరణ హితంగా జరుపుకోవాలనే ఆలోచనతో పదో తరగతి విద్యార్థిని బత్తుల వైష్ణవి కొబ్బరి మొక్కలు నాటింది. రాయికల్ మండలం ఉప్పుమడుగు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కళాశాల ఆవరణలో తన జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల సమక్షంలో పాఠశాల ప్రధాన గేటుకు ఇరువైపులా మొక్కలు నాటింది. ఈ సందర్భంగా వైష్ణవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరింది. మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొంది. విద్యార్థిని చొరవను పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శోభారాణి, సుప్రియ, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ రాధ పాల్గొన్నారు.



69/1 భూమికి 224 నంబర్ ముసుగు

మదినగూడ ప్రభుత్వ భూమి కబ్జా వెనుక పక్కా ప్లాన్

- రిజిస్ట్రేషన్ల నుంచి నిర్మాణ అనుమతుల వరకు అధికారుల అండ
- మూడు శాఖల నిర్లక్ష్యంతో రూ.300 కోట్ల భూమి హాంఫట్..!
- భూ అక్రమార్కుల కబ్జాల వెనుక వెలుగుచూస్తున్న దారుణాలు

శేరిలింగంపల్లి, నవంబర్ 22 (జనంసాక్షి)

శేరిలింగంపల్లి నియోజక వర్గం మియాపూర్ సర్కిల్ పరిధి మదీనాగూడ రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న భూకబ్జా వెనుక కచ్చితంగా ఒకపక్క ప్లాన్ ఉందని, ఆ ప్రకారంగానే భూమి స్వాహా జరిగి అక్రమార్కుల చెరలో హారతి కర్పూరంగా మారుతు ందని మదీనాగూడవాసులు స్పష్టం చేస్తున్నారు. ముంబై జాతీయ రహదారిపై ప్రతిరోజు కొన్ని వేల కళ్ళ నిఘాను దాటుకొని నిరంతరంగా ప్రభుత్వభూమి కబ్జా అవుతుందంటే అది మామూ లు విషయం కాదని, దీని వెనుక ఒక నిర్దిష్ట వ్యవస్థీకృత విధానం తెరవెనక మాస్టర్ ప్లాన్ కచ్చితంగా అమలవుతూ పద్ధతి ప్రకారం సదరు భూమిని ఆక్రమిస్తూ దాంట్లో భవనాలను నిర్మించి తిరిగి ప్రజలకే అమ్మేస్తూ రాత్రికి రాత్రి కోట్ల రూపాయలను సొమ్ము చేసుకుంటూ ఉండడం ఆలోచించాల్సిన అంశం. దాదాపు 450 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి దశాబ్దాలుగా అత్యంత ధైన్య స్థితిలో దళారుల పాలిట బంగారు బాతుగా మారిపోతోంది.

మియాపూర్ సర్కిల్ మదీనాగూడ ప్రభుత్వ భూమి స్వాహా వెనుక ప్రభుత్వ అధికారుల పాత్ర అనుమానాస్పదంగా కనిపిస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. పట్టపగలు నడిరోడ్డుపై జరుగు తున్న భూకబ్జా తథంగాన్ని సామాన్యుడు తన పరిధి కాదనుకుని



మౌనంగా ఉన్నా... బాధ్యత కలిగిన సంబంధిత అధికారి ఉదాసీ న వైఖరి, నిర్లక్ష్య ధోరణి అనుమానాలకు తావిస్తోంది. ఒకటి కాదు రెండు కాదు దాదాపు మూడు దశాబ్దాల నుండి మదీనా గూడ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 69/1 ని ప్రభుత్వ భూమిగా రికార్డులలో నిక్షిప్తం చేసిన రెవెన్యూ అధికారులు తదనంతర కాలంలో అక్కడ జరుగుతున్న భూకబ్జాలను, ఆక్రమణలను, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో ఉద్దేశపూర్వకంగానే ఫెయిల్యూర్ అయ్యారనే స్వచ్ఛంద సంస్థల ఆరోపణలకు పూర్తి మద్దతు లభించేలా అక్రమ నిర్మాణాల విషయంలో అధికారుల వ్యవహార శైలి కనిపిస్తుండడం ఆలోచించాల్సిన అంశం.

"భూమి కబ్జా వెనుక అధికార 'త్రయం' లీలలు...!?

మదినగూడ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 69/1లోని 4 ఎకరాల 26 గుంటల ప్రభుత్వ భూమి రికార్డుల ప్రకారం సెయిత్వార్ నాటి నుండే ప్రభుత్వ భూమిగా కొనసాగుతూ వస్తోంది. ఈ క్రమంలో గత మూడు దశాబ్దాల క్రితం అప్పుడప్పుడే చోటు చేసుకుంటున్న భూ ఆక్రమణల విషయంలో నాటి రెవెన్యూ అధికారులు ముంచుకొస్తున్న ప్రమాదాన్ని గుర్తించి తగిన ఆధారాలతో కోర్టును ఆశ్రయించడంతో అప్పట్లోనే కోర్టు దానిని ప్రభుత్వ భూమిగా నిర్ణయిస్తూ హద్దులను నాటాలని, అక్రమ నిర్మాణాలను తొలగించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ద్వారా శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులకు ఆదేశాలను జారీ చేసింది. ఏం జరిగిందో తెలియదు కానీ అప్పటినుండి బాధ్యత వహించాల్సిన రెవెన్యూ అధికారుల ఆలోచన ధోరణిలో మార్పు వచ్చి స్పష్టమైన హద్దులను నిర్ణయించడంతోపాటు ఆక్రమణలను తొలగించే విషయంలో పూర్తిగా నిర్లక్ష్యాన్ని కనబరచడంతో అక్రమార్కులంతా పక్కా ప్రణాళికతో సర్వేనెంబర్ 69 ని మింగేయడం ప్రారంభించారు. అంతటితో ఆగకుండా దానికి సర్వే నెంబర్ 224 ను ఆపాదిస్తూ అది మదీనాగూడకు సంబంధించిన సర్వేనెంబర్ గా చెప్పుకుంటూ యదేచ్ఛగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్లాట్లుగా భవనాలుగా మలచడం అక్రమార్కుల కుట్రలకు నిలువెత్తు నిదర్శనం. అయినప్పటికీ పర్యవేక్షణ కొనసాగిస్తూ అక్రమాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు పూర్తిగా ఉదాసీన వైఖరికి అలవాటు పడడంతో కబ్జారాయుళ్లు తమ వాదనను బలపరుస్తూ 69/1 ని ఏకంగా 224 గా పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా సబ్ రిజిస్టార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పత్రాలనే సృష్టించడం ప్రారంభించారు. మండల రెవెన్యూ కార్యాలయానికి సదరు వివరాలను అందించి వాస్తవాలను తెలుసుకోవలసిన సబ్ రిజిస్టార్ కార్యాలయ అధికారులుసైతం రెవెన్యూ అధికారుల బాటలోనే నడుస్తూ కనీస ప్రాథమిక విచారణ లేకుండానే 69/1 సర్వే నెంబర్ ను 224 గా మార్పు చేసి భూ ఆక్రమణదారులకు రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలను కానుకగా అందించడం గమనార్హం.

"ఏకంగా ఇళ్ల నిర్మాణాలను, భారీ కన్స్ట్రక్షన్

ఖచ్చితమైన ప్రభుత్వ భూమికి తప్పుడు సర్వే నెంబర్ తో రిజిస్ట్రేషన్ పత్రాలు అందుతుండడంతో మరింత రెచ్చిపోయిన అక్రమార్కులు అక్కడ ఏకంగా ఇళ్ల నిర్మాణాలను, భారీ కన్స్ట్రక్షన్ లను కొనసాగించి రిజిస్ట్రేషన్ పత్రాల సహకారంతో జిహెచ్ఎంసి(ప్రస్తుతం సిఎంసి) నుండి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు పొందుతూ ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూమిని చెరబట్టడం సర్వసాధారణంగా మారిపోయింది. అయితే ఇక్కడ పూర్తి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిన రెవెన్యూ అధికారులు అక్రమార్కులతో కలిసి సబ్ రిజిస్టార్ కార్యాలయానికి, జిహెచ్ఎంసి అధికారులకు అందించిన సహకారం పుణ్యమా అని సాక్షాత్తు ముంబై జాతీయ రహదారిపై 4 ఎకరాల 26 గుంటల ప్రభుత్వ భూమి నేడు 224 గా రూపాంతరం చెంది దాదాపు 3 ఎకరాల వరకు దళారుల చెరలోకి వెళ్లిపోయింది. విచిత్రం ఏమిటంటే అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు తమ పరోక్ష సహకారంతో సదరు భవనాలను పూర్తిగా నిర్మించి తుదిమెరుగులు దిద్దే క్రమంలో మొక్కుబడిగా వెళ్లి వారికి నోటీసులను అందించి మళ్లీ తెర వెనుక సహాయ సహకారాలతో కోర్టుకు పంపించి స్టేటస్కో ఉత్తర్వులను తెచ్చుకొని అధికారులను అడ్డుకునేలా సలహాలు సూచనలనుసైతం అందిస్తున్నారన్న పుకార్లు షికార్లు కొడుతున్నాయి. ఏది ఏమైనాప్పటికీ ఇప్పటికే దాదాపు 300 కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైపోయిన తరుణంలో ఇప్పటికైనా మూడు ప్రభుత్వ యంత్రాంగాలు సమన్వయంతో పనిచేసి సర్వేనెంబర్ 69/1 లోని ప్రభుత్వ భూమిని హస్తగతం చేసుకోవడంతో పాటు అక్కడే అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించి భవిష్యత్ తరాలకు ప్రభుత్వ లక్ష్యాలను అందించే దిశగా ప్రభుత్వ పరం చేయాల్సిన బాధ్యతను మియాపూర్ వాసులు ఎత్తిచూపుతున్నారు.



వారం రోజుల్లో డబుల్ బెడ్‌రూంలు పంపిణీ చేయాలి

- లేనిపక్షంలో పేదలకు అప్పగిస్తాం
- ఐదేళ్లుగా పంపిణీ చేయకపోవడం దుర్మార్గం
- సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్

సిరిసిల్ల టౌన్, నవంబర్ 22 (జనంసాక్షి): సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వారం రోజుల్లో అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడు తూ ఇళ్లు నిర్మించి ఐదేళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు అందించకపోవడం దుర్మార్గమన్నారు. పంపిణీ చేయకపోవడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లో ఇళ్లను పంపిణీ చేయకపోతే అర్హులైన ఇల్లు లేని నిరుపేదలను తీసుకెళ్లి వాటిలో నివాసం ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ పేదల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించడంతో పాటు శాంతినగర్ డబుల్ బెడ్‌రూం ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోడం రమణ, జిల్లా కమిటీ సభ్యులు సూర పద్మ, శ్రీరాముల రమేష్, చంద్ర, పట్టణ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్, నాయకులు నక్క దేవదాస్, దాసరి రూప, మోర తిరుపతి, నల్ల లావణ్య, నాగుల సత్యనారాయణ, చీకట్ల మహేష్ పాల్గొన్నారు.

పేదల చెంతకే స్వచ్ఛమైన తాగునీరు

- రూ.3కే ఐదు లీటర్ల శుద్ధ జలం.. ఉచిత వాటర్ కార్డుల పంపిణీ
- త్వరలో అంతిమయాత్ర రథం ఏర్పాటు
- వచ్చే నెలలో ఉచిత కంటి వైద్య శిబిరం
- జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

హుజూరాబాద్, నవంబర్ 22 (జనంసాక్షి):

గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జయన్న ఫౌండేషన్ పలు సేవా కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా హుజూరాబాద్ మండలం రాంపూర్‌లో ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుడిపాటి సరిత, జైపాల్‌రెడ్డి దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కేంద్రంలో ఐదు లీటర్ల నీటిని రూ.3కే అందించనున్నారు. గ్రామస్తులకు రూ.100 ప్రారంభ బ్యాలెన్స్‌తో ఉచిత వాటర్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్డుతో 33 క్యాన్ల వరకు నీటిని పొందవచ్చని, ప్లాంట్ 24 గంటలూ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లో వైద్యరంగంలో పనిచేస్తూ సంపాదించిన ఆదాయంలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించాలనే సంకల్పంతో ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు జైపాల్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు వివిధ గ్రామాల్లో నిర్వహించిన కంటి వైద్య శిబిరాల ద్వారా 7 వేల మందికి పరీక్షలు చేయించి, అవసరమైన 1,300 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయించినట్లు వెల్లడించారు. ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు మరో 4 వేల నుంచి 5 వేల వరకు శస్త్రచికిత్సలకు సహకరించినట్లు పేర్కొన్నారు. వచ్చే నెల మొదటి వారంలో రాంపూర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. విద్యారంగంలో భాగంగా 12 ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు, మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యార్థులకు 2 వేల వాటర్ బాటిళ్లు పంపిణీ చేసినట్లు వివరించారు. అలాగే మండలవ్యాప్తంగా 20 ఫ్రీజర్ బాక్సులను నామమాత్రపు రూ.1,000 నిర్వహణ ఛార్జీతో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రాంపూర్‌లో ఒకటి రెండు నెలల్లో అంతిమయాత్ర రథాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సరిత మాట్లాడుతూ చెల్పూర్, సింగాపూర్, సిర్సపల్లి, కాట్రపల్లి, రాజపల్లి, రాంపూర్ గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుభకార్యాలకు కూలింగ్ వాటర్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రాంపూర్ ప్లాంట్ నిర్వహణకు గ్రామ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, ఏడాది పాటు మరమ్మతుల బాధ్యత ఫౌండేషన్ తీసుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముశం సంగీత గణేష్, మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు వన్నాల శివాజీ, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.





నిప్పంటించుకున్న వ్యక్తి మృతి

చేర్యాల, నవంబర్ 22 (జనంసాక్షి): మండల కేంద్రంలోని చుంచనకోట క్రాస్‌రోడ్డు వద్ద ఇటీవల పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన దాసారం రమేష్ (35) ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, స్థానిక ఎస్సై గూడ అపూర్వారెడ్డి మంటలు ఆర్పి అతడిని కాపాడారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మెడికోల సమస్యల పరిష్కారానికి కేటీఆర్ చొరవ

- మంత్రి దామోదర రాజనర్సింహకు ఫోన్.. విద్యార్థులకు భరోసా

కరీంనగర్ టౌన్, నవంబర్ 22 (జనం సాక్షి) : కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చొరవ చూపారు. సొంత కళాశాల భవనం, హాస్టల్‌తో పాటు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ విద్యార్థులు చేపట్టిన ధర్నాను గమనించిన ఆయన వాహనం ఆపి నేరుగా విద్యార్థుల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతన కళాశాల భవనం నిర్మాణం దాదాపు 90 శాతం పూర్తయినా అప్పగించడంలో జాప్యం జరుగుతోందని, తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రయోగశాలలు, రవాణా తదితర సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు కేటీఆర్‌కు వివరించారు. వెంటనే స్పందించిన ఆయన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఫోన్ చేసి సమస్యలను వివరించారు. నూతన భవనాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. కేటీఆర్ స్వయంగా స్పందించి మంత్రితో మాట్లాడటంతో వైద్య విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.




సహజ ప్రసవాలతోనే తల్లీబిడ్డలకు రక్ష



వనపర్తి బ్యూరో, నవంబర్ 22 (జనం సాక్షి) : తల్లీబిడ్డల ఆరోగ్యానికి సహజ ప్రసవాలే శ్రేయస్కరమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. పట్టణంలోని నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం సహజ ప్రసవాల ప్రాధాన్యతపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ వివేకానంద చౌరస్తా, ఇందిరాగాంధీ చౌరస్తా, రాజీవ్ చౌరస్తా, డిపో రోడ్డు మీదుగా బస్టాండ్‌కు చేరుకుంది. అనంతరం బస్టాండ్‌లోని ప్రయాణికులకు సహజ ప్రసవాల ప్రాధాన్యత, వాటివల్ల తల్లీబిడ్డలకు కలిగే ప్రయోజనాలను ఎమ్మెల్యే స్వయంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహజ ప్రసవం తల్లీబిడ్డలిద్దరికీ ఎంతో మేలు చేస్తుందని, వైద్యపరంగా తప్పనిసరి అయినప్పుడు మాత్రమే సిజేరియన్‌ను ఎంచుకోవాలని సూచించారు. సహజ ప్రసవం వల్ల తల్లి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని, శస్త్రచికిత్స వల్ల వచ్చే నొప్పులు, ఇన్ఫెక్షన్లు, ఇతర సమస్యల ప్రమాదం తగ్గుతుందని చెప్పారు. బిడ్డకు కూడా ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. ప్రతి గర్భిణికి ప్రసవంపై సరైన అవగాహన కల్పించడం, అనవసర భయాలను తొలగించడం, వైద్యుల సలహాలు పాటించేలా ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షులు కదిరె రాములు, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, జనరల్ సెక్రటరీ బ్రహ్మచారి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, సర్పంచుల సంఘం అధ్యక్షులు వాల్య నాయక్, ఎస్ఎల్ఎన్ రమేష్, లక్కాకుల సతీష్, పెబ్బేరు మండల అధ్యక్షులు యాపర్ల రామిరెడ్డి, కౌన్సిలర్లు పరుశురాం, క్రాంతి గౌడ్, రవి యాదవ్, పాల రవి, రఘు యాదవ్, రాజు యాదవ్, శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీజెన్ ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో 'మియోరా ప్రాపర్టీస్' గ్రాండ్ ఓపెనింగ్

- 7 ఎకరాల్లో 81 విలాసవంతమైన ట్రిప్లెక్స్ విల్లాలు
- బోడుప్పల్ లో ఆధునిక సౌకర్యాలతో ప్రీమియం నివాస ప్రాజెక్టు



బోడుప్పల్, నవంబర్ 22 (జనంసాక్షి) : బోడుప్పల్ పరిధిలోని ఏబీఆర్ నగర్‌లో రియల్ ఎస్టేట్ రంగంలో మరో ప్రతిష్ఠాత్మక విల్లా ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చింది. శ్రీజెన్ ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంటున్న 'మియోరా ప్రాపర్టీస్' విలాసవంతమైన ట్రిప్లెక్స్ విల్లా ప్రాజెక్టు గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,మాజీ మేయర్లు తోటకూర అజయ్ యాదవ్,అమర్ సింగ్,మాజీ కార్పొరేటర్లు,రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రముఖులు,బిల్డర్లు హాజరయ్యారు. ఆధునిక జీవనశైలికి అనుగుణంగా అత్యాధునిక హంగులు, విశాలమైన నివాస వసతులు,ఆహ్లాదకరమైన వాతావరణంతో ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.మొత్తం ఏడు ఎకరాల విస్తీర్ణంలో హెచ్ఎండీఏ అనుమతులతో పాటు తెలంగాణ రేరా పరిధిలో 81 విల్లాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు.ఈస్ట్ ఫేసింగ్,వెస్ట్ ఫేసింగ్ దిశల్లో ఆకర్షణీయమైన ట్రిప్లెక్స్ విల్లాలు అందుబాటులో ఉండనున్నాయి.ఒక్కో విల్లాలో నాలుగు బెడ్‌రూమ్‌లతో పాటు కుటుంబ సభ్యుల అవసరాలకు అనుగుణంగా విశాలమైన నివాస ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆధునిక హంగులతో ప్రత్యేక సౌకర్యాలు

నివాసితుల సౌకర్యం,భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రాజెక్టులో క్లబ్‌హౌస్,స్పోర్ట్స్ క్లబ్,స్విమ్మింగ్ పూల్,విశాలమైన ఓపెన్ స్పేస్ వంటి ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నారు. అంతేకాకుండా ప్రాజెక్టు చుట్టూ 10 అడుగుల ఎత్తైన ప్రహరీ గోడను నిర్మించనున్నారు.ఆధునిక జీవనశైలిని కోరుకునే కుటుంబాలకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఒకే ప్రాంగణంలో అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దుతున్నట్లు నిర్వాహకులు వివరించారు.

విద్య, రవాణా సౌకర్యాలకు చేరువలో..

బోడుప్పల్,పీర్జాదిగూడ,చెంగిచెర్ల పరిసర ప్రాంతాల్లో పలు అంతర్జాతీయ విద్యాసంస్థలు అందుబాటులో ఉండటం ఈ ప్రాజెక్టుకు అదనపు ఆకర్షణగా నిలవనుంది.వరంగల్ జాతీయ రహదారికి సమీపంలో ఉండటంతో పాటు మౌలాలి,చర్లపల్లి రైల్వే స్టేషన్లు అందుబాటులో ఉండటం వల్ల రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. విద్య,రవాణా సౌకర్యాలకు ప్రాధాన్యతనిచ్చే కుటుంబాలకు ఈ ప్రాంతం అనువైన నివాస కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రెండు దశాబ్దాల అనుభవంతో నాణ్యమైన నిర్మాణాలు

రియల్ ఎస్టేట్ రంగంలో తమకున్న 20 ఏళ్ల అనుభవంతో ఆధునిక సాంకేతికత,నాణ్యమైన నిర్మాణ ప్రమాణాలను పాటిస్తూ 'మియోరా ప్రాపర్టీస్' ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు శ్రీజెన్ ఇన్‌ఫ్రా డైరెక్టర్లు తెలిపారు.నాణ్యత, భద్రత,ఆధునిక సౌకర్యాల సమ్మేళనంగా విల్లాలను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్లు రాంగోపాల్ రెడ్డి,సత్యనారాయణ రెడ్డి, దీపకర్ రెడ్డి,అక్కిరెడ్డి,వెంకటేశ్వర్ రెడ్డి,అనంత రెడ్డి,కొత్త కిరణ్ గౌడ్,కొత్త విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బోడుప్పల్ పరిసర ప్రాంతాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న రియల్ ఎస్టేట్ రంగంలో 'మియోరా ప్రాపర్టీస్' ప్రత్యేక గుర్తింపు పొందుతుందని నిర్వాహకులు ధీమా వ్యక్తం చేశారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం



చేవెళ్ల, నవంబర్ 22 (జనంసాక్షి) : పోలియో రహిత సమాజమే లక్ష్యంగా ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంతో పాటు చేవెళ్ల పట్టణ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. పిల్లల ఆరోగ్య భద్రతకు తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వాలని, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, కౌన్సిలర్లు శైలజ ఆగిరెడ్డి, దావల్గారి గోపాల్ రెడ్డి, పైండ్ల మధుసూధన్ రెడ్డి, క్రిష్ణా నాయక్, మద్దెల శ్రీనివాస్, కౌకుంట్ల సర్పంచ్ భార్గవపల్లి మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ బేగరి రాములు, మాజీ సర్పంచులు మోహన్ రెడ్డి, పడాల ప్రభాకర్, కెసారం శ్రీనివాస్, జహంగీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమా అర్హులందరికీ అందాలి



జడ్చర్ల, నవంబర్ 22 (జనంసాక్షి) : ఇందిరమ్మ జీవిత బీమా పథకం అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా దరఖాస్తుల నమోదు వేగవంతం చేయాలని జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ గిరీష్ ఆదేశించారు. ఆదివారం కంప్యూటర్ ఆపరేటర్ విజయ్‌తో కలిసి ఆర్‌పీలకు ఆన్‌లైన్ నమోదుపై అవగాహన కల్పించారు. దరఖాస్తులో బీమా పొందే వ్యక్తికి సంబంధించిన, వినియోగంలో ఉన్న మొబైల్ నంబర్‌నే నమోదు చేయాలన్నారు. నమోదుకు కంప్యూటర్లు, ఇతర సదుపాయాలు కల్పిస్తామని, ఆర్‌పీలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు.

డంపింగ్ యార్డు తొలగించే వరకు పోరాటం ఆగదు



జవహర్‌నగర్, నవంబర్ 22 (జనంసాక్షి) : జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తొలగించాలని, కొత్తగా చెత్త తరలింపును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ చెన్నాపురం చౌరస్తాలో ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు తొలిరోజు విజయవంతంగా కొనసాగాయి. ఈ దీక్షలకు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా డంపింగ్ యార్డు కాలుష్యంతో జవహర్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన, కలుషిత నీరు, విషపూరిత గాలితో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని అన్నారు. చెత్తను ఒకేచోట వేయకుండా వికేంద్రీకరించి, శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డును పూర్తిగా తొలగించి, కొత్త చెత్త రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డు తొలగింపు కోసం జరుగుతున్న ఈ పోరాటానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ కూడా మద్దతు ప్రకటించాలని పోరాట కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు పూర్తిగా తొలగించే వరకు, కొత్త చెత్త తరలింపును నిలిపివేసే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ యాంటీ డంపింగ్ యార్డు జేఏసీతో పాటు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు.

రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు అండగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



వికారాబాద్, నవంబర్ 22 (జనంసాక్షి) : బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలోని ఘాట్ రోడ్డుపై ఆటో, లారీ ఢీకొన్న ప్రమాదంలో పెండ్లిమడుగు గ్రామానికి చెందిన పార్వతమ్మ, చంద్రమ్మ, సరిత, ఆటో డ్రైవర్ నగేష్ మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు పిఏసిఎస్ చైర్మన్ బిళ్లపాటి రాజశేఖర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, వైస్ చైర్మన్ పీలారం మల్లేశం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతులకు నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో మృతుల కుటుంబాలను పరామర్శించి, తక్షణ సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ.30 వేల చొప్పున అందించారు. మృతుల కుటుంబాలకు స్పీకర్ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.

ఉప్పల్‌లో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభం

- చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి..
- టీకా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



ఉప్పల్, నవంబర్ 22 (జనం సాక్షి) : చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించేందుకు చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్‌తో పాటు పలువురు వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు రెండు చుక్కల పోలియో టీకా వేసి వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ సంబంధిత అధికారులతో కలిసి ఉప్పల్ బస్‌స్టాప్, ఉప్పల్ మెట్రో రైల్వే స్టేషన్, ఇతర రద్దీ ప్రాంతాలు, పోలియో టీకా కేంద్రాలను సందర్శించి కార్యక్రమం నిర్వహణ తీరును పరిశీలించారు. టీకాలను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం భద్రపరుస్తున్నారా, టీకాలు వేసిన చిన్నారుల ఎడమ చేతి చిటికెన వేలికి గుర్తు సక్రమంగా వేస్తున్నారా అనే అంశాలను తనిఖీ చేశారు. టీకాలు వేసిన చిన్నారుల వివరాలను నమోదు చేసే పట్టికల్లో సక్రమంగా నమోదు చేస్తున్నారా అని పరిశీలించారు. టీకా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలు, వైద్య సిబ్బంది పనితీరు, కార్యక్రమ అమలు తీరుపై అధికారులతో సమీక్షించారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించి వ్యాధి నివారణలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ కౌశిక్, జిల్లా అధికారి డాక్టర్ గీత ప్రసాద్, ఉప్పల్ వైద్యాధికారి శౌశీల్య, ఉప్పల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దాడి

- ఇసుక టిప్పర్ స్వాధీనం



కృష్ణ, నవంబర్ 22 (జనం సాక్షి) : కృష్ణ మండలం హిందూపూర్ వద్ద అక్రమ ఇసుక రవాణా పై పోలీసులు దాడి చేసి ఇసుక లోడ్‌తో వెళుతున్న టిప్పర్ ను స్వాధీనం చేసుకున్నారు.శనివారంరాత్రి 9 గంటల నుండి బ్లూకో ల్ట్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది ఎచ్ సి కే శ్రీధర్ ఆదివారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో హిందూపూర్ గ్రామ శివారులోని బై-రోడ్డు వద్ద గస్తీ నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా వస్తున్న ఒక టిప్పర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో ఇసుక లోడ్ ఉన్నట్లు గుర్తించారు.

సదరు టిప్పర్ వాహనం నంబర్ కెఎ

33సి7677 కాగా, వాహన డ్రైవర్ నాల్వార్ కు చెందిన చంద్రప్ప . అలాగే టిప్పర్ యజమాని బాబప్ప దిగా తేలింది.విచారణలో భాగంగా గుడెబల్లూరు గ్రామ శివారులో కృష్ణా నది పరివాహక ప్రాంతం నుండి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమం గా ఇసుకను తవ్వి తరలి స్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.ఈ నేపథ్యంలో ఇసుక లోడ్‌తో ఉన్న టిప్పర్ వాహనాన్ని, డ్రైవర్ చంద్రప్పను పోలీస్ స్టేషన్‌కు తరలించి, టిప్పర్ యజమాని, డ్రైవర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జిల్లాలో పల్స్ పోలియో విజయవంతం



రంగారెడ్డి, నవంబర్ 22 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. జిల్లాలోని ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో భాగంగా, తొలిరోజే 4,25,256 మంది చిన్నారులకు చుక్కలు వేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. జిల్లా మొత్తం లక్ష్యంలో ఇది 98 శాతమని ఆయన పేర్కొన్నారు. ఏ కారణం చేతనైనా ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారుల కోసం సోమ, మంగళవారాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ ఫీల్డ్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటికి వచ్చే వైద్య సిబ్బందికి సహకరించి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.

మహిళ హత్య కేసును 24 గంటల్లో ఛేదించిన చేవెళ్ల పోలీసులు



చేవెళ్ల, నవంబర్ 22 (జనంసాక్షి) : చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన బత్తుల పద్మ హత్య కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. ఈ కేసులో నిందితుడు కేతావత్ శివ శంకర్ వరప్రసాద్ నాయక్ అలియాస్ శివ (19)ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి దొంగిలించిన మొబైల్ ఫోన్‌తో పాటు హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 20న బత్తుల గురువులు అనే వ్యక్తికి చెందిన మొబైల్ ఫోన్‌ను నిందితుడు శివ దొంగిలించి, ఆ ఫోన్ ద్వారా గురువులు బ్యాంకు ఖాతా నుంచి రూ.45 వేల నగదును మరో ఖాతాకు బదిలీ చేశాడు. ఈ విషయంపై అనుమానం వ్యక్తం చేసిన గురువులు, బత్తుల పద్మతో కలిసి ఈ నెల 21న చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. దీంతో తనపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సహకరించిందన్న కక్షతో పద్మపై నిందితుడు కత్తితో దాడి చేసి హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన చేవెళ్ల పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడిని గుర్తించి నేరం జరిగిన 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి దొంగిలించిన మొబైల్ ఫోన్, హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా వెలుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో నమోదైన మరో రెండు దొంగతనం కేసుల్లోనూ నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుడిని వేగంగా గుర్తించి అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ వెంకటేష్‌తో పాటు పోలీసు బృందాన్ని చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

చారిత్రక పాలిటెక్నిక్ కళాశాలకు పూర్వవైభవం తీసుకొస్తాం

వనపర్తి బ్యూరో, నవంబర్ 22 (జనం సాక్షి) : ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం, పట్టణ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడమే లక్ష్యంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదివారం ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాచీన పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి, కళాశాల భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పట్టణంలోని వివేకానంద చౌరస్తా వరకు కాలినడకన వెళ్తూ స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రజలతో కలిసి చాయ్ తాగుతూ సరదాగా ముచ్చటించారు. ఎమ్మెల్యే పర్యటన ఆద్యంతం ఆత్మీయ వాతావరణంలో సాగింది. మార్నింగ్ వాక్‌లో భాగంగా ముందుగా పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అక్కడి భవనాల ప్రస్తుత పరిస్థితులను పరిశీలించారు. ఒకప్పుడు ఎంతో ఘనమైన చరిత్రను కలిగి, వనపర్తి పట్టణానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన ఈ కళాశాల భవనాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చారిత్రక కట్టడాలు కేవలం పాత భవనాలు మాత్రమే కాదని, అవి మన ప్రాంత చరిత్రకు, గత వైభవానికి ప్రతీకలని అన్నారు. ఇలాంటి విలువైన కట్టడాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణ కోసం ఇప్పటికే ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే వెల్లడించారు. త్వరలోనే పునరుద్ధరణ పనులు ప్రారంభించి కళాశాల భవనానికి పూర్వవైభవం తీసుకువచ్చేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. వనపర్తి పట్టణానికి తలమానికంగా నిలిచే ఈ చారిత్రక కట్టడాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, దాని విశిష్టతను కాపాడేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడిన ఎమ్మెల్యే

కళాశాల సందర్శన సందర్భంగా అక్కడే క్రికెట్ ఆడుతున్న విద్యార్థులను చూసిన ఎమ్మెల్యే వారితో సరదాగా ముచ్చటించారు. అనంతరం వారితో కలిసి కొద్దిసేపు క్రికెట్ ఆడి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. ప్రజాప్రతినిధిగా అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా విద్యార్థులతో కలిసిపోయి ఆటపాటల్లో పాల్గొనడం అక్కడి వారిని ఆకట్టుకుంది. విద్యార్థుల విద్యాభ్యాసం, క్రీడలు, కళాశాల అభివృద్ధి వంటి అంశాలపై కూడా ఆయన ఆరా తీశారు.


ఒకవైపు పట్టణ చారిత్రక సంపద పరిరక్షణకు చర్యలు చేపడుతూనే, మరోవైపు ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడమే లక్ష్యంగా ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ కొనసాగింది. చారిత్రక పాలిటెక్నిక్ కళాశాల



పునరుద్ధరణకు రూ.10 కోట్ల నిధులు మంజూరు కావడం, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని ఎమ్మెల్యే ప్రకటించడం ఈ పర్యటనలో ప్రధాన అంశంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షులు కదిరె రాములు, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, జనరల్ సెక్రటరీ బ్రహ్మచారి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, సర్పంచుల సంఘం అధ్యక్షులు వాల్య నాయక్, ఎస్ఎల్ఎన్ రమేష్, లక్కాకుల సతీష్, పెబ్బేరు మండల అధ్యక్షులు యాపర్ల రామిరెడ్డి, కౌన్సిలర్లు పరుశురాం, క్రాంతి గౌడ్, రవి యాదవ్, పాల రవి, రఘు యాదవ్, రాజు యాదవ్, శ్రీకాంత్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23 నవంబర్ 2026

స్మార్ట్ సిటీ కాదు.. స్మోక్ సిటీ!



6 మూడు దశాబ్దాలుగా కరీంనగర్‌ను కమ్మేస్తున్న చెత్త పొగ

- రూ.కోట్ల నిధులు ఖర్చయినా కరగని చెత్త కొండలు
- బయోమైనింగ్ పేరుతో మళ్లీ రూ.17 కోట్ల కేటాయింపు
- ఎనిమిది కాలనీల ప్రజలకు శ్వాసకోశ సమస్యలు
- 8 వేల ఈత చెట్లు.. 1,200 తాటిచెట్లు కనుమరుగు





స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోవాల్సిన కరీంనగర్‌ను మూడు దశాబ్దాలుగా డంపింగ్ యార్డ్ పొగ కమ్మేస్తోంది. అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా.. నగర ప్రజలకు కనీసం స్వచ్ఛమైన గాలి కూడా అందని దుస్థితి నెలకొంది. ఆటోనగర్--కోతిరాంపూర్ సమీపంలోని మానేరు నది తీరాన పేరుకుపోయిన చెత్త కొండలు, తరచూ చెలరేగుతున్న మంటలు, రోజుల తరబడి వ్యాపిస్తున్న దట్టమైన పొగ స్థానికుల పాలిట శాపంగా మారాయి. ఒకప్పుడు నగర శివారులో ఉన్న డంపింగ్ యార్డ్.. జనావాసాల విస్తరణతో కాలనీలకు కూతవేటు దూరంలోకి వచ్చేసింది. కోతిరాంపూర్, కట్టారాంపూర్, ఆల్మాపురి, ఆలుగునూరు, లక్ష్మీనగర్, గణేశ్‌నగర్, హౌసింగ్ బోర్డు, బొమ్మకల్ ప్రాంతాల ప్రజలు కాలుష్యంతో సతమతమవుతున్నారు. కళ్ల మంటలు, దగ్గు, గొంతునొప్పి, శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి వేసవిలో చెత్తకు మంటలు అంటుకోవడం, పొగ నగరమంతా వ్యాపించడం పరిపాటిగా మారింది. కోట్ల నిధులు, బయోమైనింగ్ ప్రణాళికలు, డంపింగ్ యార్డ్ తరలింపు హామీలు వచ్చినా సమస్యకు మాత్రం మోక్షం లభించడం లేదు.

కరీంనగర్ బ్యూరో, బుర్ర పరశురాం గౌడ్ (జనంసాక్షి):

చెత్త కొండలే కాలుష్య కేంద్రాలు..

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్ల నుంచి సేకరించే చెత్తను దశాబ్దాలుగా ఒకే ప్రాంతంలో వేస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయడం, వ్యర్థాలను శాస్త్రీయంగా శుద్ధి చేయడంలో లోపాల కారణంగా భారీగా చెత్త పేరుకుపోయింది. 2022లో బయోమైనింగ్ పనులు ప్రారంభించే సమయంలో సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉన్నట్లు అంచనా వేయగా, అనంతర నివేదికల్లో ఈ పరిమాణం మూడు లక్షల మెట్రిక్ టన్నులకు చేరువైనట్లు పేర్కొన్నారు. దీనికి రోజువారీగా చేరుతున్న కొత్త చెత్త అదనం. పాత చెత్తను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నా, మరోవైపు కొత్త చెత్త పేరుకుపోతుండటంతో సమస్య మరింత జటిలమవుతోంది.

వేసవి వచ్చిందంటే పొగ కష్టాలే..

డంపింగ్ యార్డ్‌లో మంటలు చెలరేగడం స్థానికులకు ఏటా ఎదురయ్యే సమస్యగా మారింది. రోజుల తరబడి చెత్త కాలుతూ వెలువడే దట్టమైన పొగ గాలివాటాన్ని బట్టి కాలనీల్లోకి చేరుతోంది. రాత్రి, తెల్లవారుజామున ఇళ్లలోకి పొగ చొచ్చుకొస్తుండటంతో తలుపులు, కిటికీలు మూసుకుని ఉండాల్సిన పరిస్థితి. అక్టోబర్ 18న ఆల్మాపురి కాలనీలోని పూజ గదుల్లోకి సైతం పొగ చేరగా, అక్టోబర్ 26న మరోసారి భారీగా మంటలు చెలరేగాయి. కొన్ని సందర్భాల్లో పొగ కారణంగా రహదారులపై వాహనాలు కనిపించని పరిస్థితి ఏర్పడుతోంది. వేలాది మంది నివసించే కాలనీలకు సమీపంలోనే కాలుష్య కేంద్రం కొనసాగుతున్నా శాశ్వత పరిష్కారం లేకపోవడం ప్రజల్లో ఆగ్రహం కలిగిస్తోంది.





మానేరు నదికీ ముప్పు..

మానేరు నది తీరాన డంపింగ్ యార్డ్ ఉండటంతో పర్యావరణ సమస్యలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. వర్షాకాలంలో చెత్త నుంచి వెలువడే వ్యర్థ జలాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలో కలిసే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలపైనా ప్రభావం పడే అవకాశాలున్నాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఒకప్పుడు ఈ ప్రాంతంలో ఉన్న సుమారు 8 వేల ఈత చెట్లు, 1,200 తాటిచెట్లు కనుమరుగయ్యాయని స్థానికులు చెబుతున్నారు. పర్యావరణంపై డంపింగ్ యార్డ్ ప్రభావాన్ని అంచనా వేసి, గాలి, నీటి నాణ్యత పరీక్షల నివేదికలను అధికారులు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది.

రూ.16 కోట్లు ఖర్చు.. తొలగని చెత్త..

డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి గత బీఆర్ఎస్ పాలనలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద సుమారు రూ.16 కోట్లతో బయోమైనింగ్ పనులు చేపట్టారు. 2022 జూన్‌లో ప్రారంభమైన ఈ పనులను ఏడాదిలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. చెత్త నుంచి మట్టి, ప్లాస్టిక్ వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేయాలనుకున్నారు. అయితే పనులు ఆశించిన స్థాయిలో సాగలేదు. స్మార్ట్ సిటీ నిధుల నుంచి సుమారు రూ.7 కోట్లు, స్వచ్ఛ భారత్ మిషన్ కింద మరో రూ.2 కోట్లు ఖర్చు చేసినట్లు వివరాలు పేర్కొంటున్నాయి. మొత్తం సుమారు రూ.9 కోట్లు ఖర్చయినా చెత్త కొండలు మాత్రం అలాగే మిగిలాయి. రెండు కాంట్రాక్టు సంస్థలు పనులు పూర్తి చేయలేకపోయాయని నివేదికల్లో ప్రస్తావించారు. దీంతో కేటాయించిన నిధులు, వాస్తవ ఖర్చు, తొలగించిన చెత్త పరిమాణంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత పనులపై సమగ్ర విచారణ జరిపి నిధుల వినియోగంపై లెక్కలు వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

మళ్లీ రూ.17 కోట్లతో బయోమైనింగ్..

గత అనుభవాలు ఉన్నప్పటికీ సమస్య పరిష్కారానికి తాజాగా మరోసారి బయోమైనింగ్‌ను ఆశ్రయిస్తున్నారు. అక్టోబర్ 29న తొలి దశ పనుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.17 కోట్లు మంజూరు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. అక్టోబర్ 10న డంపింగ్ యార్డును పరిశీలించిన మేయర్ కొలగాని శ్రీనివాస్ నాలుగు యంత్రాలతో పనులు చేపట్టి ఆరు నుంచి ఏడు నెలల్లో సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల చెత్త తొలగిస్తామని ప్రకటించారు. అక్టోబర్ 14న కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులతో కలిసి యార్డును పరిశీలించి మంటలు, పొగ నియంత్రణతో పాటు బయోమైనింగ్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అయితే గతంలోనూ కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా ఫలితం లేకపోవడంతో ఈసారి పనులు ఎంతవరకు పూర్తవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. నిధుల మంజూరు, యంత్రాల ఏర్పాటు ప్రకటనలకే పరిమితం కాకుండా నిర్దేశిత గడువులో చెత్తను పూర్తిగా తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తరలింపుపైనా తీరని వివాదం..

ప్రస్తుత డంపింగ్ యార్డును నగరానికి దూరంగా తరలించాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. మార్చి 11న మంత్రి పొన్నం ప్రభాకర్ యార్డును పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపుతామని ప్రకటించారు. సుమారు 30 ఏళ్లుగా పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ఏడాది సమయం పట్టవచ్చని తెలిపారు. కరీంనగర్-వరంగల్ మధ్య కొత్త డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. అయితే హుజూరాబాద్ మండలం సిర్సపల్లి--రంగాపూర్ ప్రాంతానికి తరలింపు ప్రతిపాదనపై స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. వ్యవసాయ భూములు, పంటలు, ప్రజల ఆరోగ్యానికి నష్టం వాటిల్లుతుందని ఆందోళనలు చేపట్టారు. జాయింట్ యాక్షన్ కమిటీ నిరసనలకు దిగగా, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి 24 గంటల దీక్ష చేపట్టారు. బీజేపీ నాయకులు సైతం ప్రతిపాదనను వ్యతిరేకించారు. దీంతో ఒక ప్రాంత సమస్యకు పరిష్కారం చూపే క్రమంలో మరో ప్రాంత ప్రజలకు కాలుష్య ముప్పు కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై పడింది.

శ్వాసకోశ సమస్యలతో సతమతమవుతున్నాం



డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసిన సమయంలో ఈ ప్రాంతం నగర శివారులో ఉండేది. ఇప్పుడు నగరం విస్తరించడంతో కాలనీలు యార్డుకు చేరువయ్యాయి. ఆల్మాపురి పరిసరాల్లో పొగ, దుర్వాసనతో ప్రజలు శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నగరానికి దూరంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలి.

– ఒల్లోల్ల శ్రీనివాస్ గౌడ్, కోతిరాంపూర్

ఇంట్లో ఉండాలన్నా పొగ తప్పడం లేదు



డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే దుర్వాసన, పొగతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లల ఆరోగ్యంపై ఆందోళనతో బంధువులు సైతం మా ఇళ్లకు రావడానికి వెనుకాడుతున్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ సహా ప్రజాప్రతినిధులంతా స్పందించి యార్డును తరలించాలి.

– లత, హౌసింగ్ బోర్డు కాలనీ

పొగతో ఊపిరి పీల్చుకోలేకపోతున్నాం



ఇంట్లో తలుపులు, కిటికీలు మూసుకున్నా వెంటిలేటర్ల ద్వారా పొగ లోపలికి వస్తోంది. బయటకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంది. శ్వాస తీసుకోవడమే కష్టంగా మారుతోంది. ఈ సమస్య నుంచి మాకు విముక్తి కల్పించాలి.

– బద్దం పుష్పలత, ఆల్మాపురి కాలనీ

భక్తులు ఎక్కువసేపు ఉండలేని పరిస్థితి



ఆలయం పక్కనే చెత్త గుట్టలు ఉండటంతో భక్తులు దుర్వాసన, కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బోనాల సమయంలో ఆలయానికి వచ్చే భక్తులు ఎక్కువసేపు ఉండలేని పరిస్థితి. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా డంపింగ్ యార్డును వెంటనే తరలించాలి.

– కోడూరి మహేందర్ గౌడ్, శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయం ఇన్‌చార్జి

తరలించకుంటే ఉద్యమిస్తాం



గతంలో మేయర్ పీఠం ఇస్తే నెల రోజుల్లో డంపింగ్ యార్డును తరలిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ఇప్పుడు సాకులు చెబుతోంది. మరోవైపు హుజూరాబాద్ ప్రాంతానికి తరలింపు ప్రతిపాదనను కూడా బీజేపీ నాయకులే వ్యతిరేకించారు. ఇప్పటికైనా యార్డును తరలించి శాశ్వత పరిష్కారం చూపాలి. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

– గుడికందుల సత్యం, సీపీఎం నగర కార్యదర్శి

గత నిధులపై విచారణ జరపాలి

గతంలో రూ.16 కోట్లతో బయోమైనింగ్ పనులు చేపట్టి యంత్రాలు తీసుకొచ్చిన కొద్దిరోజులకే పనులు నిలిచిపోయాయి. ఆ నిధుల్లో ఎంత ఖర్చు చేశారు? ఎంత చెత్త తొలగించారు? అనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలి. కొత్తగా కేటాయించిన రూ.17 కోట్ల పనులు కూడా మధ్యలో ఆగిపోకుండా పూర్తిచేయాలి.

– పైడిపల్లి రాజు, సీపీఐ నాయకుడు



టీజీఐఐసీ భూ బాధితులకు అండగా ఉంటాం

జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

హైదరాబాద్ (జనంసాక్షి) : హార్డ్‌వేర్ పార్క్ భూసేకరణతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల, ఎం.ఎం. కుంట, నాదర్‌గుల్ పరిధిలోని భూ సమస్య పరిష్కారం కోసం పూర్తి వివరాలతో కూడిన లేఖను ఎంపీ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. బాధితులందరూ ఐక్యంగా ఉద్యమించినప్పుడే సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో హార్డ్‌వేర్ పార్క్ భూసేకరణ బాధితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. గతంలో అధికారులను కలిసినప్పుడు స్పష్టమైన సమాధానం రాకుండా సమావేశాలను వాయిదా వేస్తూ వచ్చారని అన్నారు. ప్రస్తుతం భూముల విస్తీర్ణం, ప్రస్తుత పరిస్థితి, న్యాయపరమైన అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు, పత్రాలను సేకరించామని తెలిపారు. వీటి ఆధారంగా ప్రభుత్వాన్ని నిర్దిష్టంగా ప్రశ్నించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. బాధితులు నిరాశ చెందకుండా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నరసింహ మాట్లాడుతూ.. టీజీఐఐసీ బాధితులకు న్యాయం జరిగే వరకు సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. గతంలో పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు సాధించడంలో సీపీఐ కీలకంగా పనిచేసిందని గుర్తుచేశారు. రాజకీయ పార్టీల పోరాటంతో పాటు బాధితుల ఐక్యత కూడా అవసరమని, అందరూ కలిసికట్టుగా ఉద్యమించాలని సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, టీజేఎస్ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, జేఏసీ నాయకులు, బాధితులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో బాంబులు పేలుస్తాం..

పోలీసులకు బెదిరింపు మెయిల్



హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ నగరంలో పలుచోట్ల బాంబులు పేలుస్తామని పోలీసులకు బెదిరింపు మెయిల్ వచ్చింది. దాంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ముంబైలో 26/11 ఉగ్రదాడి తరహాలో దాడి జరుగుతుందని ఆ మెయిల్‌లో హెచ్చరించారు. కాచిగూడ రైల్వేస్టేషన్ లక్ష్యంగా దాడులు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. హోటల్ టూరిస్ట్ ప్లాజా వద్ద కూడా బాంబు పేలుస్తామని ఆ మెయిల్‌లో హెచ్చరిక చేశారు. లతీఫ్ భట్ హత్యకు ప్రతీకారంగా దాడులు చేస్తామని మెయిల్‌లో బెదిరించారు. దాంతో హైదరాబాద్ నగర పోలీసులను స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అప్రమత్తం చేశారు. లష్కరే తోయిబా పేరుతో మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇటీవల జమ్ముకశ్మీర్‌లో లష్కరే తోయిబా టాప్ కమాండర్, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది లతీఫ్ భట్‌ను భద్రతాబలగాలు హతమార్చాయి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370